శనివారం
10•8•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 46
• పేజీలు: 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

కీర్తి కెరటాలు!

తెలుగుచిత్రాలకు అవార్డులపంట

4 సినిమాలకు 7 పురస్కారాలు

66వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు సినిమాలకు అవార్డుల పంట పండింది. అలనాటి మహానటి సావిత్రి జీవితకథ ఆధారంగా రూపొందించిన 'మహానటి' చిత్రానికి మొత్తం మూడు అవార్డులు లభించాయి. 2018వ సంవత్సరానికిగాను శుక్రవారం ప్రకటించిన జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో 'మహానటి' చిత్రం ఉత్తమ తెలుగుచిత్రంగా ఎంపికయ్యింది. మహానటి సావిత్రి పాత్రపోషించిన కీర్తిసురేశ్‌కు జాతీయ ఉత్తమనటి అవార్డు లభించింది. ఇదే సినిమాకు పనిచేసిన ఇంద్రాక్షి పట్నాయక్, గౌరంగ్‌షా, అర్చనారావుకు ఉత్తమ కాస్ట్యూమ్‌డిజైనర్ అవార్డులు దక్కాయి. దీనితోపాటు తెలుగులో నిర్మించిన 'అ!' చిత్రానికి మేకప్, ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్ అవార్డులు వరించాయి. చి.ల.సౌ. చిత్రానికి ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే అవార్డుతోపాటు 'రంగస్థలం' చిత్రానికి ఉత్తమ ఆడియోగ్రఫీ అవార్డులు లభించాయి. దీంతో తెలుగులో మొత్తం నాలుగుచిత్రాలకు కలిపి మొత్తం ఏడు అవార్డులు దక్కినట్టయ్యింది. జాతీయ ఉత్తమనటులుగా ఆయుష్మాన్ ఖురానా (అంధాధున్), విక్కీకౌశల్ (యురి) ఎంపికయ్యారు. గుజరాతీ చిత్రం 'హెల్లారో'ను జాతీయ ఉత్తమచిత్రం అవార్డు వరించింది. ఉత్తమ దర్శకుడిగా ఆదిత్యధర్ (యురి) అవార్డు గెలుచుకున్నారు. వివరాలు జిందగీలో

ఆయుష్మాన్‌ఖురానా

విక్కీకౌశల్

- జాతీయ ఉత్తమనటిగా కీర్తిసురేశ్
- తెలుగులో ఉత్తమచిత్రంగా మహానటి
- సత్తాచాటిన 'అ!', రంగస్థలం, చి.ల.సౌ. చిత్రాలు
- జాతీయ ఉత్తమనటులుగా ఖురానా, విక్కీకౌశల్
- జాతీయ ఉత్తమ దర్శకుడిగా ఆదిత్యధర్
- జాతీయ ఉత్తమచిత్రంగా హెల్లారో

శుక్రవారం సాయంత్రం శ్రీశైలం ప్రాజెక్టు నాలుగు గేట్ల నుంచి దుంకుతున్న కృష్ణమ్మ

శ్రీశైలం గేట్లు ఎత్తివేత

శుక్రవారం శ్రీశైలం ఆరో నంబరు గేటును ఎత్తుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఏపీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ కూడా ఉన్నారు.

- పూజలుచేసి గేట్లు ఎత్తిన తెలుగు రాష్ట్రాల మంత్రులు
- ఆరు గేట్ల ద్వారా 1.59 లక్షల క్యూసెక్కుల విడుదల
- విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 73వేల క్యూసెక్కులు
- మొత్తంగా దిగువకు 2,63,644 క్యూసెక్కుల నీరు
- నాగార్జునసాగర్ దిశగా కృష్ణమ్మ పరవళ్లు
- శ్రీశైలం డ్యామ్ వద్ద మనోహర దృశ్యం
- జూరాల నుంచి 4.87 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 196 టీఎంసీలకు పెరిగిన శ్రీశైలం నీటిమట్టం
- ఎగువనుంచి ప్రాజెక్టులకు పోటెత్తుతున్న వరద
- నేడు ఆల్మట్టికి 5 లక్షల క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో!

నాగర్‌కర్నూల్ ప్రతినిధి/ మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి/ హైదరాబాద్, నమస్తే తెలంగాణ/అచ్చంపేట/అమ్రాబాద్ రూరల్:

శ్రీశైలం ప్రాజెక్టు వద్ద అపూర్వ దృశ్యం సాక్షాత్కారమైంది. ఎగువ నుంచి వస్తున్న భారీ వరద ప్రవాహాలతో వేగంగా నిండిన శ్రీశైలం డ్యామ్ గేట్లు ఈ సీజన్‌లో తొలిసారి తెరుచుకున్నాయి. ఆరు గేట్ల ద్వారా పాలనురుగును తలపిస్తూ జలాలు కిందికి దుంకుతున్న దృశ్యం ముగ్ధమనోహరంగా కనిపిస్తున్నది. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో తెలంగాణ, ఏపీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అనిల్‌కుమార్‌యాదవ్, నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, శ్రీశైలం ప్రాజెక్టు సీఈ నారాయణరెడ్డి, ఏపీ ప్రజాప్రతినిధులు, ప్రాజెక్టు అధికారులు ప్రత్యేక పూజలుచేసిన అనంతరం శ్రీశైలం గేట్లు ఎత్తి సాగర్‌కు నీటివిడుదల ప్రారంభించారు. తొలుత ఐదు గేట్లను ఎత్తినా.. ఒక గేటు

మిగతా 3వ పేజీలో

శుక్రవారం లక్ష్మీపూర్ సర్జ్‌పూల్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్. చిత్రంలో ఎమ్మెల్సీ నారదాసు, ఎమ్మెల్యే రవిశంకర్, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, తుల ఉమ తదితరులు కూడా ఉన్నారు

కండ్లు తెరిచి కాళేశ్వరం చూడండి

అసత్య ప్రచారాలు మానుకోండి.. లేదంటే అవస్థల పాలవుతారు
సీఎం కేసీఆర్ రీడిజైనింగ్ చేయడంవల్లే కల నెరవేరుతున్నది
కాళేశ్వరానికి జాతీయ హోదా ఇచ్చి నిధులు కేటాయించాలి
వరద కాలువను జీవనదిలా మారుస్తున్న ఘనత మాదే
మీడియా సమావేశంలో మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్

2

కశ్మీర్‌లో ఆంక్షల సడలింపు

శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలకు అనుమతి

- జమ్ము గవర్నర్‌ను కలిసిన అజిత్‌దోవల్ 5
- కశ్మీర్‌కు వెళ్లేందుకు ప్రయత్నించిన ఏచూరి, డీ రాజా
- శ్రీనగర్‌లో అడ్డుకొని వెనక్కిపంపిన అధికారులు

శుక్రవారం ప్రార్థనల సందర్భంగా జమ్ములోని ఒక మసీదు వద్ద భద్రతా బలగాలు

సంఝౌతా ఎక్స్‌ప్రెస్ వాపస్

117 మంది ప్రయాణికులతో ఢిల్లీ చేరుకున్న రైలు

రైలు సర్వీసు రద్దుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్న భారత రైల్వే

5

జూనియర్ డాక్టర్ల సమ్మె విరమణ

మంత్రి ఈటలతో చర్చలు సఫలం ▪ నేటినుంచి విధులకు హాజరు
బక్రీద్ రోజున కూడా ఓపీ సేవలు ▪ ఎన్ఎంసీపై పోరు ఆగదని స్పష్టీకరణ

2

సీపీగెట్ ఫలితాలు విడుదల

95.88 శాతం ఉత్తీర్ణత నమోదు

13 నుంచి కౌన్సెలింగ్, సెప్టెంబర్ 3 నుంచి తరగతులు

2

ధర్మగంట

దళితుడి భూమి ఆక్రమణ

అమ్మేసి సొమ్ముచేసుకున్న మాజీ సర్పంచ్

స్పందించని జనగామ జిల్లా లింగాల ఘనపురం రెవెన్యూ అధికారులు

ధర్మగంటను ఆశ్రయించిన రైతు పసుల నర్సయ్య

9

బాధిత రైతు పసుల నర్సయ్య

చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)

ఫారం ధర	73.00	రిటైల్ లైవ్	95.00
డ్రెస్‌డ్	138.00	స్కిన్‌లెస్	157.00

గుడ్ల ధరలు (వందకు) (రూ.)

హైదరాబాద్	328.00	రంగారెడ్డి	328.00
మెదక్	328.00	కరీంనగర్	331.00
వరంగల్	331.00	చిల్లర ధర	3.90

భూఅక్రమాలపై కలెక్టర్‌కు నివేదిస్తాం

- విచారణ అధికారులు భూపత్రాలను పరిశీలిస్తున్నారు
- నల్లగొండ జిల్లా చందంపేట తాసిల్దార్ దేస్యనాయక్
- 'అడవిని అమ్మేశారు' కథనానికి స్పందన

9

చిప్పలపల్లిని ఆదర్శంగా తీసుకోవాలి

ట్విట్టర్‌లో కేటీఆర్ పిలుపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి గ్రామంలో రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పిలుపునిచ్చారు. ఈ గ్రామంలో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయని, ఈ చెట్ల ద్వారా ప్రకృతి మరింత శోభను సంతరించుకున్నదని శుక్రవారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

బీటెక్ అగ్రి కోర్సులకు 16న ఫైనల్ కౌన్సెలింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం బీటెక్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్, ఫుడ్‌టెక్నాలజీ కోర్సుల్లో మిగిలిన సీట్లను భర్తీచేయడానికి ఈనెల 16న ఫైనల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఎగ్జామినేషన్ సెంటర్‌లో ఎంసీసీ స్ట్రీం ఫార్మర్స్ కోటా విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సుధీర్‌కుమార్ తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ గ్రూప్ చదివి, తెలంగాణ ఎంసెట్-2019 (ఇంజినీరింగ్ స్ట్రీమ్)లో మెరిట్ సాధించి, విశ్వవిద్యాలయంలో ఫార్మర్స్ కోటాకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకావచ్చన్నారు. సీటుపొందిన అభ్యర్థులు వెంటనే రూ.36,450 ఫీజు చెల్లించాలని.. లేకపోతే అడ్మిషన్ రద్దుచేస్తామని చెప్పారు. pjtsau.edu.in వెబ్‌సైట్‌లో పూర్తివివరాలను చూడవచ్చని తెలిపారు. అదేవిధంగా బీఎస్సీ (హానర్స్) కమ్యూనిటీ సైన్స్ కోర్సులో మిగిలినసీట్ల భర్తీకి మధ్యాహ్నం 2 గంటలకు తుది కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఖాళీల వివరాలు, మెరిట్ లిస్టును విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

అగ్రివర్సిటీలో పేమెంట్స్‌కోటా కౌన్సెలింగ్‌కు ప్రత్యేక షెడ్యూల్

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీలోని బైపీసీ స్ట్రీం కోర్సులైన బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్, బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చర్ కోర్సుల పేమెంట్‌కోటా కోసం కౌన్సెలింగ్ షెడ్యూలు విడిగా ఇవ్వనున్నట్టు రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సుధీర్‌కుమార్ తెలిపారు. బైపీసీ స్ట్రీం కోర్సుల కౌన్సెలింగ్ ఈనెల 7న ప్రారంభమైందని తెలిపారు. మొదటి మూడ్రోజుల తర్వాత వివిధ కోర్సుల్లో మిగిలిన ఖాళీల వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ pjtsau.edu.inలో పొందుపరిచినట్టు తెలిపారు. బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ, బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చర్ కోర్సుల్లో వివిధ క్యాటగిరీల్లో సీట్ల ఖాళీలను అనుసరించి అభ్యర్థులు కౌన్సిలింగ్‌కు హాజరుకావొచ్చని చెప్పారు.

14 మంది ఖైదీల విడుదల

- ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహాత్మా గాంధీ 150వ జయంతి వేడుకలను పురస్కరించుకొని ఖైదీల విడుదలకు కేంద్ర హోంమంత్రిత్వశాఖ పలు మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో 14 మంది ఖైదీలను విడుదల చేస్తున్నట్టు రాష్ట్రప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి రానున్నట్టు పేర్కొన్నది. ఖైదీల ప్రవర్తన, నిబంధనలను అనుసరించి హైలెవల్ కమిటీ విడుదల చేయాల్సిన ఖైదీలను ఎంపిక చేసినట్టు తెలిపింది.

కరీంనగర్ జిల్లాలోని లక్ష్మీపూర్ సర్జ్‌పూల్‌లోని బాహుబలి మోటర్ల వద్ద విజయచిహ్నం చూపుతున్న మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్. చిత్రంలో ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

కండ్లు తెరిచి చూడండి

కాళేశ్వరంపై అసత్య ప్రచారాలు మానండి.. లేదంటే అవస్థల పాలవుతారు

- కాంగ్రెస్‌కు మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ హితవు
- సీఎం కేసీఆర్ రీడిజైనింగ్ చేయడంవల్లే కల నెరవేరుతున్నది
- కాళేశ్వరానికి జాతీయ హోదా ఇచ్చి నిధులు కేటాయించాలి

కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ/మల్యాల: 'కాంగ్రెస్ నాయకులు కండ్లు తెరచి కాళేశ్వరం ప్రాజెక్టు పనులు చూడాలి. ప్రపంచం గర్వించదగిన ప్రాజెక్టుపై ఇకనైనా అసత్య ప్రచారం మానుకోవాలి. లేదంటే అవస్థల పాలవడం ఖాయం. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చి నిధులు ఇవ్వకపోతే తెలంగాణలో బీజేపీకి పుట్టగతులుండవు' అని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ హెచ్చరించారు. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ సర్జ్‌పూల్‌ను, జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్ శివారులో నిర్మిస్తున్న పంప్‌హౌస్‌ను సందర్శించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరంపై కాంగ్రెస్‌కు చెందిన జీవన్‌రెడ్డి, పొన్నాల, తదితర నాయకులు అవగాహనారాహిత్యంతో విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారని, ఇది పూర్తిగా వారి స్థాయిని దిగజార్చుకోవడమే అని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైనింగ్ ఎందుకు చేపట్టాల్సి వచ్చిందో అసెంబ్లీలో సీఎం కేసీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తే.. అప్పుడు ముఖం చాటేసిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు.

వీటిన్నింటికి మీరే కారకులు కాదా?

'కాంగ్రెస్ హయాంలో ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తమ్మిడిహట్టి వద్ద మహారాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండానే ఎఫ్ ఆర్ఎల్ 152 మీటర్లుగా నిర్ధారించడం.. ఆనాడు మహారాష్ట్రలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రతిపాదనను వ్యతిరేకించడం వాస్తవం కాదా? 148 మీటర్లకు తగ్గించుకోమని మహారాష్ట్ర ప్రభుత్వం సూచించినా వినకుండా పనులకు పూనుకున్నది మీరు కాదా?' అని వినోద్‌కుమార్ ప్రశ్నించారు. 'తమ్మిడిహట్టి వద్ద మీ ప్రభుత్వం ప్రతిపాదించిన 160 టీఎంసీల నీటిని తరలించేందుకు లభ్యత లేదని, పునరాలోచన చేయాలని 2008లో కేంద్ర జలసంఘం చెప్పడం వాస్తవం కాదా?, ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు కింద రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం పెంచుకోవాలని కేంద్ర జలసంఘం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించిన విషయం మరిచిపోయారా?' అని నిలదీశారు. కేంద్ర జలసంఘం సూచనల మేరకు సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైనింగ్‌కు శ్రీకారం చుట్టారని, తన దౌత్యనీతిని ప్రదర్శించి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల, మిడ్ మానేరు వరకు మూడేండ్లలోనే పనులను పూర్తిచేస్తే.. కండ్లు ఉండి కూడా చూడలేని గుడ్డివాళ్లలా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని అన్నారు. ఇంత అద్భుతమైన ప్రాజెక్టు ఇంతవరకు చూడలేదని సాక్షాత్తు కేంద్ర జలసంఘం చైర్మన్ కితాబు ఇస్తుంటే.. కాంగ్రెస్ నాయకులు మాత్రం తమ వక్రబుద్ధిని వదులుకోవడం లేదని తప్పుబట్టారు. సీఎం కేసీఆర్ ఆలోచనల్లో నుంచి పుట్టిన పునరుజ్జీవ పథకంతో నిరుపయోగంగా మారిన శ్రీరాంసాగర్ వరద కాలువ 365 రోజులు నీటితో కళకళలాడే జీవనదిలా మారనున్నదని హర్షం వ్యక్తంచేశారు. ఇంత మంచి ప్రాజెక్టును రూపొందించి నిర్మాణం చేపడితే కొందరు దీనిపై అనవసరపు రాజకీయ రాద్ధాంతం చేస్తున్నారన్నారు.

జాతీయహోదా ఇవ్వాల్సిందే

కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా జాతీయ హోదా ఇవ్వకపోతే.. తెలంగాణలో ఆ పార్టీకి పుట్టగతులుండవని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ హెచ్చరించారు. గత ఐదేండ్లుగా ఎన్నోసార్లు ప్రధాని మోదీతోపాటు కేంద్ర మంత్రులను కలిసి జాతీయ హోదా ఇవ్వాలని అడుగుతూనే ఉన్నామన్నారు. జటిలమైన 370 ఆర్టికల్‌ను రద్దుచేసిన కేంద్రం.. రాష్ట్ర పునర్విభజన చట్ట సవరణ ఎందుకు చేయడంలేదని ప్రశ్నించారు. పునర్విభజన చట్టానికి సవరణ చేసిపోలవరంతో సమానంగా కాళేశ్వరానికి కూడా జాతీయ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, సూడా చైర్మన్ జీవీ రామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణగౌడ్, జగిత్యాల జిల్లా జెడ్పీ వైస్‌చైర్మన్ వొద్దినేని హరిచరణ్‌రావు, ఎంపీపీలు మిట్టపెల్లి విమల, శ్రీరాం మధు, సహకార సంఘాల చైర్మన్లు మురళీకృష్ణారెడ్డి, సాగర్‌రావు, వీర్ల వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తలసేమియాను తరిమేయొచ్చు

- వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్
- మైలార్‌దేవ్‌పల్లిలో కమల హాస్పిటల్, రిసెర్చ్ సెంటర్ ప్రారంభం

శుక్రవారం రాజేంద్రనగర్ మండలం పరిధిలోని శివరాంపల్లిలో తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ భవనాన్ని ప్రారంభించిన అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు కూడా ఉన్నారు.

బండ్లగూడ: గర్భిణులు అప్రమత్తంగా వ్యవహరిస్తే తలసేమియా వ్యాధిని తరిమేయొచ్చని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. తలసేమియాతో బాధపడుతున్నవారికి ఆరోగ్యశ్రీని వర్తింపజేసి సర్కారు నెలకు రూ.6500 అందిస్తున్నదని తెలిపారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి మైలార్‌దేవ్‌పల్లిలోని రాఘవేంద్ర కాలనీలో తలసేమియా , సికిల్ సెల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కమల్ హాస్పిటల్, రిసెర్చ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ.. నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు సర్కారు కృషిచేస్తున్నదని పేర్కొన్నారు. తలసేమియా వ్యాధి బాధితులకు ప్రభుత్వం తరపున ఎలాంటి సాయం అందించేందుకైనా తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న అనేక మందికి కంటి వెలుగు కార్యక్రమం ద్వారా సేవలందించామని, దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ శుద్ధజలాన్ని అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే నిరుపేదల సంక్షేమానికి అనేక పథకాలు చేపట్టి అమలుచేస్తున్నామని పేర్కొన్నారు. ఈ వ్యాధి గురించి ఆలోచించి హాస్పిటల్ ఏర్పాటుచేసిన తలసేమియా, సికిల్‌సెల్ సొసైటీ సభ్యులను ఆయన అభినందించారు. ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. తలసేమియాను తరిమికొట్టేందుకు ప్రతిఒక్కరు బాధ్యత తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న తలసేమియా వ్యాధిగ్రస్థులకు ప్రభుత్వం తరపున సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీవీ లక్ష్మీనారాయణ, శ్యామ్‌సుందర్‌లోయ, వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు, సొసైటీ తలసేమియా, సికిల్‌సెల్ సొసైటీ సభ్యులు చంద్రకాంత్ అగర్వాల్, రత్నవాలి కొత్తపల్లి, సుమన్‌జైన్, అలీమ్‌బేగ్, మనోజ్ రూపాని, నరేశ్‌రాఠీ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ల సమ్మె విరమణ

- మంత్రి ఈటలతో చర్చలు సఫలం
- నేటినుంచి విధులకు హాజరు
- బక్రీద్ రోజున కూడా ఓపీ సేవలు

జాతీయ వైద్య కమిషన్ బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్రంలో సమ్మెకు దిగిన జూనియర్ వైద్యులతో చర్చల అనంతరం మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) బిల్లును వ్యతిరేకిస్తూ గత తొమ్మిది రోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కొనసాగిస్తున్న జూనియర్ డాక్టర్లు, రెసిడెంట్ వైద్యులు శుక్రవారం సాయంత్రం తమ సమ్మెను విరమించారు. తమ సమస్యలపై శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్‌తో జరిపిన చర్చలు సఫలమవడంతో సమ్మె విరమించాలని నిర్ణయించారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, బ్రిడ్జికోర్సు, ఎగ్జిట్ పరీక్ష, ప్రైవేటు మెడికల్ కళాశాలలకు 50 శాతం సీట్ల కేటాయింపు తదితర అంశాలను సవరించాల్సిందిగా కేంద్రంతో సంప్రదింపులు జరుపుతామని మంత్రి ఈటల హామీనివ్వడంతో సమ్మె విరమిస్తున్నామని నిమ్స్ రెసిడెన్సీ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ గుండగాని శ్రీనివాస్ వెల్లడించారు. మంత్రి ఈటల సూచన మేరకు శనివారం నుంచి సాధారణ విధుల్లో పాల్గొనాలని నిర్ణయించుకున్నామని, బక్రీద్ రోజున కూడా ఓపీ సేవలు అందిస్తామని తెలిపారు. మంత్రి ఈటలతో భేటీ అయినవారిలో తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నరేశ్, సలహాదారు డాక్టర్ విజయేందర్, గాంధీ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ లోహిత్‌రెడ్డి, డాక్టర్ నాగార్జున తదితరులు ఉన్నారు.

త్వరలో ఢిల్లీలో ఆందోళన

జూనియర్ డాక్టర్ల సమ్మె విరమణతో రోగులకు కష్టాలు తప్పినట్టయింది. అయితే ఎన్ఎంసీ బిల్లులోని అభ్యంతరకరమైన నిబంధనలపై తమ పోరాటం కొనసాగుతుందని, ఈ బిల్లును న్యాయపరంగా సవాలుచేసే అంశం కూడా తమ కార్యాచరణ ప్రణాళికలో ఉంటుందని తెలంగాణ జూనియర్ డాక్టర్ల జేఏసీ స్పష్టంచేసింది. ఎన్ఎంసీ బిల్లుకు వ్యతిరేకంగా పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు ముందు ఢిల్లీలో నిరసన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు అవసరమైతే నిరవధిక సమ్మెకు పిలుపునిస్తామని పేర్కొన్నది.

గాంధీ దవాఖానలో వైద్య విద్యార్థుల ధర్నా

అంతకుముందు తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో గాంధీ దవాఖాన వైద్య విద్యార్థులు ఎన్ఎంసీ బిల్లుకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ బిల్లు వల్ల సామన్య ప్రజలకు తలెత్తే ఇబ్బందుల గురించి దవాఖానలోని రోగులకు, వారి బంధువులకు వివరించినట్టు తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం గాంధీ దవాఖాన యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ లోహిత్ తెలిపారు. డాక్టర్ అర్జున్, డాక్టర్ మహేశ్, డాక్టర్ రవివర్మ, డాక్టర్ నాగార్జున, డాక్టర్ మురళి, డాక్టర్ హేమంత్, డాక్టర్ మనోజ్, డాక్టర్ హర్శాంత్, డాక్టర్ స్నిగ్ధ తదితరులు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.01 గంటలకు

సూర్యాస్తమయం: 6.41 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం దశమి ఉదయం 10.11 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: జ్యేష్ఠ రాత్రి 11.07 వరకు, అమృతఘడియలు: మధ్యాహ్నం 1.54 నుంచి 3.30 వరకు, రాహుకాలం: ఉదయం 9.11 నుంచి 10.46 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.01 నుంచి 7.43 వరకు, వర్జ్యం: లేదు.

మూడ్రోజుల్లో సచివాలయం తరలింపు పూర్తి

- మంగళవారం నుంచి బీఆర్కేభవన్‌లోనే కార్యకలాపాలు
- తమకు కేటాయించిన చాంబర్లను పరిశీలించిన సీఎస్.. పూజచేసిన రామకృష్ణారావు

బీఆర్కేభవనాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎస్ ఎస్కే జోషి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శని, ఆది, సోమవారాల్లో వరుసగా సెలవులు రావడంతో ఈ మూడ్రోజుల్లో సచివాలయ తరలింపు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ప్రక్రియను అధికారులు వేగవంతంచేశారు. మంగళవారం నుంచి బూర్గుల రామకృష్ణారావు భవన్ (బీఆర్కేభవన్)లోనే పూర్తిగా సచివాలయ కార్యకలాపాల నిర్వహణ జరుగనున్నది. శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి బీఆర్కేభవన్‌లో తనకు కేటాయించిన చాంబర్‌ను పరిశీలించి, కొద్దిసేపు అక్కడ కూర్చున్నారు. అనంతరం భవన్‌లోని ఇతర విభాగాలను పరిశీలించారు. ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు తన చాంబర్‌లో పూజలు నిర్వహించారు. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారి, జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్‌సిన్హా, నీటిపారుదల, కమర్షియల్‌ట్యాక్స్, ఎక్సైజ్‌శాఖల ముఖ్య కార్యదర్శి సోమేశ్‌కుమార్ కూడా తమ చాంబర్లను తరలించారు.

'ఒకే దేశం- ఒకే కార్డు' ప్రారంభం

- పోర్టబిలిటీని ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించిన కేంద్రమంత్రి పాశ్వాన్
- తొలుత నాలుగురాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్టు అమలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'ఒకే దేశం- ఒకే కార్డు' పైలట్ ప్రాజెక్టును కేంద్ర ప్రజాపంపిణీ శాఖ మంత్రి రాంవిలాస్‌పాశ్వన్ ఢిల్లీ నుంచి ఆన్‌లైన్ ద్వారా హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఇకనుంచి రెండు తెలుగురాష్ట్రాల్లోని లబ్ధిదారులు ఎక్కడైనా రేషన్ తీసుకోవటం సాధ్యమవుతుంది. తొలుత ఈ విధానాన్ని తెలంగాణ-ఏపీ, మహారాష్ట్ర-గుజరాత్ రాష్ట్రాల్లో అమలుచేస్తున్నారు. 2020 జూన్ 1నాటికి దేశవ్యాప్తంగా అమలుచేయనున్నట్టు పాశ్వాన్ తెలిపారు. శుక్రవారం ఆదర్శనగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ రేషన్‌షాపులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్‌సబర్వాల్ పాల్గొని కేంద్ర మంత్రి పాశ్వాన్‌తో సంభాషించారు. తెలంగాణలో ఈ విధానం 2018 ఏప్రిల్ 1 నుంచి అమలులో ఉన్నదని, గడిచిన 14 నెలల్లో దాదాపు రెండుకోట్ల మందికిపైగా పోర్టబిలిటీ ద్వారా సరుకులు తీసుకున్నారని అకున్ సబర్వాల్ వివరించారు. బియ్యం నాణ్యత విషయంలో రాజీపడటంలేదని వివరించారు.

ఏపీ లబ్ధిదారుడికి బియ్యం

పంజాగుట్టలోని అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి వాసి ఈశ్వర్‌రావు.. జాతీయ పోర్టబిలిటీ విధానం ద్వారా తొలుత బియ్యం తీసుకొన్నారు. ఈ సందర్భంగా అకున్‌సబర్వాల్ మాట్లాడుతూ.. ఇకనుంచి జాతీయ ఆహారభద్రతా చట్టం పరిధిలోని రేషన్ లబ్ధిదారులు తెలుగురాష్ట్రాల్లో ఎక్కడైనా వేలిముద్ర లేదా ఐరిస్ ఉపయోగించి సరుకులు తీసుకోవచ్చని చెప్పారు.

2020 జనవరికి ఒకే గ్రిడ్‌గా 11 రాష్ట్రాలు

హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, కేరళ, పంజాబ్, రాజస్థాన్, త్రిపుర రాష్ట్రాల్లో కూడా అంతర్గతంగా ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలుచేస్తున్నారు. 2020 జనవరి నాటికి ఈ ఏడు రాష్ట్రాలతోపాటు తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, గుజరాత్‌లతో కలిపి మొత్తం పదకొండు రాష్ట్రాలను ఒక గ్రిడ్ కిందకు తీసుకొరానున్నట్టు కేంద్ర ఆహారశాఖ కార్యదర్శి రవికాంత్ తెలిపారు.

ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని రేషన్‌దుకాణం నుంచి ఆన్‌లైన్ ద్వారా కేంద్ర మంత్రి పాశ్వాన్‌తో ముచ్చటిస్తున్న అకున్ సబర్వాల్ .. ఏపీకి చెందిన ఈశ్వర్‌రావుకు బియ్యం అందజేస్తున్న అకున్ సబర్వాల్

లోకం పోకడ

భారత్ సిన్మాలు తీసేసి మన సిన్మాలే ప్రదర్శిస్తున్నాం సాబ్!

సీపీగెట్ ఫలితాలు విడుదల

- 95.88 శాతం ఉత్తీర్ణత నమోదు
- 13 నుంచి కౌన్సెలింగ్, సెప్టెంబర్ 3 నుంచి తరగతులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో పోస్టు గ్రాడ్యుయేషన్ (ఎంఏ, ఎంఎస్సీ, ఎంకాం, ఎంఎల్ ఐసీ, ఎంఎడ్) కోర్సులకు జూలై 8 నుంచి 20 వరకు నిర్వహించిన కామన్ పీజీ ప్రవేశపరీక్ష (సీపీగెట్-2019) ఫలితాల్లో విద్యార్థినులు పైచేయి సాధించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఈ ఫలితాలను విడుదల చేశారు. ఓయూ, కేయూ, ఎస్‌యూ, టీయూ, ఎంజీయూ, పీయూ, జేఎన్టీయూహెచ్‌లో 60 రకాల పీజీ కోర్సులకు నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షలకు ఏడు యూనివర్సిటీల నుంచి మొత్తం 90,354 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్నారు. వారిలో విద్యార్థులు 35,616 మంది, విద్యార్థినులు 54,728 మంది ఉన్నారు. మొత్తం విద్యార్థుల్లో 78,032 మంది పరీక్షలకు హాజరవగా 74,815 మంది అర్హత సాధించారు. 95.88 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

కామర్స్ సబ్జెక్టుకే అధిక డిమాండ్

డిగ్రీలో బీకాం మాదిరిగానే పీజీలో కూడా విద్యార్థులు ఎంకాంకు ఎక్కువ మొగ్గుచూపారని, పీజీ ప్రవేశపరీక్షలకు హాజరైనవారిలో కామర్స్ విద్యార్థులు 20,632 మంది ఉన్నారని పాపిరెడ్డి పేర్కొన్నారు. ఆ తర్వాత కెమిస్ట్రీకి 8,179 మంది, గణితానికి 7,940 మంది పరీక్షలు రాశారని వివరించారు. ఎంఏ తెలుగుకు 4,454 మంది, ఎంఏ ఇంగ్లీష్‌కు 3,748 మంది, ఎంఏ పొలిటికల్‌సైన్స్‌కు 3,290 మంది పరీక్షలు రాసినట్టు పాపిరెడ్డి తెలిపారు.

సీపీగెట్-2019 పరీక్షల ఫలితాల వివరాలు

వివరాలు	విద్యార్థులు	విద్యార్థినులు	ట్రాన్స్‌జెండర్స్	మొత్తం
పరీక్షలకు దరఖాస్తులు	35,616	54,728	10	90,354
పరీక్షలకు హాజరు	30,150	47,874	8	78,032
అర్హత సాధించినవారు	28,803	46,004	8	74,815
ఉత్తీర్ణత శాతం	95.53	96.09	100	95.88

13 నుంచి అడ్మిషన్ కౌన్సెలింగ్ ప్రారంభం

ఈ ఏడు యూనివర్సిటీల పరిధిలోని పీజీ కోర్సులకు కామన్ అడ్మిషన్ విధానాన్ని అమలుచేయాలని నిర్ణయించామని, రాష్ట్రంలోని అన్ని పీజీ కాలేజీల్లో ఈ నెల 13 నుంచి ప్రవేశాల ప్రక్రియ (అడ్మిషన్ కౌన్సెలింగ్) ప్రారంభమవుతుందని సీపీగెట్ కన్వీనర్ ప్రొఫెసర్ కిషన్ తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 16 నుంచి 24 వరకు సర్టిఫికెట్ల పరిశీలన, ఈ నెల 18 నుంచి 26 వరకు వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా ఆప్షన్లు నమోదు చేసుకునే ప్రక్రియ ఉంటుందన్నారు. ఈ నెల 29న సీట్ల కేటాయింపు పూర్తిచేసి, సెప్టెంబర్ 3 నుంచి పీజీ కాలేజీల్లో తరగతులు ప్రారంభించాలని నిర్ణయించామని, రాష్ట్రవ్యాప్తంగా కన్వీనర్ కోటాలో మొత్తం 29,600 సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సీపీగెట్‌ను సమర్థంగా నిర్వహించిన కన్వీనర్‌కు, అడ్మిషన్ కౌన్సెలింగ్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, ఓయూ ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీగెట్-2019 ఫలితాలను విడుదల చేస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి. చిత్రంలో మండలి వైస్‌చైర

పర్యావరణ కార్యకర్తలకు ఎడెక్స్ అవార్డులు

40 మందికి అందజేసిన మాజీ ఎంపీ కవిత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పర్యావరణ హితం కోసం కృషిచేసిన 40 మందికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత ఎడెక్స్ అవార్డులను ప్రదానం చేశారు. బేగంపేట ఐటీసీ కాకతీయ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో కవితతోపాటు ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం వేద కుమార్, పర్యావరణ కార్యకర్త మేధాపాట్కర్ పాల్గొన్నారు. రెండేండ్లుగా వివిధ రంగాల్లో కృషిచేసిన 40 ఏండ్లలోపు వయస్సున్న 40 మందికి ఎడెక్స్ పేరిట నిర్వాహకులు అవార్డులను అందజేస్తున్నారు. ఈ ఏడాది పర్యావరణహితం కోసం కృషిచేసిన వారికి అవార్డులు బహూకరించారు. ఈ సందర్భంగా 'జీవనశైలిలో ప్లాస్టిక్‌ను ఏ విధంగా నిషేధించాలి' అనే అంశంపై అదితి ఆనంద్ అనే బాలిక చేసిన ప్రసంగం పలువురిని ఆకట్టుకున్నది.

శుక్రవారం సచివాలయంలో కాళేశ్వరం పర్యాటక టూర్ ప్యాకేజీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ మనోహర్ తదితరులు

కాళేశ్వరం సందర్శనకు టూరిజం బస్సులు

- ప్రతి శనివారం హైదరాబాద్ నుంచి పర్యాటకశాఖ ఏర్పాట్లు
- ప్యాకేజీ బ్రోచర్‌ను ఆవిష్కరించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు హైదరాబాద్ నుంచి ప్రతి శనివారం ప్రత్యేక టూరిజం బస్సులను నడుపుతున్నట్టు తెలంగాణ పర్యాటకశాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం సచివాలయంలో టూర్ ప్యాకేజీ బ్రోచర్‌ను ఆవిష్కరించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మేడిగడ్డ రిజర్వాయర్, కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించాలని చాలా మంది ఆసక్తిచూపుతున్నారని, సీఎం కేసీఆర్ అనుమతితో టీఎస్‌టీడీసీ ప్రత్యేక ప్యాకేజీకి రూపకల్పన చేసిందని తెలిపారు. కార్యక్రమంలో పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ మనోహర్, అధికారులు ఏజీఎం వెంకట్ గూడూరి, పురేందర్, చిత్ర పాల్గొన్నారు.

పెద్దలకు రూ.1,800

ప్యాకేజీలో కాళేశ్వరం ప్రాజెక్టులోని ముఖ్య ప్రాంతాలు, భద్రాద్రి దేవాలయం, వెయ్యి స్తంభాలగుడి సందర్శనకు పర్యాటకశాఖ ఏర్పాట్లుచేసింది. ప్రతి శనివారం రాత్రి 9 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి మరుసటి రోజు రాత్రి 10 గంటలకు తిరిగి గమ్యస్థానం చేరేలా ప్యాకేజీని ప్రకటించింది. వోల్వో ఏసీ కోచ్‌లో పెద్దలకు రూ.1,800, చిన్నారులకు రూ.1,440 బస్సుచార్జి, కాళేశ్వరం హరిత హోటల్‌లో వసతి సదుపాయం ఉంటుంది.

జలాభిషేకం

శ్రీశైలం గేట్లు ఎత్తివేత



శుక్రవారం రాత్రి విద్యుత్ ధగధగల నడుమ శ్రీశైలం ప్రాజెక్టు నాలుగు గేట్ల నుంచి కిందకు దుంకుతున్న కృష్ణమ్మ

శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్టు వద్ద జలాలకు పూజలు చేస్తున్న వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి.. కృష్ణమ్మ పరవళ్లను కెమెరాల్లో బంధిస్తున్న పర్యాటకులు

మొదటిపేజీ తరువాయి...

మూసివేసి 6, 7, 8, 9వ నంబర్ల గేట్లను ఒక్కోటి పది అడుగుల మేర ఎత్తి.. 1,04,772 క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్‌కు పంపిస్తున్నారు. వరద ఎక్కువ ఉండడంతో రాత్రి మరో 2 గేట్లను ఎత్తారు. ఒక్కో గేటు నుంచి సుమారు 25వేల క్యూసెక్కులు కిందికి దుంకుతున్నాయి. ఇక ఎడమ గట్టు విద్యుత్ కేంద్రానికి 42,378 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రానికి 30,622 క్యూసెక్కులు, ఎంజీకేఎల్ఐకి 800 క్యూసెక్కులు, హంద్రీనీవాకు 2025 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడుకు 28 వేల క్యూసెక్కులు, ముచ్చుమర్రికి 725 క్యూసెక్కుల నీళ్లతోపాటు నాలుగు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీళ్లను కలిపితే ప్రాజెక్టు నుంచి 2,63,644 క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతున్నది. గతేడాది ఆగస్టు 28న శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు తెరుచుకోగా.. ఈ ఏడాది పరిస్థితి ఆశాజనకంగా ఉండి ఎగువ నుంచి భారీగా వరద రావడంతో 19 రోజులు ముందుగానే నీటివిడుదల ప్రారంభించారు. ప్రాజెక్టులో నీటిమట్టం 880.90 అడుగులకు చేరుకున్న తర్వాత నీటి విడుదల మొదలైంది. శ్రీశైలం గేట్లు ఎత్తిన నేపథ్యంలో ప్రాజెక్టు వద్ద సుందర దృశ్యాలను చూసేందుకు పర్యాటకుల తాకిడి ప్రారంభమైంది. కర్ణాటకలో భారీవర్షాలు కురుస్తుండటంతో జూరాల ప్రాజెక్టుకు పెద్దమొత్తంలో వరద జలాలు వచ్చి చేరుతున్నాయి. జూరాల 38 గేట్లను ఎత్తివేయడంతో 4,94,000 క్యూసెక్కుల నీళ్లు శ్రీశైలం వైపు వస్తున్నాయి. రాబోయే రోజుల్లో జూరాల అవుట్‌ఫ్లో 5.50 లక్షల క్యూసెక్కులకు పెరిగే అవకాశమున్నట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. ఈ వరద ఇలాగే వస్తుంటే శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు మరిన్ని ఎత్తే అవకాశం కూడా ఉన్నది. దానితో నాగార్జునసాగర్ ప్రాజెక్టు గరిష్ఠ మట్టం 312 టీఎంసీలకు చేరుకోవడం ఖాయంగా కనిపిస్తున్నది. నాగార్జునసాగర్‌లో పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకుగాను.. ప్రస్తుతం 517.10 అడుగుల స్థాయిలో 144.04 టీఎంసీల నీటినిల్వ ఉన్నది. అంటే సాగర్ పూర్తిస్థాయిలో నిండేందుకు ఇంకా 168 టీఎంసీల వరకు అవసరం. ప్రస్తుతం రెండు లక్షల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో వస్తుండగా.. ఇదే స్థాయిలో వరద కొనసాగితే 8-9 రోజుల్లో సాగర్ నిండుకుండలా మారనున్నది. శుక్రవారం నాగార్జునసాగర్ నుంచి కుడికాల్వ ద్వారా తాగునీటికోసం 4,469 క్యూసెక్కులు, డీటీ గేట్స్ (డైవర్షన్ టన్నెల్) ద్వారా 10 క్యూసెక్కుల నీటిని విడుదలచేస్తున్నారు.

ఎగువనుంచి భారీ వరద

ఆల్మట్టి, నారాయణపుర, జూరాల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలానికి భారీగా వరద వస్తున్నది. ఆల్మట్టి నుంచి సుమారు 4.8 లక్షల క్యూసెక్కులు నారాయణపురకు విడుదలచేయగా.. నారాయణపుర నుంచి జూరాలకు అంతేమొత్తాన్ని వదులుతున్నారు. మరోవైపు భీమా నుంచి వస్తున్న వరద మరింతగా పెరిగే అవకాశం ఉన్నందున జూరాలకు ఇన్‌ఫ్లో 5 లక్షల క్యూసెక్కులను దాటుతుందని అధికారులు అంచనావేస్తున్నారు. జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు శుక్రవారం సాయంత్రం సుమారు 5 లక్షల క్యూసెక్కులను విడుదలచేస్తున్నారు.

కేసీఆర్, జగన్‌తో రెండు రాష్ట్రాల అభివృద్ధి: శ్రీనివాస్‌గౌడ్

ఆనాడు ఉద్యమనేతగా ఉన్న కేసీఆర్.. విడిపోయి కలిసుందామన్నారని, కానీ, కొందరు నాయకులు విద్వేషాలు సృష్టించారని మున్సిపల్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నీటి యుద్ధాలు వస్తాయని, హైదరాబాద్‌లో ఉండలేరంటూ వదంతులు సృష్టించారని గుర్తుచేశారు. అలాంటి నాయకుల లోపంవల్ల ఎన్నో లక్షల క్యూసెక్కుల నీళ్లు సముద్రంలో కలిసిపోయాయని చెప్పారు. తెలంగాణ వచ్చాక హైదరాబాద్‌లో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. వైఎస్ జగన్‌లాంటి మంచి నాయకుడు ముఖ్యమంత్రి కావడం శుభపరిణామమని కొనియాడారు. ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలను విడదీయలేరన్న శ్రీనివాస్‌గౌడ్.. కొట్లాడకుండా నీళ్లను వాడుకుందామని చెప్పారు.

ఏపీతో సీఎం కేసీఆర్ సఖ్యత మంచి పరిణామం: అనిల్‌కుమార్

ఏపీతో తెలంగాణ సీఎం కేసీఆర్ సఖ్యత మంచి పరిణామమని ఏపీ మంత్రి అనిల్‌కుమార్ అన్నారు. పండుగ వాతావరణంలో శ్రీశైలం డ్యాం నిండిందని, దేవుని కరుణతో రాయలసీమ, తెలంగాణ సస్యశ్యామలం కాబోతున్నాయని చెప్పారు. చిట్టచివరి ఆయకట్టుకు సైతం నీళ్లు అందించేందుకు సీఎంలు వైఎస్ జగన్, కేసీఆర్ కలిసి సాగుతుండటం ఆరోగ్యకర పరిణామమన్నారు.

గేట్ల ప్రారంభం ఇలా..

తెలంగాణ వైపున్న ఆరో గేటు వద్ద మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, ఆల వెంకటేశ్వరరెడ్డి, జైపాల్‌యాదవ్ కృష్ణమ్మకు పూజలు చేశారు. క్రషర్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు.

ఏపీ వైపు ఉన్న 7, 8, 9 గేట్లను ఏపీ ఇరిగేషన్ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, నంద్యాల ఎంపీ బ్రహ్మానందరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణి ప్రారంభించారు.

కృష్ణా, గోదావరితో సస్యశ్యామలం: నిరంజన్‌రెడ్డి

కృష్ణానదిలో ఆశించినదానికి మించి నీళ్లు రావడం చాలా సంతోషకరమని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. ఏపీ ప్రభుత్వం స్వాగతించగా సీఎం కేసీఆర్ ఆదేశంతో తెలంగాణ నేతలమంతా శ్రీశైలానికి తరలివచ్చామన్నారు. రెండు రాష్ట్రాలు నీటి విషయంలో సయోధ్యకు రావటం ఆహ్వానించదగిన పరిణామమని చెప్పారు. ముందు నుంచీ సీఎం కేసీఆర్ జలదౌత్యాన్ని అత్యంత చాకచక్యంతో, మంచి అనుభవంతో చేపడుతున్నారని పేర్కొన్నారు. ఎన లేని వరదను రెండు రాష్ట్రాలకు వాడుకోవచ్చన్నారు. గోదావరి నీళ్లతో తెలంగాణలోని అత్యధిక భాగాన్ని సస్యశ్యామలం చేయవచ్చనే ఉద్దేశంతో కాళేశ్వరం ప్రాజెక్టు సీఎం కేసీఆర్ చెప్పాట్టారని, దీని ఫలితాలు ఇప్పుడు ప్రపంచమంతా చూస్తున్నదని చెప్పారు. భవిష్యత్‌లో ఎప్పుడైనా కృష్ణానదిలో నీళ్లు లేనిపక్షంలో ఎగువన ఉన్న రాయలసీమ, తెలంగాణలోని రంగారెడ్డి, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ లాంటి ప్రాంతాలకు నీళ్లు రావాలంటే గోదావరి, కృష్ణానదులను అనుసంధానించడమే మార్గమని సీఎం కేసీఆర్ పదేపదే చెప్తూ వస్తున్నారన్నారు. ఈ విషయంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు గొప్ప బాటలు వేస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.

గత ఏడాదితో పోలిస్తే ముందస్తుగానే..

గతేడాదితో పోలిస్తే ఈ వర్షాకాలంలో శ్రీశైలానికి వరద ఎక్కువగా వచ్చింది. గతేడాది వర్షాకాలం సీజన్ అంతా జూరాల నుంచి శ్రీశైలానికి 330 టీఎంసీల వరద జలాలు వచ్చాయి. ఈ ఏడాది ఇప్పటికే 194.342 టీఎంసీల నీరు శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుకుంది. ఇంకా ఎగువ నుంచి భారీగా వరద వస్తున్న నేపథ్యంలో శ్రీశైలానికి మరింత ఇన్‌ఫ్లో నమోదయ్యే అవకాశం కనిపిస్తున్నది. శుక్రవారం నుంచి భీమా వరద సుమారు లక్ష క్యూసెక్కుల మేర జూరాలకు అదనంగా వచ్చి చేరుతున్నది. తుంగభద్ర ప్రాజెక్టుకు సైతం వరద ఆశాజనకంగా ఉండటంతో రాబోయే వారంరోజుల్లో ఆ ప్రాజెక్టు నుంచి కూడా శ్రీశైలానికి వరద వచ్చే అవకాశం ఉన్నది. వీటిన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే గతేడాదికంటే ఎక్కువగానే వరదనీరు శ్రీశైలం జలాశయానికి చేరుకోనున్నది. ఇవన్నీ నాగార్జునసాగర్ ఆయకట్టుకు తీపికబురు లాంటివే.

వివిధ ప్రాజెక్టులలో శుక్రవారం నీటి మట్టాల వివరాలు...

రిజర్వాయర్	ఎఫ్ఆర్ఎల్ అడుగుల్లో	ప్రస్తుత మట్టం అడుగుల్లో	పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో	ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో	ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో	అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో
ఆల్మట్టి	1705.00	1696.46	129.72	88.68	3,49,526	3,84,052
నారాయణపుర	1615.00	1600.95	37.64	20.84	4,84,680	4,80,000
ఉజ్జయిని	1630.00	1630.00	117.24	117.24	78,868	95,600
జూరాల	1045.00	1038.26	9.66	5.88	4,94,000	4,94,000
తుంగభద్ర	1633.00	1623.00	100.86	66.75	1,69,261	2,438
శ్రీశైలం	885.00	881.60	215.81	196.56	4,87,762	2,63,644
నాగార్జునసాగర్	590.00	517.10	312.05	144.04	1,77,911	4,673
సింగూరు	1717.93	1670.52	29.91	0.47	20	20
నిజాంసాగర్	1405.00	1368.34	17.80	0.14	-	10
శ్రీరాంసాగర్	1091.00	1060.20	90.31	13.81	29,440	322
లోయర్‌మానేరు	920.00	881.90	24.07	3.53	482	204
మిడ్ మానేరు	1043.31	993.44	25.873	3.51	392	83
కడెం	700.00	695.35	7.60	6.44	11,769	5,200
ఎల్లంపల్లి	485.56	484.61	20.18	19.37	18,822	11,100
మూసి	645.00	627.90	4.46	1.13	1,000	00

శుక్రవారం యూసఫ్‌గూడలోని టీఎస్ఎస్పీ ఫస్ట్ బెటాలియన్ ప్రాంగణంలో మొక్కనాటి నీళ్లు పోస్తున్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్

ఉద్యమస్ఫూర్తితో మొక్కలు నాటాలి

పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ పిలుపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

పోలీస్‌శాఖ కార్యాలయాలు, నివాస సముదాయాల్లోని ఖాళీ స్థలాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది, కుటుంబసభ్యులంతా కలిసి ఉద్యమస్ఫూర్తితో మొక్కలు నాటాలని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ పిలుపునిచ్చారు. శుక్రవారం యూసఫ్‌గూడలోని టీఎస్ఎస్పీ ఫస్ట్ బెటాలియన్ ప్రాంగణంలో నిర్వహించిన హరితహారంలో టీఎస్ఎస్పీ అడిషనల్ డీజీ అభిలాష బిస్తీతో కలిసి కోలేటి దామోదర్ మొక్కలు నాటారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో హైదరాబాద్ కాలుష్యంతో నిండిపోయిందని, తిరిగి పచ్చదనాన్ని తెచ్చేందుకు ప్రతి ఒక్కరూ హరితహారం కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ ఎం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హరిత బంతులు.. పచ్చని వనాలు

- ఫలించిన అటవీ అధికారుల ప్రయోగం
- మూడోవిడుత హరితహారంలో విసిరిన సీడ్ బాల్స్
- 600 హెక్టార్లలో మొలిచిన 90 లక్షల మొక్కలు
- రెండేండ్లలోనే ఏపుగా పెరిగి వృక్షాలుగా..
- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మరింత పచ్చదనం

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం ముర్లిగూడలో విత్తన బంతులను విసరడం ద్వారా పెరుగుతున్న వృక్షాలు

కుమ్రంభీం ఆసిఫాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: తెలంగాణకు హరితహారం కార్యక్రమంతో పచ్చని తెలంగాణకు అడుగు పడుతున్నది. అడవుల విస్తీర్ణం పెంచడమే ధ్యేయంగా సర్కారు చేపట్టిన విత్తన బంతుల (సీడ్ బాల్) ప్రయోగం సత్ఫలితాలిచ్చింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రెండేండ్ల కిందట మూడోవిడుత హరితహారంలో భాగంగా వేసిన విత్తన బంతులు మొక్కలై.. ఆపై వృక్షాలుగా ఎదుగుతున్నాయి. అడవుల్లో చెట్లు సహజంగా పెరుగుతాయి. ఆ చెట్ల నుంచి రాలిన విత్తనాలు మళ్లీ మొలిచి మొక్కలుగా పెరిగి వృక్షాలుగా మారుతాయి. సరిగ్గా ఇదే సూత్రాన్ని సహజ పద్ధతుల్లో పాటించిన అటవీ అధికారులు.. అద్భుతమైన ఫలితాలను రాబట్టారు. సహజమైన అడవులకు పెట్టింది పేరుగా ఉన్న కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో అడవుల శాతాన్ని మరింత పెంచేందుకు మూడోవిడుత హరితహారంలో భాగంగా చేపట్టిన విత్తన బంతుల (సీడ్ బాల్స్) ప్రయోగం అద్భుతమైన ఫలితాలనిచ్చింది. ఆసిఫాబాద్ డివిజన్‌లో 30 కంపార్టుమెంట్లలోని 600 హెక్టార్లలో అడవులు పలుచబడిన ప్రాంతాల్లో రెండేండ్ల కిందట విత్తన బంతులు, సహజ విత్తనాలను అటవీప్రాంతాల్లో నేరుగా వేశారు. సుమారు 90 లక్షల మొక్కలు సహజంగా మొలిచి మొక్కలుగా ఎదిగాయి. రూపాయి ఖర్చులేకుండా అధికారులు చేసిన ఈ ప్రయోగం ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తున్నది.

మొక్కలుగా పెరిగి.. వృక్షాలుగా ఎదిగి

రెండేండ్ల కిందట హరితహారం కార్యక్రమంలో భాగంగా ఆసిఫాబాద్ డివిజన్‌లోని 51 అటవీ సెక్షన్లలో ఉన్న 156 బీట్‌లలో 30 బీట్‌లను సీడ్ బాల్స్ కోసం ప్రత్యేకంగా ఎంపిక చేశారు. అందులో అటవీ సిబ్బంది సహకారంతో విత్తన బంతులు (సీడ్ బాల్స్), సహజ విత్తనాలను చల్లే కార్యక్రమాన్ని చేపట్టారు. తిర్యాణి మండలం మోర్లీగూడ, ఆసిఫాబాద్ మండలం దంతన్‌పల్లి, కెరమెరి రేంజ్ పరిధిలోని గూడమామడలలో పలుచబడిన అటవీ ప్రాంతాల్లో సుమారు 600 హెక్టార్లలో విత్తన బంతులను, విత్తనాలను నేరుగా చల్లారు. అలా చల్లిన విత్తనాలు సహజమైన వాతావరణంలో మొలకెత్తి.. మొక్కలుగా పెరిగి ఇప్పుడు వృక్షాలుగా మారుతున్నాయి. అధికారులు సీడ్ బాల్స్‌ను సంరక్షించే సామాజిక బాధ్యతను ఆయా ప్రాంతాల గిరిజనులకే అప్పగించి సఫలమయ్యారు. అడవుల సంరక్షణపై కల్పించిన అవగాహనతో అడవులకు హాని కలిగించకుండా ఆయా గ్రామాల ప్రజలు సహకరించారు. ఫలితంగా జిల్లాలో చేపట్టిన సీడ్ బాల్స్ ప్రయోగం విజయవంతమైంది.

అడ్డుకాదు వైకల్యం.. ఆదర్శంగా హరితహారం

ఉపాధి పనిలో గుంతలు తీసి, మొక్కలు నాటుతున్న దివ్యాంగులు

సిర్గాపూర్: తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో పాల్గొనేందుకు వైకల్యం అడ్డురాదని నిరూపిస్తున్నారు సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలంలోని కడ్పల్ గ్రామానికి చెందిన అంకం మల్లయ్య, గోగుల మల్లయ్య. ఉపాధి పనిలోభాగంగా హరితహారంలో మొక్కలు నాటుతున్నారు. హరితస్ఫూర్తిని చాటుతున్నారు. కుడి చెయ్యిని కోల్పోయిన అంకం మల్లయ్య, మాటలు రాని గోగుల మల్లయ్య జోడిగా కడ్పల్ నుంచి ఖాజాపూర్ వెళ్లే రహదారికి ఇరువైపులా హరితహారం 'రెవెన్యూ ప్లాంటేషన్'లో మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వి, మొక్కలు నాటే దినసరి వేతన ఉపాధి పనిలో బిజీ అయ్యారు. వీరి పనితీరును చూసిన పలువురు అభినందిస్తున్నారు.

సిర్గాపూర్ మండలంలో అంకం మల్లయ్య ఒంటి చెయ్యితో గుంత తోడుతుండగా.. మట్టితీస్తున్న గోగుల మల్లయ్య

D.Ed
Admissions Management Quota qualified
DEECET-2019 - Last Date 16.08.2019
MNR D.Ed Colleges:
Sangareddy : 9493548400
See: website: www.mnrdeds.edu.in
Kukatpally : 9849984806
See: website: www.mnrdedk.edu.in

एन.एस.आई.सी
NSIC
ISO 9001 - 2015
TECHNICAL SERVICES CENTRE
Organising Recruitment Drive
(10th Aug. 2019) TODAY @ 9.30 am
for ITI, Diploma, Degree Holders.
at NSIC-TSC, Nr. Radhika Multiplex, Kushaiguda, Hyderabad.
Tel: 040-27121422, 27126646

VIGNAN INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
(Affiliated to JNTUH, Approved by AICTE & PCI - New Delhi)
Near Ramoji Film City, Deshmukhi (V), Yadadri Bhuvanagiri (D), TS - 508 284
Web: www.vignanits.ac.in | Help Line: 91777 92534
SPOT ADMISSIONS FOR I B.TECH (2019-20)
A few seats are available in CSE, IT, ECE, CIVIL, EEE, MECH & EIE
Interested eligible candidates who have not taken admission in any other Institute can apply in person along with all the original certificates. For download the application form and other information please visit our official website. Admission will be made as per the guideline issued by Convener TSEMCET-2019.
5th position in Placements ranked in Telangana State by Times of India
69th Rank by Times of India in the Country
10th Rank in Telangana, 44th Rank in South India, National Rank 68 by THE WEEK
100th Position in the Country Ranking by India Today
Placements
Total Number of offers So far
624/631
Students
Merit Scholarship would be given for Mechanical Branch Students by LR Trust
For Admissions contact: 9866399664, 9959516255

www.zalimlotion.in
Since 90 Years
జాలిం లోషన్
వేగవంతం > విశ్వసనీయం > పరీక్షించినది
తరతరాల నుండి...
తామర, దురదలు & గజ్జి నుండి తక్షణమే ఉపశమనం
అసలైన దానిని గుర్తించండి
సీసా మూతపై జాలిం లోషన్ ఇందోర్ అని ఉంటుంది
గాజు సీసా
ORICHEM మరియు 1929 నుండి
రిజిస్టర్డ్ TM No. 322805
జాలిం లోషన్ కేవలం ఓరియంటల్ కెమికల్స్ వర్క్స్ రావు. (ఇందోర్) 453331 వద్ద మాత్రమే తయారు చేస్తారు.
ANIL PUB.

ప్రణబ్ సేవలకు గుర్తింపు

న్యూఢిల్లీ: మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి భారతరత్న అవార్డును ప్రదానం చేయడం దేశానికి ఆయన చేసిన విశిష్ట సేవలకు తగిన గుర్తింపును ఇవ్వడమేనని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాష్ట్రపతి కోవింద్ గురువారం ప్రణబ్ ముఖర్జీని ఈ పౌరపురస్కారంతో సత్కరించిన విషయం తెలిసిందే. దీనిపై మోదీ స్పందిస్తూ భారత్‌ను మరింత అభివృద్ధిచెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు కృషిచేసిన ప్రణబ్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

ప్రాణం తీయడం తల్లిదండ్రులు నేర్పలేదు

- 'మ్యాన్ వర్సెస్ వైల్డ్'లో మోదీ

న్యూఢిల్లీ: ఒక జీవి ప్రాణాన్ని తీయడం తన తల్లిదండ్రులు తనకు నేర్పలేదని, తాను అహింసాయుత వాతావరణంలో పెరిగానని ప్రధాని మోదీ చెప్పారు. ఈ నెల 12న డిస్కవరి చానెల్‌లో ప్రసారం కానున్న 'మ్యాన్ వర్సెస్ వైల్డ్' ఎపిసోడ్ షూటింగ్ ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్‌లో జరిగింది. ప్రధాని మోదీ వెంట షో నిర్వాహకుడు బేర్ గ్రిల్స్ ఉన్నారు. అడవిలో మోదీ అడుగుపెట్టగానే గ్రిల్స్ ఒక కట్టెకు కత్తిని కట్టి ఈటెలాగా తయారు చేసి ఆయన చేతికి ఇచ్చారు. ఏదైనా జంతువు దాడి చేస్తే పొడిచి చంపాలని సూచించారు. దీంతో మోదీ స్పందిస్తూ ప్రాణాన్ని తీయడం తన తల్లిదండ్రులు నేర్పలేదని, అలాంటి పెంపకంలో పెరిగానని సమాధానమిచ్చారు.

అరుణ్‌జైట్లీకి తీవ్ర అస్వస్థత

- ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరిక
- ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు



న్యూఢిల్లీ: కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత అరుణ్‌జైట్లీ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో శుక్రవారం ఉదయం ఆయనను కుటుంబసభ్యులు ఢిల్లీలోని ఎయిమ్స్ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నదని వైద్యులు తెలిపారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రి హర్షవర్ధన్, సహాయ మంత్రి అశ్వినీ చౌబే తదితరులు ఎయిమ్స్‌కు చేరుకుని జైట్లీ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. 'అరుణ్‌జైట్లీ ఈ రోజు(శుక్రవారం) ఉదయం ఎయిమ్స్‌లో చేరారు. వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఇంటెన్సివ్ కేర్ విభాగంలో ఆయన చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి 'హెమోడైనమికల్లీ స్టేబుల్'గా ఉన్నది' అని ఎయిమ్స్ దవాఖాన ఒక ప్రకటనలో తెలిపింది. హృదయ స్పందన నిలకడగా ఉండడాన్ని, రక్తప్రసరణ బాగా ఉండడాన్ని హెమోడైనమికల్లీ స్టేబుల్ అంటారు. గతేడాది మే 14న జైట్లీకి మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్స జరిగింది. అనారోగ్యం కారణంగా ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఆయన పోటీచేయలేదు.

వరద బీభత్సం

- కేరళలో రెడ్ అలర్ట్ జారీ.. మహారాష్ట్రలో కొనసాగుతున్న వరదలు
- కర్ణాటకలో సగం ప్రాంతం వరద గుప్పిట్లోనే..

న్యూఢిల్లీ, ఆగస్టు 9: నైరుతి రుతుపవనాలతో కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, అసోం, ఒడిశా, మధ్యప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసి వరద పోటెత్తుతున్నది. కేరళ, కర్ణాటక, మహారాష్ట్రల్లో ఈ ప్రభావం అధికంగా ఉన్నది. వరదల వల్ల మూడు రోజుల్లో కేరళలో 28 మంది మరణించారు. 64వేల మందికిపైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మహారాష్ట్రలో 29 మంది, కర్ణాటకలో 12 మంది మర ణించారు. మధ్యప్రదేశ్, గోవా, గుజరాత్, ఏపీ, ఒడిశా, పశ్చిమబెంగాల్‌లోనూ వరదలు పోటెత్తుతున్నాయి. వరద ప్రభావం అధికంగా ఉండటంతో కేరళ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న రెండు రోజుల్లో గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్రల్లో మళ్లీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ విభాగం తెలిపింది. మరోవైపు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మహారాష్ట్ర మంత్రి గిరీశ్ మహాజన్ సెల్ఫీలు దిగడంతో వివాదం చెలరేగింది.

కేరళలో..

కేరళలో మూడు రోజుల్లో 28 మంది మరణించారు. 64వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రన్‌వేపై భారీగా నీరు నిలిచిపోవడంతో కొచి విమానాశ్రయంలో విమాన రాకపోకలు ఆదివారం వరకు రద్దయ్యాయి. వరద ప్రభావం వయనాడ్, కోజికోడ్, ఇడుక్కి, కన్నూర్ జిల్లాలపై ఎక్కువగా ఉన్నది. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో సైన్యం, నౌకాదళం సాయాన్ని ప్రభుత్వం కోరింది. శనివారం వరకు అన్ని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. రాష్ట్రంలో 9 జిల్లాల్లో రెడ్ అలర్ట్ జారీ చేశారు. వయనాడ్, మల్లపురం జిల్లాల్లో విరిగి పడ్డ కొండ చరియల శిథిలాల కింద చిక్కుకున్న 40 మందిని వెలికితీయడానికి సహాయ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నది. శనివారం విద్యార్థులకు జరుగాల్సిన అన్ని రకాల పరీక్షలను వాయిదా వేశారు.

కర్ణాటకలో..

కర్ణాటకలో వరద బీభత్సం సృష్టిస్తున్నది. ప్రధానంగా బెళగావితోపాటు 13 జిల్లాల్లో వరద ప్రభావం అధికంగా ఉన్నది. లక్షల ఎకరాల్లో పంట నీట మునిగింది. 1,24,291 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కొడగు జిల్లా కోరన్‌గాలా గ్రామంలో శుక్రవారం కొండ చరియ విరిగి ఇంటిపై పడటంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు మరణించారు. ఐదో వ్యక్తి కోసం గాలిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రధాన నదులు కృష్ణా, కావేరి, తుంగభద్ర, భీమా, మలప్రభ, ఘటప్రభ, భద్రావతి, హేమావతి ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. హసన్ జిల్లా సకలేశ్‌పురలో కొండ చరియ విరిగి జాతీయ రహదారి 75పై పడటంతో రాకపోకలు స్తంభించాయి. కోరంగాల ప్రాంతంలో ఇద్దరు యువకులు బైక్‌పై మట్టివంతెనను దాటుతుండగా వరద ఒక్కసారిగా పెరగడంతో కొట్టుకుపోయారు. వరదల వల్ల రాష్ట్రంలో ఇప్పటి వరకు 12 మంది మరణించారని కర్ణాటక సీఎం యెడియూరప్ప చెప్పారు.

కేరళలోని ఎర్నాకుళం జిల్లాలో వరద ఉధృతి దృశ్యం

తమిళనాడులో..

తమిళనాడులోని ప్రముఖ పర్యాటక ప్రాంతం నీలగిరిలో వర్షాలు కురిసి ఇండ్లు కూలడం లాంటి ఘటనల వల్ల ఇప్పటి వరకు ఐదుగురు మరణించారు. గత 24 గంటల్లో (శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు) ఈ జిల్లాలో రికార్డు స్థాయిలో 911 మి.మీ. వర్షపాతం కురిసింది. భారీ చెట్లు విరిగి రహదారిపై పడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. మరోవైపు గుజరాత్‌లోని నర్మదా నది ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తుండటంతో దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అసోం, ఒడిశా రాష్ట్రాల్లోనూ వరద పోటెత్తుతున్నది. మరోవైపు వరద ప్రభావిత రాష్ట్రాల్లో సహాయ చర్యల కోసం 83 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపినట్లు కేంద్రం తెలిపింది.

సెల్ఫీ వివాదంలో మంత్రి

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మహారాష్ట్ర మంత్రి గిరిశ్ మహాజన్ వివాదంలో చిక్కుకున్నారు. పర్యటనలో ఆయన నవ్వుతూ, సెల్ఫీలు దిగుతూ కనిపించారు. వరదతో సతమతమవుతున్న ప్రజలు ఆయన చర్యలను తీవ్రంగా తప్పుబట్టారు. దీనిపై ఎన్సీపీ స్పందిస్తూ మంత్రి విహారయాత్రకు వెళ్లారా? అని ప్రశ్నించింది. మరోవైపు మహారాష్ట్రలోని ఐదు జిల్లాల్లో.. ప్రధానంగా కోలాపూర్, సాంగ్లి జిల్లాలు ఘోరంగా దెబ్బతిన్నాయి. 2.85 లక్షలకుపైగా మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

కర్ణాటకలోని రాందుర్గ్‌లో ఇంట్లోకి వరద రావడంతో పై అంతస్తుకు చేరుకున్న నివాసితులు

మహారాష్ట్రలోని సంగ్లీ జిల్లాలో పడవలతో ప్రజలను తరలిస్తున్న సైన్యం

వర్షపాతం లోటు తగ్గింది

- పంటలసాగు పుంజుకుంటున్నది
- కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమర్ వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమర్

న్యూఢిల్లీ, ఆగస్టు 9: నైరుతి రుతుపవనాల వర్షపాత లోటు తగ్గిందని, దేశవ్యాప్తంగా వానకాల పంటల సాగు పుంజుకుంటున్నదని కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తెలిపారు. ఈసారి సాధారణ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసిన విషయం తెలిసిందే. ఈనెల 8 నాటికి సాధారణం కంటే 5 శాతం తక్కువ వర్షపాతమే కురిసింది. 'ఈసారి రుతుపవనాలు ఆలస్యం కావడంతో ఆందోళన వ్యక్తమైంది. దేవుడి దయవల్ల, వర్షాలు మెరుగై లోటు తగ్గింది. వానకాల పంటల సాగు మెరుగవుతున్నది' అని తోమర్ అన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో వరద పరిస్థితిని కేంద్రం నిశితంగా పరిశీలిస్తున్నదన్నారు. ఇప్పటివరకు 869.55 లక్షల హెక్టార్లలో వానకాల పంటలను సాగుచేశారు. గతేడాది (918.70 లక్షల హెక్టార్లు) కంటే ఇది తక్కువే. గతవారంతో పోలిస్తే సాగు విస్తీర్ణంలో తేడా వచ్చిందని వ్యవసాయశాఖ కార్యదర్శి సంజయ్ అగర్వాల్ తెలిపారు. వరి సాగు విస్తీర్ణం ఇప్పటికీ తక్కువేనన్నారు. గతేడాది ఇదే సమయానికి 304.18 లక్షల హెక్టార్లలో వరి సాగుచేయగా, ఈసారి 265.20 లక్షల హెక్టార్లలో సాగైంది.

10 కోట్ల మంది రైతులకు పీఎం-కిసాన్

పీఎం-కిసాన్ పథకాన్ని ఈ ఏడాది సుమారు 10 కోట్ల మంది రైతులకు వర్తింపజేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తోమర్ తెలిపారు. దీని కింద కేంద్రం రైతులకు 3 విడుతల్లో పెట్టుబడి సాయం రూ.6,000 అందజేస్తున్న విషయం తెలిసిందే. 'ఇప్పటివరకు 5.88 కోట్ల మంది రైతులు తొలి విడుత కింద రూ.2000 అందుకున్నారు. 3.40 కోట్ల మందికి రెండో విడుత నిధులూ అందాయి. బెంగాల్ మినహా అన్ని రాష్ట్రాలకు చేరాయి. ఈ ఏడాది చివరికల్లా 10 కోట్ల మందికి ఈ పథకం వర్తింపజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని మంత్రి వివరించారు.

కేరళను ఆదుకోండి

ప్రధాని మోదీని కోరిన రాహుల్

న్యూఢిల్లీ: వర్షాలకు అతలాకుతలమైన కేరళను ఆదుకోవాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ప్రధాని నరేంద్రమోదీకి విజ్ఞప్తిచేశారు. వరదలతో నష్టపోయిన తన నియోజకవర్గమైన వయనాడ్ ప్రజలకూ సాయం మందించాలని కోరారు. 'రాష్ట్రంలో ముఖ్యంగా వయనాడ్‌లో వరదలు సంభవించి, కొండచరియలు విరిగిపడి తీవ్రంగా దెబ్బతిన్న ప్రజలకు సాధ్యమైనంత సాయం కోరుతూ ప్రధానితో మాట్లాడాను. విపత్తు ప్రభావం తగ్గించడానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు' అని రాహుల్ ట్వీట్ చేశారు.

అమెరికాలో విమాన ప్రమాదం

భారత సంతతి వైద్య దంపతులు, వారి కుమార్తె దుర్మరణం

వాషింగ్టన్: అమెరికాలో చోటుచేసుకున్న విమాన ప్రమాదంలో భారత సంతతికి చెందిన వైద్య దంపతులు, వారి కుమార్తె ప్రాణాలు కోల్పోయారు. డాక్టర్ జస్వీర్ ఖురానా, డాక్టర్ దివ్య ఖురానా, వారి కుమార్తె కిరణ్ ఖురానా శుక్రవారం వారి సొంత విమానంలో వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో విమానంలో లేని వారి మరో కుమార్తె మాత్రం ప్రాణాలతో మిగిలింది. ఫిలడెల్ఫియా శివారులోని ఓ ఇంటి పెరటిలో విమాన శకలాలను గుర్తించారు. డాక్టర్ ఖురానా లైసెన్స్‌డ్ పైలెట్. శుక్రవారం ఉదయం 6 గంటలకు ఈశాన్య ఫిలడెల్ఫియా ఎయిర్‌పోర్ట్ నుంచి వారి విమానం కొలంబస్‌లోని ఓహియో స్టేట్ యూనివర్సిటీ ఎయిర్‌పోర్టుకు బయలుదేరింది. అయితే ప్రమాదవశాత్తూ మూడు నిమిషాలకే కుప్పకూలిపోయింది.

యూఏపీఏ చట్ట సవరణకు రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ: చట్ట విరుద్ధ కార్యకలాపాల (నిరోధక) సవరణ చట్టం-2019(యూఏపీఏ)కు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదం తెలిపారు. ఈ చట్టం కింద అనుమానితులను కూడా ఉగ్రవాదులుగా ప్రకటించడంతోపాటు వారి ఆస్తులను జప్తు చేస్తారు. ఉగ్రవాదులుగా ప్రకటించిన వారి ప్రయాణంపైనా నిషేధం విధిస్తారు. ఈ బిల్లును జూలై 24న లోక్‌సభ, ఈ నెల 2న రాజ్యసభ ఆమోదించిన సంగతి తెలిసిందే. ఈ చట్టం కింద తొలుత లష్కరే తాయిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్, జైషే మహ్మద్ అధిపతి మసూద్ అజర్‌లను ఉగ్రవాదులుగా ప్రకటించే అవకాశం ఉన్నది.

శుక్రవారం హైదరాబాద్‌లో పంచాయతీరాజ్‌శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్థికకమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్‌తదితరులు

ఎంపీపీలతో త్వరలో ఆర్థిక కమిషన్ భేటీ

ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ఆర్థిక కమిషన్ త్వరలో మండల పరిషత్ ప్రెసిడెంట్‌లతో సమావేశం ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఆగస్టు15 తర్వాత నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని పంచాయతీరాజ్‌శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఆర్థిక కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్ కోరారు. శుక్రవారం కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్‌తోపాటు, సీనియర్ ఐఏఎస్ అధికారి, కమిషన్ సభ్య కార్యదర్శి సురేశ్ చందా, కమిషన్‌సభ్యుడు చెన్నయ్య మంత్రిని కలిసి పలుఅంశాలపై చర్చలు జరిపారు. స్థానికసంస్థలకు నిధులు కేటాయించే విషయంపై ఇటీవల 15వ ఆర్థికసంఘం చైర్మన్ ఎన్కే సింగ్ సమర్పించిన నివేదికను కమిషన్ చైర్మన్ మంత్రికి వివరించారు. 12, 13వ ఫైనాన్స్‌కమిషన్ మంజూరుచేసిన విధంగానే స్థానిక సంస్థలకు నిధులు వస్తాయన్నారు. గ్రామపంచాయతీల్లో హరితహారం కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నట్టు రాజేశంగౌడ్ చెప్పారు.

పోలీస్‌శాఖ బడ్జెట్‌పై ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న హోంశాఖ మంత్రి మహమూద్ అలీ

పోలీస్‌శాఖ బడ్జెట్ ప్రతిపాదనలపై హోంమంత్రి సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రబడ్జెట్‌లో పోలీస్‌శాఖకు కేటాయింపులకు సంబంధించిన ప్రతిపాదనలపై ఉన్నతాధికారులు కసరత్తు ప్రారంభించారు. బడ్జెట్‌లో ఏయే అంశాలకు ఎన్ని నిధులు కోరాలనేదానిపై ప్రాథమిక నివేదికలు రూపొందించారు. వీటిపై శుక్రవారం హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ ఉన్నతాధికారులతో చర్చించారు. అన్నివిభాగాల హెచ్‌వోడీలు కలిసి చర్చించి వారంలో బడ్జెట్ ప్రతిపాదనలకు తుదిరూపు ఇవ్వాలని హోంమంత్రి సూచించారు. సమీక్షలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్‌త్రివేది, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఎస్పీఎఫ్ డీజీ తేజ్‌దీప్‌కౌర్ తదితరులు పాల్గొన్నారు.

షిప్ కెప్టెన్ కరుణశంకర్‌కు విముక్తి

గుజరాత్ హైకోర్టు ఆదేశాలతో విడుదలకు అంగీకారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గుజరాత్ హైకోర్టు జోక్యంతో హైదరాబాద్‌కు చెందిన షిప్‌కెప్టెన్ కరుణశంకర్ కుందాలకు అతను పనిచేసే సంస్థ నుంచి విముక్తి లభించింది. హైదరాబాద్‌లోని అతను పనిచేస్తున్న ముంబైకి చెందిన మెర్కాటర్ లిమిటెడ్ కంపెనీ అక్రమంగా నిర్బంధించిందని శంకర్ భార్య గుజరాత్ హైకోర్టులో హెబియస్‌కార్పస్ పిటిషన్ వేశారు. పిటిషన్‌ను స్వీకరించిన గుజరాత్ హైకోర్టు, ప్రత్యేకంగా న్యాయాధికారిని నియమించి అతడి వివరాలు తెలియజేయాలని సూచించింది. ఈ నెల 4న ఇమ్మిగ్రేషన్, పోర్టు సిబ్బందితో కలిసి వెళ్లి నౌకలోని కెప్టెన్‌ను న్యాయాధికారి ఆర్కే భట్ కలిశారు. కోర్టు ఆదేశాలతో రాజీకి వచ్చిన మెర్కాటర్ లిమిటెడ్ కంపెనీ అధికారులు, కెప్టెన్ కరుణశంకర్ కుందాలతోపాటు మరో 18 మంది సిబ్బందిని విడుదల చేసేందుకు, వారికి రావాల్సిన బకాయిలు ఇచ్చేందుకు అంగీకరించారు. నౌకలోకి శంకర్ స్థానంలో మరో కెప్టెన్ వచ్చాక అతను హైదరాబాద్‌కు చేరు కోనున్నారు.

గోదావరికి మళ్లీ పెరిగిన వరద

- పేరూరు వద్ద ఏకంగా 11 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- కాళేశ్వరం వద్ద 2.88 లక్షల క్యూసెక్కులు
- నిండుకుండలా అన్నారం బరాజ్

మేడిగడ్డలో నిలకడగా గోదావరి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ కాళేశ్వరం/ మహదేవపూర్: గోదావరి వరద మళ్లీ పెరిగింది. పేరూరు దగ్గర నదీప్రవాహం ఏకంగా 11.12 లక్షల క్యూసెక్కులుగా నమోదవుతున్నది. కాళేశ్వరం వద్ద గోదావరి నది 2.88 లక్షల క్యూసెక్కులుగా పారుతున్నట్టు అధికారులు తెలిపారు. ఎగువన శ్రీరాంసాగర్‌కు 29వేల క్యూసెక్కుల వరద ఉండగా.. కడెంకు 11వేల క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో వస్తున్నది. నిండుకుండలా ఉన్న ఎల్లంపల్లికి ఎగువ నుంచి 18 వేల క్యూసెక్కులకుపైగా వరద వస్తుండటంతో అధికారులు 11వేల క్యూసెక్కులకుపైగా నీటిని దిగువకు వదులుతున్నారు. మిడ్ మానేరుకు 392 క్యూసెక్కులు, లోయర్ మానేరుకు 482 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో నమోదవుతున్నది.అన్నారంబరాజ్ నిండుకుండలా మారింది. బరాజ్‌లోని 11 గేట్లు తెరిచి నీటిని దిగువకు వదులుతున్నారు. శుక్రవారం మానేరు నది నుంచి 10,015 క్యూసెక్కుల నీరు రాగా, చిన్నచిన్న వాగులు, సుందిల్ల బరాజ్ నుంచి 44,815 క్యూసెక్కులతో కలిపి మొత్తం 54,200 క్యూసెక్కులు రాగా, 49,500 కూసెక్కులను వదులుతున్నారు. అన్నారం బరాజ్‌లో 7.20 టీఎంసీ నీరు నిల్వ ఉన్నది. మేడిగడ్డ బరాజ్ వద్ద రెండ్రోజులుగా ఒకేరీతిగా నీటి ప్రవాహం ఉండడంతో గురు, శుక్రవారాల్లో 49 గేట్లను ఎత్తివేశారు. వీటినుంచి సుమారు 2.78 లక్షల క్యూసెక్కుల ప్రవాహం దిగువకు వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు. మేడిగడ్డ బరాజ్‌లో 93.70 మీటర్ల ఎత్తులో 3 టీఎంసీల నీరు నిల్వ ఉన్నదని చెప్పారు. దిగువన ధవళేశ్వరం వద్ద శుక్రవారం ఉదయం 11.96 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా అధికారులు 11.89 లక్షల క్యూసెక్కులను సముద్రంలోకి వదులుతున్నారు.

భద్రాద్రి వద్ద పెరుగుతూ.. తగ్గుతూ..

భద్రాచలం,/చర్ల రూరల్ నమస్తే తెలంగాణ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం ఏజెన్సీలో గోదావరి పెరుగుతూ, తగ్గుతూ వస్తున్నది. శుక్రవారం ఉదయం 5 గంటలకు 47.5 అడుగులున్న గోదావరి.. 8 గంటలకు 47.9 అడుగులకు పెరిగింది. 48 అడుగులకు చేరి రెండో ప్రమాద హెచ్చరిక జారీచేస్తారని భావించినా.. అనంతరం తగ్గుముఖం పడుతూ వచ్చింది. మధ్యాహ్నం ఒంటిగంటకు 47.8 అడుగులు ఉండగా, సాయంత్రం 6 గంటలకు 47.5 అడుగులకు తగ్గింది. వరదనీటితో స్నానఘట్టాలు పూర్తిగా మునిగాయి. కల్యాణకట్ట చుట్టూ నీరు చేరింది. పట్టణంలోని మురుగునీటిని మోటర్ల ద్వారా గోదావరిలోకి పంపించాల్సి ఉండగా చాలినన్ని లేకపోవడంతో వరద నీరు వెనుకకు మళ్లింది. దీంతో రామాలయం పరిసరాలు జలమయమయ్యాయి. నిత్యాన్నదాన సత్రం చుట్టూ వరద నీరు చేరుకున్నది. ఆలయ పడమర మెట్లవైపు ఉన్న బొమ్మల దుకాణాలు సైతం నీటమునిగాయి. దీంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టులో శుక్రవారం 7 గేట్లు ఎత్తి 35,427 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు.

కాళేశ్వరానికి రూ.4075 కోట్ల రుణానికి అనుమతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ మరో రూ.4,075.11 కోట్ల రుణాన్ని తీసుకునేందుకు అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ రుణాన్ని కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీలు-6, 8 నుంచి 11తోపాటు 14వ ప్యాకేజీల్లో భాగంగా చేపడుతున్న సివిల్ పనులు, ఎలక్ట్రో మెకానికల్ పనులకు వినియోగించనున్నారు.

లక్ష్మీపూర్ సర్జ్‌పూల్‌కు నందిమేడారం నీళ్లు

నాలుగు గేట్లు ఎత్తి వెయ్యి క్యూసెక్కుల విడుదల

7వ ప్యాకేజీ సొరంగాల ద్వారా నీటి సరఫరా

ధర్మారం: కాళేశ్వరం ప్రాజెక్ట్ 8వ ప్యాకేజీలోని రామడుగు మండలం లక్ష్మీపూర్ భూగర్భ పంప్‌హౌస్‌కు అధికారులు మరోసారి నీటిని విడుదలచేశారు. శుక్రవారం ఏడో ప్యాకేజీలోని పెద్దపల్లి జిల్లా నందిమేడారం రిజర్వాయర్ వద్ద శుక్రవారం ఈఎన్సీ వెంకటేశ్వర్లు, లిఫ్ట్ అడ్వయిజర్ పెంటారెడ్డి కలిసి జలాశయం నాలుగు హెడ్ రెగ్యులేటర్ గేట్లను ఎత్తి 1,020 క్యూసెక్కులు విడుదలచేశారు. ఈ నీరు ధర్మారం మండలం మల్లాపూర్ శివారులోని 7వ ప్యాకేజీలోని జంటసొరంగాల ద్వారా దిగ్విజయంగా లక్ష్మీపూర్ చేరుతున్నది. దీనిపై ప్రాజెక్ట్ ఇంజినీరింగ్ అధికారులు, మ్యాక్స్ ఇన్‌ఫ్రా జీఎం టీపీ రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. నీటి సరఫరా పరిస్థితిని డీఈఈ నర్సింగారావు, ఏఈ బుర్ర పరుశురాంగౌడ్ పర్యవేక్షించారు. లక్ష్మీపూర్‌లోని సర్జ్‌పూల్‌లో ఇంకా పరీక్షలు నిర్వహించటానికిగాను మరో మూడు దఫాలుగా నందిమేడారం నుంచి నీటిని విడుదలచేస్తామని ప్రాజెక్ట్ డీఈఈ నర్సింగారావు 'నమస్తే తెలంగాణ'కు వెల్లడించారు.



నంది మేడారం రిజర్వాయర్ హెడ్ రెగ్యులేటర్ వద్ద స్విచాన్ చేసి గేట్లను ఎత్తుతున్న కాళేశ్వరం ఈఎన్సీ వెంకటేశ్వర్లు

కిరాయి లేకుండా రైస్‌మిల్లర్లకు గోదాములు

- మిల్లింగ్ బియ్యం నిల్వకు రెండునెలలు కేటాయిస్తూ మార్కెటింగ్‌శాఖ ఉత్తర్వులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలోని ఖాళీ గోదాములను కిరాయిలేకుండా రెండునెలలపాటు రైస్‌మిల్లర్లు బియ్యం నిల్వచేసుకునేందుకు అనుమతిస్తూ వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. రాబోయే నాలుగు నెలలకు ఎఫ్‌సీఐ, ప్రభుత్వ ఏజెన్సీ నుంచి ఇండెంట్ ఇవ్వని ఖాళీ గోదాములను మిల్లర్లకు కేటాయిస్తారు. గోదాములు కేటాయించే అధికారం జిల్లా జాయింట్ కలెక్టర్లకు ఉన్నదని పేర్కొన్నారు. వీటిలో కస్టమ్స్ మిల్లింగ్ బియ్యం మాత్రమే నిల్వ చేయాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కిరాయి వసూలు చేయడంతోపాటు, మిల్లు లైసెన్స్ రద్దుచేస్తామని పార్థసారథి హెచ్చరించారు.

మున్సిపోల్స్‌కు సిద్ధంగా ఉన్నాం

- మున్సిపల్ ఎన్నికలపై కౌంటర్ దాఖలుచేసిన ప్రభుత్వం
- ప్రజాప్రయోజన వ్యాజ్యాలను కొట్టివేయాలని వినతి
- విచారణను ఈ నెల 13కు వాయిదావేసిన ధర్మాసనం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని మొత్తం 132 మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్నది. నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రక్రియ చేపడుతున్నారని, చట్ట విరుద్ధంగా జీవోలు జారీచేశారని పేర్కొంటూ.. దాఖలైన పిల్‌లో ప్రభుత్వం కౌంటర్ దాఖలుచేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), బీసీ సంక్షేమసంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం దాఖలుచేసిన కేసుల్లో సింగిల్ జడ్జి ధర్మాసనం 119 రోజుల గరిష్ఠ పరిమితిలోపు ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు జారీచేసిందని, ఈ గరిష్ఠ పరిమితిలోపు ఎప్పుడైనా ఎన్నికలు నిర్వహించవచ్చని తెలిపింది. జూలై 2న మున్సిపాల్టీల పాలకవర్గాల గడువు ముగిసిన నేపథ్యంలో ప్రస్తుతం ప్రత్యేక అధికారుల ప

ఆర్టికల్ 370ని నిరంకుశ పద్ధతిలో తొలిగించారు

- ప్రజాస్వామ్యాన్ని అణిచివేశారు
- గాంధీజీ మనుమడు తుషార్ గాంధీ ధ్వజం

జైపూర్: ప్రజాస్వామ్యాన్ని ప్రభుత్వం అణిచివేసిందని, ఆర్టికల్ 370ని నిరంకుశ పద్ధతిలో తొలిగించిందని జాతిపిత మహాత్మా గాంధీ మనుమడు తుషార్ గాంధీ ఆరోపించారు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. 'ఆర్టికల్ 370 తొలిగింపులో ప్రజాస్వామ్య విధానాన్ని పాటించలేదు. నిరంకుశ వైఖరితో దీన్ని తొలిగించారు' అని అన్నారు. మత అసహనం గురించి మాట్లాడుతూ.. 'జైశ్రీరాం అనాలని ప్రజలను బలవంతపెడుతున్నారు. ఇందులో భక్తి ఉన్నదా?' అని తుషార్ గాంధీ ప్రశ్నించారు. ఎవరూ ప్రశ్నించకుండా ఉండేందుకే సమాచార హక్కు చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగార్చిందని విమర్శించారు. 'ఓ వ్యాపార వేత్త (కాఫీ డే అధినేత సిద్ధార్థ) ఆత్మహత్య చేసుకుంటే దేశవ్యాప్తంగా చర్చోపచర్చలు జరుగుతున్నాయి. రైతులు ఆత్మహత్య చేసుకుంటే కన్నీరుగార్చే వారు ఎవరూ ఉండరు' అని వ్యాఖ్యానించారు.

ఢిల్లీకి చేరిన సంఝౌతా ఎక్స్‌ప్రెస్

న్యూఢిల్లీ, ఆగస్టు 9: భారత్-పాక్ మధ్య నడిచే సంఝౌతా ఎక్స్‌ప్రెస్ ఎట్టకేలకు శుక్రవారం ఢిల్లీకి చేరుకున్నది. పాకిస్థాన్ గురువారం వాఘా సరిహద్దులో దీనిని నిలిపివేసిన సంగతి తెలిసిందే. 4.30 గంటలు ఆలస్యంగా శుక్రవారం ఉదయం 8:05 గంటలకు ఈ రైలు 117 మంది ప్రయాణికులతో పాత ఢిల్లీ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నది. రైలు రద్దు గురించి పాక్ తమకు సమాచారం అందించలేదని భారత రైల్వే అధికారులు తెలిపారు.

ఢిల్లీలో సంఝౌతా ఎక్స్‌ప్రెస్ నుంచి బిగిన ప్రయాణికులు

థార్ ఎక్స్‌ప్రెస్‌ను అడ్డుకున్న పాకిస్థాన్!

ఇస్లామాబాద్: సంఝౌతా ఎక్స్‌ప్రెస్ సేవలను నిలిపివేసిన పాకిస్థాన్ తాజాగా థార్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలపై సైతం వేటు వేసింది. ఈ విషయాన్ని పాకిస్థాన్ రైల్వే మంత్రి షేక్ రషీద్ వెల్లడించారు. శుక్రవారం రాత్రి ఆఖరి సర్వీసు నడుస్తుందని ఆయన తెలిపారు. భారత్, పాకిస్థాన్‌ను అనుసంధానం చేస్తూ రాజస్థాన్ సరిహద్దుల గుండా ఈ సర్వీసు నడుస్తున్నది. భారత్‌లోని జోధ్‌పూర్ భగత్ కీ కోఠి స్టేషన్ నుంచి పాక్‌లోని కరాచీ వరకూ వెళ్లే ఈ రైలు ప్రతీ శుక్రవారం రాత్రి జోధ్‌పూర్ బయలుదేరుతుంది. శనివారం ఉదయం 7గంటలకు రాజస్థాన్ సరిహద్దులోని బర్మార్‌కు చేరుకుంటుంది. అయితే, పాక్ తాజా నిర్ణయంతో బర్మార్ తర్వాత థార్ ఎక్స్‌ప్రెస్ సర్వీసు నడవడంపై ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. భారత్‌కి రావాలనుకునే పాక్‌లోని హిందువులు ఎక్కువగా ఈ రైలులో ప్రయాణిస్తారు. 13 ఏండ్లలో నాలుగు లక్షల మంది ప్రయాణించినట్టు అంచనా. థార్ ఎక్స్‌ప్రెస్ రద్దు గురించి పాక్ నుంచి తమకు ఎలాంటి అధికారిక సమాచారం అందలేదని జోధ్‌పూర్ డివిజన్ ప్రతినిధి తెలిపారు.

కశ్మీర్‌లో ఆంక్షల సడలింపు

శ్రీనగర్‌లోని మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

- జమ్ములో 144 సెక్షన్ ఎత్తివేత
- నేటి నుంచి తెరుచుకోనున్న విద్యాసంస్థలు
- శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలకు రాష్ట్రవ్యాప్తంగా అనుమతి
- కశ్మీర్‌కు వెళ్లేందుకు ఏచూరి, డీ రాజా విఫలయత్నం

శ్రీనగర్, ఆగస్టు 9: జమ్ముకశ్మీర్‌లో పరిస్థితి కాస్త కుదుటపడింది. ప్రత్యేక ప్రార్థనల నేపథ్యంలో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఆంక్షలను సడలించారు. కర్ఫ్యూతో ఐదురోజులుగా ఇంటికే పరిమితమైన కశ్మీరీలు ఇండ్లనుంచి బయటికొచ్చారు. సమీప మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. మరోవైపు జమ్ములో 144 సెక్షన్‌ను ఎత్తివేస్తున్నట్టు కలెక్టర్ సుష్మ చౌహాన్ తెలిపారు. దోడ, కిస్త్వార్, కథువా, సాంబా జిల్లాల్లో ఆంక్షలు సడలించారు. శనివారం నుంచి విద్యా సంస్థలు తెరుస్తామని అధికారులు తెలిపారు. భద్రతాధికారులు ఇచ్చిన నివేదిక మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. శ్రీనగర్‌తోపాటు దక్షిణ కశ్మీర్‌లో అంతా ప్రశాంతంగా ఉన్నదని చెప్పారు. శుక్రవారం ఉత్తర కశ్మీర్‌లో కొన్నిచోట్ల అల్లరిమూకలు రాళ్లదాడికి దిగాయని, వారిని వెంటనే నియంత్రించామన్నారు.

గవర్నర్‌తో దోవల్ భేటీ

అజిత్‌దోవల్ శుక్రవారం కూడా జమ్ముకశ్మీర్‌లో పర్యటించారు. రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ సత్యపాల్ మాలిక్‌ను కలిశారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను, భద్రతా బలగాల మోహరింపుపై సమీక్షించారు. ప్రజలకు మరింత చేరువ కావడం, నిత్యావసరాలు అందించడంలో సహాయం చేయడం, భద్రతా చర్యలు తదితర అంశాలపై చర్చించారని అధికారులు తెలిపారు. అనంతరం దోవల్ తన సహచరులు, పలువురు సీనియర్ పోలీస్ అధికారులతో కలిసి శ్రీనగర్‌లోని పలు ప్రాంతాల్లో కలియదిరిగారు. స్థానికులతో మాట్లాడారు. సీఆర్పీఎఫ్ అధికారులను కలిసి శాంతిభద్రతలను కాపాడటంలో వారి కృషిని ప్రశంసించారు. వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

వామపక్ష నేతల విఫలయత్నం

సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా శుక్రవారం కశ్మీర్‌కు వెళ్లేందుకు ప్రయత్నించారు. వారు శ్రీనగర్ విమానాశ్రయానికి చేరుకోగానే అధికారులు అడ్డుకున్నారు. వారికి సర్దిచెప్పి తిరిగి ఢిల్లీకి పంపారు. వారిద్దరూ ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. కశ్మీర్ సమస్య పరిష్కారానికి వాజపేయి ప్రవచించిన 'జమ్‌హూరియత్, ఇన్సానియత్, కశ్మీరియత్' అన్న నినాదాన్ని మోదీ ప్రభుత్వం పక్కనబెట్టిందని ఏచూరి మండిపడ్డారు. స్థానిక కోర్టు ఆదేశాలపేరుతో తమను శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్‌లో అడ్డుకున్నప్పుడు నాలుగు గంటలు అక్కడే బైఠాయించామని తెలిపారు. కశ్మీర్‌లో అంతా బాగానే ఉంటే ఈ నిర్బంధం ఎందుకని డీ రాజా ప్రశ్నించారు. కశ్మీర్‌లో పర్యటిస్తామని గవర్నర్‌కు ముందే సమాచారమిచ్చినా ఎలా అడ్డుకుంటారని నిలదీశారు. తాము వెళ్లకముందే తమను అడ్డుకోవాలని స్థానిక కోర్టు ఆదేశించడం ఏమిటన్నారు. మరోవైపు కేంద్రం చారిత్రాత్మక నిర్ణయం నేపథ్యంలో ఈ నెల 15న రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో 'జస్న్-ఏ-ఆజాదీ' పేరుతో సంబురాలు నిర్వహించనున్నట్టు జమ్ముకశ్మీర్ బీజేపీ కార్యదర్శి అశోక్‌కౌల్ వెల్లడించారు.

మరో 20 మంది తరలింపు

ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో అల్లర్లు సృష్టిస్తారని భావిస్తున్న మరో 20 మందిని అధికారులు శ్రీనగర్ నుంచి ఆగ్రాకు తరలించారు. గతంలో వేర్పాటువాద ఉద్యమంలో పాల్గొన్నవారిని, ఉగ్ర సంబంధాలు ఉన్నట్టు అనుమానిస్తున్నవారిని వైమానిక దళ ప్రత్యేక విమానంలో ఆగ్రా సెంట్రల్ జైలుకు తరలిస్తున్నారు. గురువారం 25 మందిని తీసుకెళ్లారు. వీరిలో కశ్మీర్ హైకోర్టు లాయర్ల సంఘం అధ్యక్షుడు మెయిన్ ఖయ్యూమ్ కూడా ఉన్నారు.

తమకు స్వేచ్ఛ కావాలని శ్రీనగర్‌లో ప్రదర్శన చేస్తున్న కశ్మీరీలు

అక్టోబర్ 31 నుంచి..

ఉనికిలోకి జమ్ముకశ్మీర్, లడఖ్ యూటీలు

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్ విభజన చట్టానికి రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ శుక్రవారం ఆమోదముద్ర వేశారు. స్వాతంత్ర్యానంతరం 565 సంస్థానాలను భారత్‌లో విలీనం చేయడంలో కీలకంగా వ్యవహరించిన దేశతొలి హోం మంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 31 నుంచి నూతన కేంద్రపాలిత ప్రాంతాలు జమ్ముకశ్మీర్, లడఖ్ ఉనికిలోకి రానున్నాయి. జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2019కి రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారని కేంద్ర హోం శాఖకు చెందిన అధికారి ఒకరు శుక్రవారం తెలిపారు. 'జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 2 క్లాజ్ ఏ ద్వారా దఖలుపడిన అధికారాలను అనుసరించి కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం అమలు కోసం అక్టోబర్ 31వ తేదీని 'అపాయింటెడ్ డే'గా నిర్ణయించింది' అని హోం శాఖ ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం.. జమ్ముకశ్మీర్ అసెంబ్లీతో కూడిన యూటీగా, లడఖ్ అసెంబ్లీ లేని యూటీగా మారనున్నాయి. ఈ రెండు యూటీల్లోనూ శాంతిభద్రతలు కేంద్రం పరిధిలోకి వెళ్లనున్నాయి. కొత్తగా ఏర్పాటయ్యే జమ్ముకశ్మీర్ యూటీ అసెంబ్లీలో మొత్తం 107 స్థానాలు ఉంటాయి. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఆ సంఖ్యను 114కు పెంచనున్నారు. జమ్ముకశ్మీర్‌కు 5, లడఖ్‌కు ఒక పార్లమెంట్ స్థానం కేటాయించారు. ఆర్టికల్ 370 రద్దు నిర్ణయం తీసుకున్న మూడు రోజుల తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ గురువారం జాతినుద్దేశించి ప్రసంగిస్తూ.. పరిస్థితులు కుదుటపడిన అనంతరం జమ్ము కశ్మీర్‌కు మళ్లీ రాష్ట్ర ప్రతిపత్తి దక్కుతుందని పేర్కొన్న విషయం తెలిసిందే.

కశ్మీర్‌పై మా విధానం మారదు

- మళ్లీ స్పష్టం చేసిన అమెరికా
- జోక్యానికి నిరాకరించిన చైనా

వాషింగ్టన్: వాషింగ్టన్, ఆగస్టు 9: కశ్మీర్‌పై తమ విధానంలో ఎటువంటి మార్పులేదని అమెరికా పునరుద్ఘాటించింది. ఇటీవల చోటుచేసున్న పరిణామాలపై భారత్-పాక్ సంయమనం పాటించాలని, ప్రత్యక్ష చర్చలతో సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించింది. కశ్మీర్ అంశం పూర్తిగా భారత్-పాక్ ద్వైపాక్షిక అంశమని అమెరికా అధికార ప్రతినిధి మోర్గాన్ ఓర్టగస్ గురువారం తెలిపారు. కశ్మీర్ వివాదంపై ఇరు దేశాలు శాంతియుత వాతావరణంలో చర్చలు జరుపుకోవాలని, దానికి అమెరికా పూర్తి మద్దతు ఉంటుందని ఆమె అన్నారు. అలాగే, ముందే ఖరారైన విధంగా అమెరికా ప్రతినిధి ఒకరు వచ్చే వారం ఢిల్లీలో పర్యటిస్తారని ఆమె వెల్లడించారు. 'ఇరుదేశాలు సహనం,ప్రశాంతతతో వ్యవహరించాలని మేము కోరుకుంటున్నాం. కశ్మీర్ వివాదంపై భారత్-పాక్ ప్రత్యక్ష చర్చలు జరుపాలి. దానికి అమెరికా పూర్తి మద్దతు ఉంటుంది' అని ఓర్టగస్ అన్నారు. ప్రస్తుతం ఇరు దేశాల్లో నెలకొన్న పరిస్థితులను తాము గమనిస్తున్నామని ఆమె వ్యాఖ్యానించారు. 'భారత్-పాక్‌తో అమెరికాకు బలమైన సంబంధాలు ఉన్నాయి. పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఇటీవలి అమెరికా పర్యటన కేవలం కశ్మీర్ ప్రాధాన్యంగా సాగలేదు. ఇతర అంశాలపై కూడా చర్చించాం. మాకు భారత్‌తో ఎంతటి దగ్గరి సంబంధాలు ఉన్నాయో, పాక్‌తో కూడా అలాంటి సంబంధాలే ఉన్నాయి' అని అన్నారు. 'ప్రపంచంలో ఏ దేశంలోనైనా ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటే, అక్కడి ప్రజలు శాంతియుతంగా ఉండాలని అమెరికా సూచిస్తుంది. మానవహక్కులకు గౌరవమిస్తూ, అంతర్జాతీయ నిబంధనలను, చట్టాల్ని పాటించాలని ఆయా దేశాలకు సలహా ఇస్తాం' అని అన్నారు. కశ్మీర్‌తో సంబంధం ఉన్న అన్ని భాగస్వామ్య పక్షాలు సంయమనం పాటించాలని ఆమె కోరారు. అధికరణం 370 రద్దుకు సంబంధించి భారత్ తమకు ముందే సమాచారం ఇచ్చిందన్న వార్తల్ని ఓర్టగస్ మరోసారి కొట్టివేశారు.

మీరే సామరస్యంగా చర్చించుకోండి: చైనా

కశ్మీర్ విభజన, ఆర్టికల్ 370 రద్దుపై తమకు మద్దతుగా నిలవాలంటూ పాకిస్థాన్ విదేశాంగ మంత్రి షా మహమ్మద్ ఖురేషి చైనాను కోరారు. అయితే, కశ్మీర్ అంశంపై జోక్యానికి చైనా నిరాకరించింది. కశ్మీర్ సమస్యను భారత్-పాక్ సామరస్యంగా చర్చలతో పరిష్కరించుకోవాలని, ఇరు దేశాల్లో శాంతి, స్థిరత్వం నెలకొనేలా చర్యలు తీసుకోవాలని చైనా సూచించింది.

సిమ్లా ఒప్పందాన్ని గుర్తుచేసిన ఐరాస

కశ్మీర్‌పై భారత్-పాక్ మధ్య 1972 నాటి సిమ్లా ఒప్పందం ఉన్నదని పాక్ కు ఐక్యరాజ్య సమితి (ఐరాస) ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటేరస్ గుర్తుచేశారు. కశ్మీర్ అంశాన్ని ఇటీవల తన దృష్టికి తీసుకెళ్లిన పాక్‌తో గుటేరస్ పై విధంగా అన్నారు. 'కశ్మీర్ భారత్- పాక్ ద్వైపాక్షిక సమస్య. దాన్ని శాంతియుత చర్చలతో పరిష్కరించుకోవాలి. మూడో పక్షం మధ్యవర్తిత్వం అవసరం లేదు' అని అన్నారు. ఆర్టికల్ 370 రద్దుపై ఐరాసకి పాకిస్థాన్ రాసిన లేఖపై స్పందించేందుకు ఐరాస భద్రతా మండలి చీఫ్ జోవన్నా ప్రోనెక్కా నిరాకరించారు.

భారత్‌తో యుద్ధముప్పు

- కశ్మీర్‌పై ప్రపంచ దృష్టిని మళ్లించేందుకు యత్నిస్తున్నది
- పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్

ఇస్లామాబాద్, ఆగస్టు 9: పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మరోసారి భారత్‌పై తన అక్కసును వెళ్లగక్కారు. యుద్ధం వంటి పరిస్థితిని భారత్ సృష్టిస్తున్నదని ఆరోపించారు. పాకిస్థాన్‌కు చెందిన కొందరు జర్నలిస్టులతో ఇమ్రాన్‌ఖాన్ మాట్లాడారు. పుల్వామా ఘటన అనంతర పరిణామాల మాదిరిగా కశ్మీర్‌లో ఏమి జరుగుతున్నది అన్నది ప్రపంచానికి తెలియకుండా దృష్టిని మళ్లించేందుకు భారత్ ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. 'యుద్ధం ముప్పు నిజంగా పొంచి ఉంది. అలాంటి పరిస్థితిని మేము కచ్చితంగా ఎదుర్కొంటాం. ఇలాంటి కారణాలు రెండు దేశాల మధ్య గతంలో యుద్ధానికి ఎలా దారి తీశాయో మనం చూశాం' అని ఇమ్రాన్ ఖాన్ అన్నారు. కశ్మీర్‌పై మధ్యవర్తిత్వం జరుపుతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పడంతోనే ఆ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దుపై భారత్ అనూహ్య నిర్ణయం తీసుకున్నదని ఆయన ఆరోపించారు. భారత్‌తో సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు తాము చాలా ప్రయత్నించామని, అయితే భారత్ ఆ అవకాశాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. తాము యుద్ధాన్ని కోరుకోవడం లేదన్నారు.

భయాందోళన సృష్టించేందుకు యత్నం

పాక్‌పై భారత విదేశాంగ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ మండిపాటు

న్యూఢిల్లీ: యుద్ధం యుద్ధం వంటి పరిస్థితిని సృష్టిస్తున్నారన్న పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ వ్యాఖ్యలను భారత్ ఖండించింది. ఈ పరిస్థితి ఉన్నట్లు అంతర్జాతీయ సమాజం భావించకపోయినా, ఏదో జరుగుతున్నట్లు భయాందోళన సృష్టించేందుకు పాక్ ప్రయత్నిస్తున్నదని ఆరోపించింది. 'కొత్త వాస్తవాన్ని పాక్ గ్రహించాల్సిన తరుణమిది. ఇకనైనా భారత అంతర్గత వ్యవహారాల్లో పాక్ జోక్యం చేసుకోకుండా ఉండాలి' అని భారత విదేశాంగ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ సూచించారు. జమ్ముకశ్మీర్ ప్రజల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దుతోపాటు రాష్ట్ర విభజన నిర్ణయం తీసుకున్నదని ఆయన తెలిపారు. శుక్రవారం రవీశ్ మీడియాతో మాట్లాడుతూ.. 'జమ్ముకశ్మీర్‌పై భారత చర్యలకు పాకిస్థాన్‌లో వణుకు మొదలైంది. ఈ ప్రాంతం అభివృద్ధి చెందితే కశ్మీర్ ప్రజలను తప్పుదారి పట్టించలేమని పాక్ భావిస్తున్నది. శాంతి ఒప్పందానికి కశ్మీర్ అంశాన్ని ముడిపెట్టాలన్న ఆ దేశ ప్రయత్నాలు బెడిసికొట్టాయి' అని విమర్శించారు. సంఝౌతా ఎక్స్‌ప్రెస్ రద్దు నిర్ణయాన్ని పాకిస్థాన్ ఏకపక్షంగా తీసుకున్నదని ఆరోపించారు. పాక్ చెరలో ఉన్న భారత నౌకాదళ మాజీ అధికారి కుల్‌భూషన్ జాదవ్‌ను దౌత్యపరంగా కలిసేందుకు పాక్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు రవీశ్ కుమార్ వెల్లడించారు.

భారత వినోదం బంద్!

- భారత సాంస్కృతిక, వినోద కార్యక్రమాలపై పాక్ నిషేధం

ఫిర్‌దౌస్ ఆషిక్ అవన్

ఇస్లామాబాద్: భారత్‌తో దౌత్య, వాణిజ్య సంబంధాలను తెంచేసుకున్న పాకిస్థాన్ తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నది. వినోదరంగానికి చెందిన అన్ని రకాల సాంస్కృతిక మార్పిడిలు, కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్టు నిర్ణయించింది. జమ్ముకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని కేంద్రం రద్దు చేయడంతోపాటు ఆ రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ పాకిస్థాన్ భారత్‌తో సంబంధాలను తెంచుకుంటూపోతున్నది. ఇందులో భాగంగా, వినోద రంగంలో ఇరుదేశాలకు చెందిన ఉమ్మడి వ్యాపారాలను బహిష్కరిస్తున్నట్టు పాక్ ప్రధాని ప్రత్యేక సహాయకురాలు(సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ) ఫిర్‌దౌస్ ఆషిక్ అవన్ పేర్కొన్నట్టు పాకిస్థాన్ పత్రిక డాన్ పేర్కొంది. 'ఇండియాకు నో చెప్పండి(భారత్‌ను బహిష్కరించండి)' పేరుతో ఓ జాతీయ నినాదాన్ని పాక్ సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ గురువారం ప్రారంభించినట్టు కూడా పేర్కొంది. 'భారత్ నుంచి వచ్చే అన్ని రకాల కార్యక్రమాలను బహిష్కరించాలి. ఈ విషయంపై పెమ్ర (పాకిస్థాన్ ఎలక్ట్రానిక్ మీడియా రెగ్యులేటరీ అథారిటీ) అప్రమత్తతో ఉండాలి. అలాగే, భారత డీటీహెచ్ పరికరాలను విక్రయించే వాళ్లపై చర్యలు తీసుకోవాలని పెమ్రకు సూచిస్తున్నాం' అని అవన్ అన్నారు. సాంస్కృతిక మార్పిడి కారణంగా పాకిస్థాన్ యువత మనసులు కలుషితం అవుతున్నాయని, 'హిందూత్వ భావజాలంపై' పాక్ అన్ని విధాలుగా పోరాటం చేస్తుందని అన్నారు. ఇందుకు గానూ జాతీయ భద్రతా మండలి ఓ సమితిని ఏర్పాటు చేసిందని తెలిపారు. పాక్‌పై భారత సాంస్కృతిక దండయాత్రను ఈ పరిస్థితుల్లో అణిచివేయాల్సిన అవసరం ఉన్నదని, ఇందుకు మీడియా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె అన్నారు. పాకిస్థాన్‌లో భారతీయ సినిమాల ప్రదర్శనపై ఇటీవల నిషేధం విధించడాన్ని ఆమె గుర్తుచేశారు. 'ఎలాంటి భారతీయ సినిమా పాకిస్థాన్‌లో ప్రదర్శించబడదు. డ్రామా, సినిమాలు, భారత కార్యక్రమాలను పాక్‌లో నిషేధించాం' అని అవన్ ట్వీట్ చేశారు.

మళ్లీ 'బ్యాలెట్' ప్రసక్తే లేదు

- తేల్చి చెప్పిన సీఈసీ సునిల్ అరోరా

సునిల్ అరోరా

కోల్‌కతా, ఆగస్టు 9: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) ద్వారా కాకుండా బ్యాలెట్ పేపర్ల ద్వారానే తిరిగి ఎన్నికలు నిర్వహించాలని పలు రాజకీయ పార్టీలు చేస్తున్న డిమాండ్‌ను కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి సునీల్ అరోరా తోసిపుచ్చారు. మళ్లీ బ్యాలెట్ పద్ధతివైపు మళ్లే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయొచ్చని, బ్యాలెట్ పద్ధతిలోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతోపాటు విపక్ష నేతలు పదే పదే డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర అభివృద్ధి చెందిన దేశాలు గతంలో ఈవీఎంలను ఉపయోగించాయని, కానీ ఇప్పుడు ఆ దేశాలు బ్యాలెట్ పద్ధతివైపు మళ్లాయని మమత తరచూ వ్యాఖ్యానిస్తుంటారు. ప్రతిపక్షాల డిమాండ్‌పై అరోరా శుక్రవారం మరోసారి స్పందిస్తూ.. 'బ్యాలెట్ పేపర్ల శకం వైపు మేం వెళ్లాలనుకోవడం లేదు. బ్యాలెట్ పేపర్లు ఇక గతమంటూ సుప్రీంకోర్టు ఒకటి కంటే ఎక్కువసార్లే చెప్పింది' అని వ్యాఖ్యానించారు. ఐఐఎం కోల్‌కతా, పశ్చిమ బెంగాల్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జ్యుడీషియల్ సైన్సెస్ శుక్రవారం, శనివారం నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆయన కోల్‌కతాకు వచ్చారు. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలపై విలేకరులు ప్రశ్నించగా.. కేంద్ర హోం శాఖ, న్యాయ శాఖ నుంచి అధికారిక సమాచారం అందగానే ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. వివాదాస్పదమైన జాతీయ పౌర రిజిస్టర్‌ను పశ్చిమ బెంగాల్‌లోనూ అమలుచేయడంపై ప్రశ్నించగా, ఆ అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నదని, తానేమీ వ్యాఖ్యానించలేనన్నారు.

వేలూరు ఉప ఎన్నికలో డీఎంకే విజయం

చెన్నై: తమిళనాడులోని వేలూరు లోక్‌సభ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో స్టాలిన్ ఆధ్వర్యంలోని డీఎంకే విజయం సాధించింది. అధికార అన్నాడీఎంకే అభ్యర్థి ఏసీ షణ్ముగంపై డీఎంకే అభ్యర్థి కథీర్ ఆనంద్ 8,141 ఓట్ల మెజారిటీతో గెలిపొందారు. ఈ ఎన్నికలో నటుడు కమల్‌హాసన్ పార్టీ మక్కల్ నీది మయ్యం, అన్నాడీఎంకే నుంచి బయటికి వచ్చి అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం పార్టీని స్థాపించిన టీటీవీ దినకరన్ పోటీ చేయలేదు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అన్నాడీఎంకే మద్దతు ఇస్తుండటం, వేలూరు నియోజకవర్గంలో ముస్లిం ఓటర్లు అధికంగా ఉండటంతో డీఎంకే విజయం సాధించిందని విశ్లేషకులు చెబుతున్నారు. డీఎంకే కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాము చేస్తున్న పోరాటమే విజయానికి కారణమని తెలిపింది. కాగా దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పుడు వేలూరు నియోజకవర్గంలో భారీ స్థాయిలో నగదు పట్టుబడటంతో ఇక్కడ ఎన్నికలను ఈసీ వాయిదా వేసింది.

రౌడీ, పోలీస్ ప్రేమాయణం!

గ్రేటర్ నోయిడాలో చిత్రమైన ప్రేమకథ

పెండ్లిపీటలపై రాహుల్, పాయల్

లఖ్నో: సినిమా కథకు ఏమాత్రం తీసిసోని లవ్‌స్టోరీ ఇది. రౌడీకి, పోలీస్‌కు మధ్య కోర్టు ప్రాంగణంలో మొగ్గతొడిగిన ప్రేమ.. మూడు ముళ్ల బంధంతో సుఖాంతమైంది. ఈ రౌడీ, పోలీస్ ప్రేమపెళ్లి గ్రేటర్‌నోయిడాలో చర్చనీయాంశమైంది. 30 ఏండ్ల రాహుల్ ధప్రానా ఓ వ్యాపారి హత్య కేసులో 2014 మే 8న అరెస్టయ్యాడు. అతడిపై డజనుకుపైగా కేసులున్నాయి. సూరజ్‌పూర్ కోర్టులో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పాయల్‌తో అతడికి పరిచయం ఏర్పడింది. కోర్టు విచారణ సందర్భంగా వారు తరచూ కలుసుకునేవారు. అలా వారి మధ్య ప్రేమ చిగురించింది. అతడు జైలు నుంచి విడుదలైన వెంటనే ఇద్దరూ వివాహం చేసుకున్నారు. రాహుల్ నేర చరిత్ర నేపథ్యంలో అజ్ఞాత జీవితం గడుపుతున్నారు. పాయల్ మాత్రం అప్పుడప్పుడు తన అత్తగారి ఊరికి వచ్చి వెళ్తుండగా, ఆమె భర్త మాత్రం కొన్ని నెలలుగా ఎవరికీ కనిపించలేదు. వివాహ సమయం నాటికి పాయల్.. గౌతమబుద్ధ స్టేషన్‌లో పనిచేస్తున్నారు. అయితే పెండ్లి తర్వాత ఆమె ఆచూకీ తెలియరాలేదని పోలీసులు చెప్పారు. గతంలో ఆటోడ్రైవర్‌గా పనిచేసిన రాహుల్.. పేరు, డబ్బు కోసం 2008లో అనిల్ దుజానా గ్యాంగ్‌లో చేరాడు. 'వ్యాపారి హత్య కేసులో జైలు శిక్ష అనంతరం అతడు నేర ప్రపంచంలోకి మారాడు. 2016లో పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసిన తన తల్లికి ఓటేయాలని గ్రామస్థులను బెదిరించాడు. ఈ సందర్భంలోనే అతడిపై నిఘా ప్రారంభించాం' అని ఎస్పీ తెలిపారు.

ఉన్నావ్ కేసులో ఎమ్మెల్యేపై లైంగికదాడి కేసులు నమోదు

న్యూఢిల్లీ: బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే కుల్‌దీప్ సెన్‌గర్‌తోపాటు సహా నిందితుడు శశి సింగ్‌పై లైంగికదాడి కేసులు నమోదయ్యాయి. 2017లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో ఓ బాలికపై లైంగికదాడికి సంబంధించి ఢిల్లీ జిల్లా కోర్టు న్యాయమూర్తి ధర్మేష్ శర్మ వారిపై కిడ్నాప్, లైంగిక దాడి, పోస్కో చట్టం వంటి కేసులను నమోదు చేశారు. ఇటీవల బాధితురాలు ప్రయాణిస్తున్న కారును ఓ లారీ ఢీకొనగా ఆమె పిన్ని, మేనత్త చనిపోయిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంతో బాధితురాలితోపాటు ఆమె న్యాయవాది తీవ్

కశ్మీర్ సమస్యతో అఫ్ఘానిస్థాన్ తాలిబన్లకు ఏ సంబంధం లేదు. కశ్మీర్ సమస్యతో తాలిబన్లను ముడిపెట్టడం విచారకరం. ఏ రెండు దేశాల మధ్య ఆధిపత్య పోరులో తాలిబన్లను భాగస్వాములను చేయటం మంచిది కాదు.

జబీహుల్లా ముజాహిద్, తాలిబన్ అధికార ప్రతినిధి

కశ్మీర్ విషయంలో అమెరికా వైఖరిలో మార్పులేదు. భారత్, పాకిస్థాన్‌లు నేరుగా కశ్మీర్ సమస్యపై చర్చించుకోవాలన్నదే మా అభిమతం. దానికి మా సంపూర్ణ మద్దతు ఇరుదేశాలకూ ఉంటుంది.

మోర్గాన్ ఒర్టేగస్, అమెరికా విదేశాంగ అధికార ప్రతినిధి

చరిత్రలో నేడు

1759

స్పెయిన్ రాజుగా పట్టాభిషేకం చేసిన కార్లోస్-3.

1926

శాంతి ఒప్పందంపై సంతకాలు చేసిన ఇటలీ, స్పెయిన్‌లు.

1992

భూమిపైకి చేరుకున్న సోయుజ్ టీఎం-15.

కరువు పరిస్థితుల నుంచి బయటపడేందుకు కర్ణాటక ప్రభుత్వం కనీసం రెండు టీఎంసీల నీటిని విడుదల చేయాలని రెండువారాల కిందట మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. భారీ వర్షాల కారణంగా మహారాష్ట్ర రెండు టీఎంసీలనే కాదు, నలభై టీఎంసీల నీటిని విడుదల చేసింది. దీంతో కర్ణాటకలోని ప్రాజెక్టులన్నీ నిండుకుండలవటమే కాదు, వరదలు ముంచెత్తుతున్నాయి. కర్ణాటకలోని మెజారిటీ జిల్లాలు జలమయమయ్యాయి. పంటలు మునిగాయి. పది మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. కరువు, వరదలు ఒకదాని తర్వాత ఒకటిగా జనజీవితాన్ని అతలాకుతలం చేస్తున్న తీరు పాలకుల దూరదృష్టి లోపాన్ని ఎత్తిచూపుతున్నది.

ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్

జమ్ము కశ్మీర్ విషయంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా పాకిస్థాన్ మున్నెన్నడూ లేనివిధంగా స్పందించింది. పాక్‌లోని భారత రాయబారిని బహిష్కరించటంతో పాటు, దౌత్య, వ్యాపార సంబంధాలన్నింటినీ నిలిపివేసింది. ఆర్టికల్ 370, 35ఏలను రద్దుచేయటం కశ్మీర్ ప్రజల హక్కులను హరించటమేనని పాక్ అభివర్ణించింది. దీన్ని భారత అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటంగా రాజకీయపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పాకిస్థాన్ తీరు వాంఛనీయం కాదంటున్నాయి.

ది హిందూ

ప్రజారోగ్యం పట్టదా?

కేంద్ర ప్రభుత్వం తోచిందే తడవుగా నిర్ణయాలు చేస్తూ పోతున్నది. ఎలాంటి చర్చలు, ప్రజాభిప్రాయాలకు తావులేకుండా పార్లమెంటులో ఉన్న మెజారిటీ బలంతో బిల్లుల రూపేణా విధాన నిర్ణయాలతో దూసుకుపోతున్నది. దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులు, వైద్యులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) లాంటి దేశవ్యాప్త సంస్థ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) బిల్లును కేంద్రం ఆమోదించింది. దీంతో జవాబుదారీతనంతో కూడిన అవినీతికి తావులేని, ప్రజానుకూల వైద్య విధానాన్ని తెస్తామని మోదీ ప్రభుత్వం అంటున్నది. ఈ క్రమంలో దశాబ్దాలుగా దేశ వైద్య విధానానికి మూలస్తంబంగా ఉన్న భారతీయ మెడికల్ కౌన్సిల్ (ఎంసీఐ)ని రద్దు చేస్తూ, పొంతనలేని వాదనను ముందుకుతెచ్చింది. అవినీతిలో కూరుకుపోయిన ఎంసీఐని రద్దుచేసి జవాబుదారీతనంతో కూడిన ఎన్ఎంసీకి రూపకల్పన చేశామంటున్నది. ఈ క్రమంలో మోదీ ప్రభుత్వం ప్రజాస్వామిక, సమాఖ్యస్ఫూర్తికి తూట్లు పొడిచింది. క్యాబినెట్ సెక్రటరీ నేతృత్వంలోని సెర్చ్ కమిటీ ఎన్ఎంసీ కౌన్సిల్ సభ్యులను ఎంపిక చేస్తుంది. 25 మంది సభ్యులుండే కౌన్సిల్‌లో ఐదుగురు మాత్రమే వైద్యవృత్తికి సంబంధించిన వారుంటారు. మిగతావారంతా వైద్యవృత్తితో సంబంధం లేని, కేంద్రంలోని ప్రభుత్వ కనుసన్నల్లో నడిచే వారుంటారనటంలో సందేహం లేదు. అలాగే ముగ్గురు సభ్యులుండే నాలుగు స్వయం ప్రతిపత్తిగల బోర్డులు నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు సహాయకరంగా పనిచేస్తాయని చెప్పుకొస్తున్నారు. మొత్తంగా రూపంలో, సారంలో ఎన్ఎంసీ అనేది కేంద్ర ప్రభుత్వాధిపత్యం, అజమాయిషీలో నడుస్తుందని తేటతెల్లమవుతున్నది.

దేశంలో సరైన వైద్యనిపుణులు అందుబాటులో లేక గ్రామీణ వైద్యరంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. సాధారణ పౌరుడు తన ఆదాయంలో డెబ్భై శాతానికి పైగా వైద్యం కోసమే ఖర్చు చేస్తున్న దుస్థితి ఉన్నది. దీంతో గ్రామీణ భారతం పేదరికంలో మగ్గిపోతున్నదని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. గ్రామీణ ప్రజావైద్యాన్ని బలోపేతం చేయటానికి ఈ వైద్యులను ఉద్యోగకల్పనతో వైద్యసేవలకు వినియోగించుకోవాలి.

దేశవ్యాప్త ప్రాతినిధ్యంతో ప్రజాస్వామికంగా ప్రత్యక్ష ఎన్నికల ద్వారా నిర్మాణమయ్యే ఎంసీఐని రద్దుచేసి తమ కనుసన్నల్లో నడిచే సంస్థగా దిగజార్చటం గర్హనీయం.

సుదీర్ఘ చరిత్ర కలిగిన 1956నాటి ఎంసీఐని రద్దుచేయటం వాంఛనీయం అనిపించుకోదు. దేశవ్యాప్త ప్రాతినిధ్యంతో ఎంసీఐ భారతీయ వైద్యాభివృద్ధికి ఎంతో కృషిచేసింది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వైద్యుల నుంచి నేరుగా ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నికైన 120 మంది ఎంసీఐ సభ్యులుగా ఆయా ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తారు. విశాలమైన భారతావనిలో వివిధ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్య అవసరాలు, తీసుకోవాల్సిన చర్యల గురించి, వైద్యవిధానంలో తీసుకురాదల్చిన సంస్కరణలు, అభివృద్ధి గురించి చర్చించి విధాన నిర్ణయంలో భాగస్వాములవుతారు. ఎంసీఐ నిర్మాణం, వ్యవహరణ అంతా ప్రజాస్వామికంగా, ఫెడరల్‌స్ఫూర్తికి ప్రతిబింబంగా ఉంటుంది. ఇలాంటి దాన్ని రద్దుపరిచి, పూర్తిగా పరోక్ష నియామకం ద్వారా ఏర్పడే ఎన్ఎంసీని ఏర్పాటుచేయటం ప్రజాస్వామ్యస్ఫూర్తికే విరుద్ధం. ఎంసీఐకి ఎన్నికైన 120 మందిలో ఎవరో కొందరు అవినీతికి పాల్పడుతున్నారని ఏకంగా దశాబ్దాల చరిత్ర ఉన్న ఎంసీఐని రద్దు చేస్తామనటం కేంద్రం అరువు తెచ్చుకున్న సాకు మాత్రమే. అలాగే నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రైవేటు వైద్యకళాశాల యాజమాన్యాల ప్రయోజనాలకు పెద్దపీట వేసి, పేదలకు వైద్యవిద్యను దూరం చేసే పనిని నేర్పుగా చేసింది. గతంలో అయితే ప్రైవేటు వైద్య కళాశాలల్లో 15 శాతం మాత్రమే యాజమాన్య కోటాగా వైద్యసీట్లు ఉండేవి. వాటిని యాజమాన్యాలు ఇష్టానుసారం అమ్ముకునేవారు. ఇప్పుడు వాటిని 50 శాతానికి పెంచి, ఫీజు తదితరాలను యాజమాన్యాలకు వదిలేయటం గమనార్హం.

నేషనల్ మెడికల్ కమిషన్ విధానాల్లో ముఖ్యమైనది వైద్యవృత్తి చేపట్టగోరే వారి విషయంలో తీసుకొచ్చిన విధానపరమైన మార్పులు తీవ్రమైనవి. వైద్యవిద్య అయిపోయిన వారు ఎవరైనా వృత్తి చేపట్టేందుకు లైసెన్సియేట్ పరీక్షలో ఉత్తీర్ణులు కావాలనే నిబంధన పెట్టారు. గతంలో అయితే ఇక్కడ ఎంసెట్, నీట్ లాంటి పరీక్షలు ఉత్తీర్ణులు కాకుండా విదేశాల్లో వైద్యవిద్య చదివి వచ్చినవారికే ఇలాంటి పరీక్ష నిర్వహించేవారు. ఇక్కడ నీట్ లాంటి కఠిన పరీక్షల్లో ఉత్తీర్ణులై, ర్యాంక్ సాధించి వైద్యవిద్యలో భాగంగా థియరీ, ప్రాక్టికల్స్ అవసరమైనంతగా చేసి, క్లినికల్ ప్రాక్టీస్ కూడా అయిపోయి ఉత్తీర్ణులైన వారు కూడా వృత్తి చేపట్టేందుకు 'నెక్స్ట్' పరీక్ష రాయాలనటాన్ని వైద్యవిద్యార్థులతో సహా, ఐఎంఏ కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఎలాంటి విద్య, వృత్తి నైపుణ్యాలు లేకుండా విదేశాల్లో చదివి వచ్చిన ధనవంతుల పిల్లలకు, ఇక్కడి వారితో సమానావకాశాలు కల్పించటానికే ఇదంతా అనే ఆరోపణలున్నాయి. మరీ ముఖ్యంగా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నాపత్రంతో వైద్య విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షిస్తామనటం అసమంజసం. నిజానికి ఏటా 60 వేల మంది వైద్య విద్యార్థులు పట్టా అందుకొని సమాజంలో అడుగుపెడుతున్నారు. వారందరూ తమకు పని కల్పించమని కోరుతున్నారు. సరైన సదుపాయాలు, వైద్యపరికరాలు అందించి వైద్యసేవలకు తమను వినియోగించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దేశంలో సరైన వైద్యనిపుణులు అందుబాటులో లేక గ్రామీణ వైద్యరంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. సాధారణ పౌరుడు తన ఆదాయంలో డెబ్భై శాతానికి పైగా వైద్యం కోసమే ఖర్చు చేస్తున్న దుస్థితి ఉన్నది. దీంతో గ్రామీణ భారతం పేదరికంలో మగ్గిపోతున్నదని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. గ్రామీణ ప్రజావైద్యాన్ని బలోపేతం చేయటానికి ఈ వైద్యులను ఉద్యోగకల్పనతో వైద్యసేవలకు వినియోగించుకోవాలి. దీనిపై దృష్టి పెట్టకుండా కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన నేషనల్ మెడికల్ కమిషన్ ప్రజారోగ్యాన్ని పక్కనపెట్టి అవినీతి పేర నీడతో యుద్ధం చేస్తున్నట్లు వ్యవహరిస్తున్నది.

జనగళం

ఉరిశిక్ష సరైనదే

వరంగల్ చిన్నారి శ్రీహితపై అత్యాచారం చేసి, హత్యచేసిన నిందితుడికి వరంగల్ జిల్లా ప్రత్యేక కోర్టు ఉరిశిక్ష వేయడం పట్ల యావత్ రాష్ట్ర ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నది. కేవలం 48 రోజుల్లోనే కేసు దర్యాప్తును పూర్తిచేయడం పట్ల పోలీసు అధికారుల పనితీరును కూడా ప్రజలు అభినందిస్తున్నారు. ఇదంతా బాగానే ఉంది. కానీ అత్యాచారం చేసి హత్యచేసిన నిందితుడికి ఉరివేయడంతోనే ఇలాంటి ఘటనలకు ముగింపు పడుతుందనుకోవడం సరికాదు. ఘటనకు సంబంధించిన కారణాలను విశ్లేషించి దానికి సంబంధించిన మూలాలను నిర్మూలించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ సామాజిక, లైంగిక హింసకు కారణమవుతున్న అంత రాజలంలోని కొన్ని సైట్లను నిషేధించాలి.

- చుంచు అరుణ్‌కుమార్, మంచిర్యాల

ప్రతిపక్షాల్లో మార్పు రావాలి

నూతన హంగులతో సరికొత్త సచివాలయాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం సన్నాహాలను ప్రారంభిస్తుంటే, సందిట్లో సడేమియా అన్నట్లు ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వం ఏ అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినా అడ్డుపడటం ప్రతిపక్షాలకు అలవాటైపోయింది. ప్రతిపక్షాల సూచనలు నిర్మాణాత్మకంగా, సహేతుకంగా ఉండాలె కానీ, పనిగట్టుకొని విమర్శలు చేయడాన్ని ఎవరూ స్వాగతించరు. ప్రతిపక్షాలు ఇలాగే వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల నాటికి ఉనికిని కోల్పోతాయని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

- జీడిపల్లి లింగారావు, కరీంనగర్

అదనపు బస్సులు కేటాయించాలె

మరికొన్ని రోజుల్లో రాఖీ పండుగ రాబోతున్నది. దీనికోసం ఆర్టీసీ అధికారులు ముందస్తు వ్యూహంతో వ్యవహరించాలి. ప్రయాణికుల సౌకర్యం కోసం అదనపు బస్సులను ఏర్పాటుచేయాలె. లేకపోతే ప్రయాణికుల ఇబ్బందులు పడే అవకాశాలున్నాయి. లేకుంటే ప్రైవేట్ వాహనదారులు అవకాశంగా తీసుకొని అందనికాడికి దండుకునే అవకాశాలున్నాయి.

- కొలిపాక శ్రీనివాస్, పెద్ద సముద్రాల, కరీంనగర్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7.8.9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ముక్తసరి

దేవులపల్లి ప్రభాకరరావు

క్విట్ ఇండియా

గాంధీజీ దక్షిణాఫ్రికా పోరాట నేపథ్యం గురించి ఆయన ప్రవచిస్తున్న సత్యం, అహింస, సత్యాగ్రహం సిద్ధాంతాల గురించి విన్నవారు, తెలిసినవారు కొందరు, ముఖ్యంగా మోతీలాల్‌నెహ్రూ, సర్దార్ పటేల్ వంటి పెద్ద నాయకులు మొదట 'ఈయన వల్ల, ఈయన శాంతియుత విధానాల వల్ల ఏమవుతుంది!' అని పెదవి విరిచి తర్వాత కొంతకాలానికి వాళ్లే గాంధీజీ ప్రధాన అనుచరులైనారు.

డెబ్భై ఏడేండ్ల కిందటి నిన్నటి రోజు ఆగస్టు 9 భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించవలసిన ఉజ్వల ఉద్యమం ప్రారంభమైంది. 'క్విట్ ఇండియా' (భారత్ ఛోడో) నినాదంతో గాంధీజీ బ్రిటిష్ పాలకులకు భారత ప్రజల శాంతియుత సమర అంతిమ శంఖారావాన్ని వినిపించిన చరిత్రాత్మకమైన రోజది. మూడేండ్లు లండన్ ఉన్నత విద్యార్జన జరిపి, బారిస్టర్‌గా స్వదేశం తిరిగివచ్చి, 1893లో న్యాయవాదిగా దక్షిణాఫ్రికా వెళ్లి, అక్కడే అనేక సంవత్సరాల నుంచి స్థిరపడిన భారతీయుల, ఇతర నల్లజాతీయుల ప్రాథమిక హక్కుల కోసం అపూర్వరీతిలో శాంతియుత సత్యాగ్రహ ఉద్యమాలు నిర్వహిస్తున్న గాంధీజీ స్వదేశం తిరిగివచ్చి భారత స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించాలని అప్పటికే అఖిల భారత ఉద్యమ నాయకులుగా ప్రసిద్ధి పొందిన లోక్‌మాన్య బాలగంగాధర తిలక్, గోపాలకృష్ణ గోఖలే అభ్యర్థించారు. తమను దిక్కులేనివారుగా చేసి గాంధీజీ స్వదేశం వెళ్లవద్దని దక్షిణాఫ్రికా ఉద్యమకారులు ఒత్తిడి తెచ్చారు. దక్షిణాఫ్రికాలో 22 ఏండ్లు విరామరహిత జీవితం గడిపిన, తన శాంతియుత సమర విధానాలకు దక్షిణాఫ్రికాను ఒక ప్రయోగశాలగా మార్చిన గాంధీజీ దక్షిణాఫ్రికా ఉద్యమాల పట్ల ఎంతటి సానుభూతి ఉన్నప్పటికీ అగ్రజులు తిలక్, గోఖలే అభ్యర్థనను, వారి మాటను తృణీకరించలేకపోయారు. వారి మాటను గౌరవించి గాంధీజీ 1915 జనవరి 9న బొంబయిలో నౌక దిగి స్వదేశం నేలపై అడుగుపెట్టారు. భారత జాతీయ కాంగ్రెస్‌లో అతివాదులకు ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌మాన్య బాలగంగాధరతిలక్, మితవాదులకు నాయకత్వం వహిస్తున్న గోపాలకృష్ణ గోఖలే తమ సైద్ధాంతిక, విధానపర విభేదాలకు అతీతంగా, నాటి క్లిష్ట పరిస్థితిలో గాంధీజీ సారథ్యం, నేతృత్వం భారత స్వాతంత్ర్య, జాతీయ ఉద్యమాలకు అత్యావశ్యకం, అనివార్యం అనుకున్నారు. దక్షిణాఫ్రికాలో తాడితుల, పీడితుల, జాతి విద్వేష బాధితుల కనీస ప్రాథమిక హక్కుల కోసం అవమానాలను, అక్రమాలను, దౌర్జన్యాలను, అమానుష చర్యలను, పాలకుల అధికార దుర్వినియోగాన్ని సహిస్తూ నిర్విరామ ఉద్యమాలు నిర్వహిస్తున్న గాంధీజీ స్వదేశంతో సంబంధాలు తెంచుకోలేదు, భారత జాతీయ కాంగ్రెస్‌తో సంబంధాలు కొనసాగించారు. కలకత్తా కాంగ్రెస్ మహాసభలో స్వయంగా పాల్గొని గాంధీజీ దక్షిణాఫ్రికా భారతీయుల పరిస్థితి, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. శాశ్వతంగా స్వదేశం తిరిగివచ్చిన గాంధీజీకి ఆయన రాజకీయ గురువు గోఖలే 'ఏడాది పాటు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశమంతటా పర్యటించి, అట్టడుగు ప్రజల మధ్యకు వెళ్లి ఇక్కడి పరిస్థితులను గమనించండ'ని సలహా ఇచ్చారు. మోకాళ్ల మీదికి ముతక ధోతి కట్టి, అంగి కూడా లేని భుజాలపై ఒక పంచె కప్పుకొని, మూడవ తరగతి రైలు పెట్టెలలో ప్రయాణిస్తూ, కాలినడకన తిరుగుతూ దరిద్ర నారాయణ రూపంతో గాంధీజీ దేశమంతటా, మారుమూల ప్రాంతాల్లో కూడా పర్యటించి ఇక్కడి దుర్భర పేదరికాన్ని, దారిద్ర్యాన్ని, అజ్ఞానాన్ని, అనారోగ్యాన్ని, అపరిశుభ్రతను, కులమత వ్యత్యాసాలను, వైషమ్యాలను, స్పర్ధలను గమనించి అమితాందోళనకు గురైనారు. కానీ ఆయన ఎంతమాత్రం అధైర్యపడలేదు. దక్షిణాఫ్రికా పోరాటాల్లో ఎన్నో కష్టాలు అనుభవించిన గాంధీజీ ముందు రెండు మార్గాలు కన్పించాయి; ఒకటి 'తోడో' మార్గం, రెండవది 'జోడో' మార్గం. గాంధీజీ తన సహజ స్వభావంతో, తన విశ్వాసాలకు అనుగుణంగా జోడో మార్గాన్ని అనుసరించాలనుకున్నారు. అతివాదం, మితవాదం ఘర్షణలతో ఛిద్రమవుతున్న భారత జాతీయ కాంగ్రెస్‌ను జుడాయించడం, తద్వారా భారత స్వాతంత్ర్య ఉద్యమానికి సమర్థవంత నాయకత్వం అందివ్వడం మొదటి కర్తవ్యమని, స్వాతంత్ర్య సమరంలో క్రియాశీల భాగస్వాములు కావడానికి సమాజంలోని అన్ని వర్గాల, అన్ని విశ్వాసాల ప్రజలను ఏకం చేయడం రెండవ కర్తవ్యమని గాంధీజీ భావించారు.

బ్రిటిష్ పాలనను అంతం చేసి, భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడం, దాదాపు రెండు వందల ఏండ్ల బానిస బంధనాలను బద్దలు చేయడం పరమ లక్ష్యాలుగా లేస్తూ పడుతూ, పడుతూ లేస్తూ కొనసాగుతున్న స్వాతంత్ర్య సమరానికి గాంధీజీ సమన్వయవాద దృక్పథంతో నాయకత్వ బాధ్యతను స్వీకరించారు. గాంధీజీ దక్షిణాఫ్రికా పోరాట నేపథ్యం గురించి ఆయన ప్రవచిస్తున్న సత్యం, అహింస, సత్యాగ్రహం సిద్ధాంతాల గురించి విన్నవారు, తెలిసినవారు కొందరు, ముఖ్యంగా మోతీలాల్ నెహ్రూ, సర్దార్ పటేల్ వంటి పెద్ద నాయకులు మొదట 'ఈయన వల్ల, ఈయన శాంతియుత విధానాల వల్ల ఏమవుతుంది!' అని పెదవి విరిచి తర్వాత కొంతకాలానికి వాళ్లే గాంధీజీ ప్రధాన అనుచరులైనారు. ఆయన వల్లనే అవుతుందని క్రమంగా గ్రహించారు. సాయుధ పోరాటంలో నమ్మకం ఉన్న తీవ్రవాదులు, విప్లవకారులు, సామ్యవాద భావాలచే ప్రభావితులైన సోషలిస్టులు, కమ్యూనిస్టులు-రాజులు, మహారాజులు, రాణులు, శ్రీమంతులు, నిరుపేదలు, పారిశ్రామిక-వాణిజ్య అధిపతులు, అన్నివర్గాలు, వృత్తులవారు గాంధీజీ నాయకత్వ ఛత్రం కిందికి వచ్చారు. ఉద్యమ విధానంలో గాంధీజీతో తీవ్రంగా విభేదించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్, మహామేధావి సి.రాజగోపాలచారి వంటివారు కూడా గాంధీజీ నాయకత్వంలో, ఆయన నీడలో నడిచారు. మొదటి నుంచి గాంధీజీ తన ఉద్యమాల్లో, నిర్మాణ కార్యక్రమాల్లో గ్రామీణ భారతానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. దక్షిణాఫ్రికా నుంచి వచ్చి, ఇక్కడి స్వాతంత్ర్య సమరానికి నాయకత్వం చేపట్టిన తర్వాత గాంధీజీ నిర్వహించిన మొదటి ఉద్యమ కార్యక్రమం చంపారన్ సత్యాగ్రహం 1917 ఏప్రిల్ 19న ప్రారంభమైంది. బీహార్‌లోని పక్కా గ్రామీణ ప్రాంతం చంపారన్. గాంధీజీ సత్యాగ్రహంలో చంపారన్ ప్రపంచ ప్రసిద్ధి పొందింది. పాట్నాలో ప్రముఖ న్యాయవాది బాబూ రాజేంద్రప్రసాద్ తన ధనార్జన వృత్తిని వదిలిపెట్టి గాంధీజీ అనుచరుడిగా మారింది చంపారన్ సత్యాగ్రహం రోజుల్లోనే. మహాత్ముడు గాంధీజీ అహింసా ప్రవక్త, శాంతిదూత. ఆయన అంతేగాక, సాటిలేని మేటి ఉద్యమ వ్యూహకర్త అని, పదిమంది చాణక్యులను మించిన రాజనీతిజ్ఞుడని, రాజకీయ చతురుడని, తన సిద్ధాంతాల విషయంలో ఎన్నడూ ఎక్కడా ఎవరితోను రాజీపడని మహానాయకుడని, ప్రత్యర్థుల (బ్రిటిష్ పాలకుల) కీలెరిగి వాతపెట్టడం లో గాంధీజీని మించిన దక్షులు ప్రపంచంలో ఇంకెవరూ లేరని ఆయన ఉద్యమాల చరిత్ర వెల్లడిస్తున్నది. గాంధీజీ 25 ఏండ్లు విడువకుండా నిర్వహించిన సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన శాంతియుత సత్యాగ్రహ ఉద్యమాలతో బానిస భారతదేశంలో బ్రిటిష్ పాలన తీవ్రంగా బలహీనపడింది. 'వైష్ణవ జనతో' గీతం ఆయనకు చాలా ఇష్టమైనప్పటికీ గాంధీజీ కులమతాల కుళ్లుకు అతీతుడైన మహోన్నత మానవతావాది. చంపారన్ తర్వాత గాంధీజీ నేతృత్వంలో సైమన్ కమిషన్ బహిష్కరణ (1929), దండి ఉప్పు సత్యాగ్రహం (1930 మార్చి) బ్రిటిష్ పాలకుల గుండెల్లో దడ పుట్టించాయి. భారతదేశంలో ఇక తమ పాలన పునాదులు కూలిపోతున్నాయని బ్రిటిష్ పాలకులు భయపడ్డారు. భయపడ్డారు గాని బ్రిటిష్ పాలకులు తప్పులు చేయకుండా ఉండలేదు.

రెండవ ప్రపంచయుద్ధం 1939 సెప్టెంబర్‌లో ప్రారంభమైన తర్వాత (ఈ యుద్ధంలో బ్రిటన్, అమెరికా-యూఎస్ఏ, ఫ్రాన్స్, సోవియట్ యూనియన్ తదితర మిత్రదేశాలది ఒక కూటమి. ఈ కూటమికి వ్యతిరేకంగా నాజీ, ఫాసిస్టు దేశాల జర్మనీ, ఇటలీ, జపాన్ కూటమి నిలిచింది). బ్రిటిష్ పాలకుల వైఖరిలో మార్పు వస్తుందని, భారత దేశానికి స్వాతంత్ర్యం లభిస్తుందని భావించినవారికి ఆశాభంగం తప్పలేదు. వినాశ కాలానికి విపరీత బుద్ధి అంటారు. బ్రిటన్ తన విపరీత బుద్ధిని ప్రదర్శించింది. భారత స్వాతంత్ర్యానికి సూత్రప్రాయంగా అంగీకరిస్తే రెండవ ప్రపంచయుద్ధంలో తమ సహకారం బ్రిటన్‌కు లభిస్తుందని భారత జాతీయ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ చేసిన తీర్మానాన్ని బిటిష్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ తిరస్కరించాడు. 1941 నాటికి జర్మనీ అధినేత హిట్లర్ నాయకత్వంలో ఫాసిస్టు, నాజీ శక్తులు హఠాత్తుగా విజృంభించి ఫ్రాన్స్ తదితర యూరప్ దేశాలను ఆక్రమించాయి. అటు జపాన్ యూఎస్ఏలోని పెర్ల్ హార్బర్‌ను బాంబుల వర్షంతో ధ్వంసం చేసి ఇటు బర్మా వరకు చొచ్చుకువచ్చింది. ప్రపంచయుద్ధంలో ఫాసిస్టు, నాజీ శక్తుల విజృంభణను చూసి ఆందోళన చెందిన అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్, అప్పటి చైనా అధ్యక్షుడు చాంగ్‌కైషేక్, కొందరు బ్రిటన్ లేబర్ పార్టీ నాయకులు బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ మీద ఒత్తిడి తెచ్చారు. భారత జాతీయ కాంగ్రెస్‌తో రాజీపడి ప్రపంచ యుద్ధంలో ఫాసిస్టు దేశాలకు వ్యతిరేకంగా భారతదేశం సహకారం పొందాలని, ఈ ఒత్తిడిని తట్టుకోలేక ప్రధాని చర్చిల్ భారతదేశం పంపిన స్టాఫర్డ్‌క్రిప్స్ కేబినెట్ మిషన్ తన ప్రయత్నాల్లో విఫలమైంది. క్రిప్స్ ప్రతిపాదించిన డొమినియన్ స్థాయికి భారత జాతీయ కాంగ్రెస్ అంగీకరించలేదు. ఆ క్లిష్ట పరిస్థితిలో 1942 జూన్ ప్రారంభంలో ప్రఖ్యాత పాత్రికేయుడు, రచయిత లూయిస్ ఫిషర్ జరిపిన ఒక ఇంటర్వ్యూలో గాంధీజీ అన్నారు-"I have become impatient.."

1917 నుంచి 25 ఏండ్లు ఉద్యమాలు నిర్వహించిన గాంధీజీ ఓరిమిని కోల్పోవడంలో ఆశ్చర్యం లేదు. గాంధీజీ ఇక అంతిమ సమరానికి నడుం బిగించి 'క్విట్ ఇండియా' పిలుపు ఇవ్వడానికి చొరవ తీసుకొని నడుం బిగించారు. 1942 జూలై 14న వార్ధాలో సమావేశమై భారత జాతీయ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 'క్విట్ ఇండియా' తీర్మానాన్ని ఆమోదించింది.

1917 నుంచి 25 ఏండ్లు ఉద్యమాలు నిర్వహించిన గాంధీజీ ఓరిమిని కోల్పోవడంలో ఆశ్చర్యం లేదు. గాంధీజీ ఇక అంతిమ సమరానికి నడుం బిగించి 'క్విట్ ఇండియా' పిలుపు ఇవ్వడానికి చొరవ తీసుకొని నడుం బిగించారు. 1942 జూలై 14న వార్ధాలో సమావేశమై భారత జాతీయ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 'క్విట్ ఇండియా' తీర్మానాన్ని ఆమోదించింది. ఏఐసీసీ 1942 ఆగస్టు 8 అర్ధరాత్రి బొంబైలో సమావేశమై ఈ తీర్మానాన్ని ఆమోదించింది వేలాది ప్రజల హర్షధ్వానాల మధ్య. బొంబై సమావేశంలో గాంధీజీ తమ చరిత్రాత్మక ప్రసంగంలో ఇచ్చిన ఈ పిలుపు మహత్తరమైనది... "...NOTHING LESS THAN FREEDO-M...I give you a MANTRA-DO OR DIE...".ఈరోజు గాంధీజీ లేరు. ఆయన సిద్ధాంతాలను అసహన జ్వాలల్లో ఆహుతి చేయడానికి కుట్రలు జరుగుతున్నాయి.

తెలంగాణ తెహజీబ్‌ను కాపాడుకుందాం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా పరాయి పెత్తందారులు అనేకరీతుల్లో ఇక్కడి సమాజాన్ని, ఆర్థికవ్యవస్థను, పరిపాలనను ఛిన్నాభిన్నం చేయడానికి ఎత్తుగడలు పన్నిన విషయం తెలిసిందే. ఆరు దశాబ్దాలకు పైగా పరాయి పాలనలో విధ్వంసానికి గురైన తెలంగాణ సమాజం అతివేగంగా కోలుకోవాలంటే రాజకీయ, సామాజికాది శక్తులన్నీ ఏకతాటిపై నడువాలె. తమ భవిష్యత్తు పట్ల స్పష్టత కలిగి ఉండాలె. తెలంగాణ అవతరించిన తర్వాత కూడా మన సమాజానికి అండగా ఉంటూ, మార్గదర్శకంగా వ్యవహరించే ఒక సంస్థ అవసరం ఏర్పడ్డది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల పాటు పోరాడిన ఉద్యమకారులు ఏర్పాటుచేసిందే తెలంగాణ వికాస సమితి (టీవీఎస్). తెలంగాణ వికాస సమితి ఏర్పడిన వెంటనే అతివేగంగా కార్యరంగంలోకి దిగి రాష్ట్ర ప్రయోజనాల కోసం ముందుండి పోరాడింది. తెలంగాణను అస్థిరత్వం పాలు చేయతలపెట్టిన పరాయిశక్తులను ఎండగడుతూ ప్రజలను జాగృతం చేసింది. రాష్ట్ర విభజన చట్టంలో ఆంధ్రా ఆధిపత్యశక్తులు పెట్టించిన నిబంధనల మూలంగా అనేక సమస్యలు తలెత్తాయి. గవర్నర్‌కు అధికారాలు, ఏపీ హైదరాబాద్‌ను పదేండ్ల పాటు రాజధానిగా వాడుకోవడం, తొమ్మిదవ, పదవ షెడ్యూలు విభజన మొదలైన అంశాలను ఆసరాగా చేసుకొని శాశ్వతంగా ఇక్కడే తిష్టవేసి, విభజనను ఆచరణలో నిర్వీర్యం చేయాలనే కుట్ర సాగింది. ఇటువంటి కీలక సందర్భంలో తెలంగాణ పరిరక్షణ కోసం టీవీఎస్ చొరవచూపింది. తెలంగాణకు న్యాయంగా ద

ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లోని కుమ్రంభీం విగ్రహానికి తిలకం దిద్దుతున్న ఆయన మనుమడు సోనెరావ్

ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలో గిరిజన మహిళల గుస్సాడి నృత్య ప్రదర్శన

శ్రావణ శుక్రవారం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలు కిటకిటలాడాయి. వరంగల్ ఎంజీఎం సెంటర్‌లోని శ్రీరాజరాజేశ్వర దేవాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలు. - న్యూశాయంపేట

ఆదివాసీలకు అండగా ఉంటాం

సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఆధునీకరించిన గిరిజన మ్యూజియం ప్రారంభం

హైదరాబాద్, నమస్తేతెలంగాణ/అహ్మద్‌నగర్:

ఆదివాసీలు సమాజంలోని మిగిలిన వర్గాలతో సమానంగా ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గిరిజనుల సాంస్కృతిక వారసత్వాన్ని, జానపదాన్ని పరిరక్షించి.. భవిష్యత్తు తరాలకు అందించేలా చర్యలు చేపట్టిందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్‌లోగల గిరిజన సంక్షేమ భవన్‌లో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ఎమ్మెల్సీ ఎమ్మెస్ ప్రభాకర్‌రావుతోకలిసి మంత్రి కొప్పుల ట్రైబల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు శంకుస్థాపన చేశారు. ఇటీవల ఆధునీకరించిన గిరిజన మ్యూజియాన్ని ప్రారంభించారు. స్వయం ఉపాధి కల్పనలో భాగంగా అర్హులైన గిరిజన యువతకు చెక్కులు పంపిణీ చేశారు. పలు సంస్థల సౌజన్యంతో ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ట్యాబ్‌లు, షూస్, రిస్ట్‌వాచీలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల మాట్లాడుతూ.. నీతి, నిజాయితీ, అత్యంత సామర్థ్యం కలిగిన ఆదివాసీల జీవన విధానం సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నదన్నారు. ప్రకృతికి హానిచేయకుండా ప్రకృతితో సహజీవనం సాగించడం వారి ప్రత్యేకత అని కొనియాడారు. అడవి బిడ్డల అభ్యున్నతికి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని, ఆదివాసీల జీవన ప్రమాణాలను పెంచేందుకు కృషిచేస్తున్నదని వివరించారు. రాష్ట్రంలో 2.30 లక్షల మంది గిరిజన విద్యార్థులు ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకులాలు, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లలో చదువుకొంటున్నారని, వీరికి గిరిబాల ఆరోగ్యరక్షా పథకం పేరుతో అన్నిరకాల ఆరోగ్యపరీక్షలు చేస్తున్నట్టు చెప్పారు. గిరిజనులపై అభిమానంతో సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా 22 ఎస్టీ గురుకుల డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు అనుమతించారని, అడవిబిడ్డల కండ్లల్లో ఆనందం నింపేందుకు తపిస్తున్నారని పేర్కొన్నారు.

నిర్మల్‌లో ఆదివాసీలు నిర్వహించిన ర్యాలీలో నెమలి పింఛం ధరించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్‌లో నిర్వహించిన వేడుకలో నెమలి పింఛం ధరించిన మంత్రి కొప్పుల. చిత్రంలో ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు

రూ.15 కోట్లతో మ్యూజియం

తెలంగాణ ఏర్పడిన తర్వాత గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యం కల్పించామని, రానున్న మేడారం జాతరకు రూ.110 కోట్లకుపైగా ఖర్చు చేయనున్నట్టు మంత్రి కొప్పుల వెల్లడించారు. గోండువీరుడు రంజిగోండు స్మృతి మ్యూజియాన్ని రూ.15 కోట్లతో నిర్మించనున్నట్టు చెప్పారు. ఐదొందల కుపైగా జనాభా కలిగిన ఆవాసాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించడం ద్వారా 2,458 మంది ఎస్టీలు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారని చెప్పారు. 250 జనాభా దాటిన తండాలు, గూడేలకు బీటీరోడ్డు సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. ఔత్సాహిక గిరిజన యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సీఎం కేసీఆర్ ఎస్టీ పారిశ్రామిక పథకం కింద ఒక్కో లబ్ధిదారుకు రూ.కోటికిపైగా విలువైన యూనిట్లను మంజూరు చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మహేశ్‌దత్ ఎక్కా, గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ క్రిస్టినా జెడ్ చాంగ్తూ, ఏడీ సర్వేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్లు ద్యావనపల్లి సత్యనారాయణ, నవీన్‌నికోలస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు, మహిళలు ఆదివాసీ వేషధారణలతో ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి.

హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్ ఆవరణలో ప్రారంభించిన మ్యూజియంలో ఏర్పాటు చేసిన కళాకృతులు

శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో అభివాదం చేస్తున్న మంత్రులు కొప్పుల ఈశ్వర్, ఈటల రాజేందర్, శ్రీనివాస్‌గౌడ్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, మాజీ ఎంపీ సీతారాంనాయక్ తదితరులు

ఉత్సాహంగా వేడుకలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. ఆయా జిల్లాల్లో నిర్వహించిన వేడుకల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ సంస్కృతీ వైభవాన్ని చాటుతూ నిర్వహించిన ర్యాలీలు, ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, మాజీ ఎంపీ సీతారాంనాయక్ పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అటవీ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొని రాంజీ గోండు విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం నెమలి పింఛం ధరించి ఆదివాసీలతో కలిసి గుస్సాడి నృత్యం చేశారు. ఈ సందర్భంగా మంత్రి అల్లోల మాట్లాడుతూ.. కుమ్రంభీం జన్మస్థలం వద్ద రూ.25 కోట్లతో స్మారక స్తూపంతోపాటు మ్యూజియాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ అంబేద్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని కుమ్రంభీం ప్రాంగణంలోని కుమ్రంభీం విగ్రహానికి ఐటీడీఏ పీవో కృష్ణ ఆదిత్య నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యేలు జోగు రామన్న, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, డీడీసీ చైర్మన్ లోక భూమారెడ్డి, కలెక్టర్ దివ్య, ఎస్పీ విష్ణు వారియర్ పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు.. కుమ్రంభీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దమ్మపేటలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు నివాళులర్పించారు. లక్ష్మీదేవిపల్లిలో ఆదివాసీలు ర్యాలీ నిర్వహించారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీ చైర్పర్సన్ కోవలక్ష్మి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఎస్పీ మల్లారెడ్డి, జైనూర్‌లో ఎంపీ సోయం బాబురావు పాల్గొన్నారు. జైనూర్ ప్రధాన చౌరస్తాలో కుమ్రం భీం విగ్రహం వద్ద కుమ్రంభీం మనుమడుకుమ్ర సోనెరావ్ జెండా ఆవిష్కరించారు.

కన్న కొడుకుని కడతేర్చాడు

- పిన్నిస్‌తో గుచ్చి, గొంతు నులిమి హత్య
- పోలీసుల అదుపులో సైకో తండ్రి

శాలిగౌరారం : కొడుకు కాలికి ముల్లు గుచ్చుకుంటేనే తండ్రి హృదయం తల్లడిల్లిపోతుంది.. కానీ, ఓ కసాయి తండ్రి తన నాలుగేండ్ల కొడుకుని అతి కిరాతకంగా హతమార్చాడు. మెడపై పిన్నీసుతో గుచ్చి, నోటితో కొరికి గొంతునులిమి చంపిన ఘటన శుక్రవారం నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం తిర్మలరాయునిగూడెంలో వెలుగు చూసింది. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడేనికి చెందిన చింతల కనకయ్య అదే ప్రాంతానికి చెందిన స్వప్నను కొన్నేండ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి కూతురు(6), అక్షయ్(4) కుమారుడున్నారు. భర్తతో విభేదాల కారణంగా రెండు నెలల కింద స్వప్న కూతురుతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లింది. అక్షయ్‌ను బలవంతంగా తన వద్దే ఉంచుకున్న కనకయ్య నెలరోజుల కింద తిర్మలరాయినిగూడేనికి చెందిన పెద్దనాన్న చింతల రాములు వద్దకి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. గురువారం గ్రామంలో బోనాలు కావడంతో మద్యం తాగివచ్చాడు.అర్ధరాత్రి సమయంలో కొడుకుని గొంతు నులిమి, పిన్నిసుతో గుచ్చి, నోటితో కొరికి అతి కిరాతకంగా హతమార్చి పరారయ్యాడు. తెల్లవారుజామున నిద్రలేచిన రాములుకు కనకయ్య కన్పించకపోవడం, ఎంతపిలిచినా బాలుడు మాట్లడకపోవడంతో మంచం దగ్గరికి వెళ్లి దుప్పటి తీయగా అక్షయ్ నిర్జీవంగా పడి ఉన్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని పరిశీలించారు. నిందితుడిని నకిరేకల్‌లో అదుపులోకి తీసుకున్నారు.

పోకిరీపై 22 మంది మహిళల ఫిర్యాదు

మంథని, నమస్తే తెలంగాణ: తమను వేధిస్తున్న పోకిరీపై చర్యలు తీసుకోవాలని 22 మంది మహిళలు పోలీసులను ఆశ్రయించారు. పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపాల్టీ పరిధిలోని కూచిరాజ్‌పల్లికి చెందిన నక్క వివేక్ నిత్యం తమను వేధిస్తున్నాడనీ, స్నానాలు చేస్తుంటే సెల్‌ఫోన్‌లో చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నాడంటూ అదే గ్రామానికి చెందిన 22 మంది స్త్రీలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సైకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గణితంలో మనమే టాప్

- అంతరిక్ష పరిశోధనలకూ గణితమే ప్రధానం
- విద్యాశాఖమంత్రి జగదీశ్‌రెడ్డి
- గీతం వర్సిటీలో అంతర్జాతీయ గణిత సదస్సు ప్రారంభం

పటాన్‌చెరు, నమస్తే తెలంగాణ: గణితంలో భారతీయులే అగ్రగణ్యులని విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారం పరిధిలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లో గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న మేథమెటికల్ సైన్సెస్ అండ్ అప్లికేషన్స్‌పై మూడురోజుల అంతర్జాతీయ సదస్సును శుక్రవారం మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. భిక్షగాడి నుంచి బిర్లాల వరకు నిత్యం లెక్కలపైనే ఆధారపడి ఉండాల్సి ఉంటుందన్నారు. రైతు మొదలుకొని అంతరిక్షంలో పరిశోధకులకు సైతం గణితం తప్పనిసరి అన్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చేందుకు లెక్కలే పెద్ద దిక్కన్నారు. ప్రపంచంలోని గణితశాస్త్ర మేధావులంతా భారతీయులేనని గుర్తు చేశారు. ఈ ఒరవడిని ముందు తరాలకు అందజేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. గణితంపై అంతర్జాతీయ సదస్సులను నిర్వహిస్తున్న గీతం విద్యాసంస్థను అభినందించారు. అధ్యాపకులు గణితశాస్త్ర ఔన్నత్యాన్ని పెంచి, దాని ఫలాలను ప్రజలకు పంచాలని కోరారు. గీతం విద్యాలయాల సంస్థ అధ్యక్షుడు శ్రీభరత్ మాట్లాడుతూ గణిత శాస్త్రంతోనే అన్ని రంగాలు ముడిపడి ఉన్నాయన్నారు. నిరంతర పరిశోధనలతోనే మానవ ప్రపంచానికి కొత్త పరిష్కారాలు లభిస్తాయన్నారు. మనకు ఇంటర్‌లో బోధించే గణితం అమెరికా వంటి దేశాల్లో ఇంజినీరింగ్ మూడో ఏడాదిలో ఉంటుందన్నారు. గీతం విద్యా సంస్థలో విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలకే పెద్దపీట వేస్తామన్నారు. అనంతరం మంత్రి జగదీశ్‌రెడ్డి సదస్సు ప్రత్యేక సంచికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మేథమెటికల్ సొసైటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్ ఆర్ముగం, గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్ శివప్రసాద్, ఆంధ్రా-తెలంగాణ మేథమెటికల్ సొసైటీ అధ్యక్షుడు కేశవరెడ్డి, అమెరికా నుంచి వచ్చిన తెలుగు శాస్త్రవేత్త జేర్మయ్య, కే బిల్లా, సదస్సు నిర్వాహక కార్యదర్శులు డాక్టర్ శివారెడ్డి శేరీ, డాక్టర్ పీ నరసింహస్వామి, కోశాధికారి డీ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గీతం యూనివర్సిటీ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద మంత్రి జగదీశ్‌రెడ్డితో అధ్యాపకులు

మూడ్రోజుల్లో వానలు

- 12న మరో అల్పపీడన సూచన
- తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు
- వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: వచ్చే మూడ్రోజుల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నది. పశ్చిమ, మధ్యప్రదేశ్, దాని పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న వాయుగుండం శుక్రవారం ఉదయం 8.30 గంటలకు మధ్యప్రదేశ్ ఉత్తర దిశగా 60 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. రాగల 24 గంటల్లో ఇది పశ్చిమ వాయవ్య దిశగా పయనించి క్రమంగా బలహీనపడి తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశమున్నదని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. వాయవ్య బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో ఈనెల 12న అల్పపీడనం ఏర్పడవచ్చన్నారు. రాగల మూడ్రోజుల్లో తెలంగాణలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నట్టు వారు పేర్కొన్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో..

హైదరాబాద్ సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్‌లో రాగల 36గంటల్లో అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురిసే అవకాశమున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులు. (ఇన్‌సెట్లో) ఎంపికైన అభ్యర్థికి నియామక పత్రం అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఒకేసారి 1,542 మందికి ఉద్యోగాలు

సూర్యాపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ : సూర్యాపేట ఇంటర్‌విద్య ఎస్ఐవీఈ, మెప్మా ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఉమ్మడి జిల్లాకు చెందిన 1,542 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు దక్కాయి. 3,529 మంది హాజరవ్వగా, 1,542 మంది నేరుగా ఉద్యోగాలు దక్కాయి. 1,200 మందికి ఆయా కంపెనీలు శిక్షణనివ్వనున్నట్టు తెలిపాయి. మంత్రి జగదీశ్‌రెడ్డి చొరవతోనే జాబ్‌మేళా నిర్వహించారని కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. ఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐవీఈ ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు, మెప్మా పీడీ రామానుజుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో గంజాయి ప్యాకెట్లను చూపిస్తున్న రైల్వే పోలీసులు

రూ.4.80 లక్షల గంజాయి పట్టివేత

కాజీపేట: కాజీపేట రైల్వే జంక్షన్‌లో ఆర్పీఎఫ్ పోలీసులు శుక్రవారం రూ.4.80 లక్షల విలువైన గంజాయి పట్టుకొన్నారు. దక్షిణ మధ్య రైల్వే ఆర్పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ రామ్మూర్తి వివరాల ప్రకారం.. ఆర్పీఎఫ్ ఎస్సై శైలజ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై ఎస్కలేటర్ వద్ద నాలుగు బ్యాగులతో ఓ మహిళ కనిపించింది. ఆర్పీఎఫ్ సిబ్బంది ఆ బ్యాగులను తనిఖీ చేయగా అందులో 2 కిలోల బరువున్న 24 బండిళ్లలో 48 కిలోల గంజాయి దొరికింది. మహారాష్ట్రకు చెందిన జోహార (36)ను అదుపులోకి తీసుకున్నారు. ఏపీలోని తుని రైల్వేస్టేషన్ సమీపంలో ఆది అనే వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి ముంబయికి తీసుకెళ్తోందని ఆయన వివరించారు.

దైవదర్శనానికి వెళ్తూ.. అనంత లోకాలకు

- ప్రకాశం జిల్లాలో రోడ్డుప్రమాదం
- ఆరుగురు కరీంనగర్ వాసుల దుర్మరణం
- మృతులంతా ఒకే కుటుంబం వారు
- ఖమ్మం జిల్లాలో మరో ఇద్దరు మృతి

కరీంనగర్ క్రైం/సత్తుపల్లిరూరల్:

దైవదర్శనానికి వెళ్తున్న ఓ కుటుంబం రోడ్డు ప్రమాదానికి బలైంది. ఏపీలోని ప్రకాశం జిల్లా గుడ్లూరు మండలం ముచ్చర్ల వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన కొంపెల్లి మలహల్‌రావు, అతని భార్యతోపాటు కూతురు, అల్లుడు, ఇద్దరు మనుమండ్లు దుర్మరణం చెందారు. కరీంనగరం భాగ్యనగర్‌కు చెందిన మలహల్‌రావు న్యాయశాఖలో అకౌంట్స్ ఆఫీసర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆయన తన కూతురు అర్చన, అల్లుడు వంశీకృష్ణ, మనుమండ్లు అద్వైత్, కృశాంత్‌తో తిరుపతికి వెళ్లేందుకు మలహల్‌రావు రైలు టికెట్లు బుక్ చేసుకున్నారు. చివరి నిమిషంలో రైలు ప్రయాణం మానుకుని కారులో బయలుదేరారు. శుక్రవారం విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకొన్న అనంతరం తిరుపతికి బయలుదేరారు. ప్రకాశం జిల్లా గుడ్లూరు మండలం ముచ్చర్ల వద్ద ఆగి ఉన్న లారీని వీరి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్‌హల్‌రావు, అతని భార్య లీల, కూతురు అర్చన, అల్లుడు వంశీతోపాటు మనుమడు కృశాంత్ ఘటన స్థలంలోనే మరణించగా, మరో మనుమడు అద్వైత్ దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. మలహల్‌రావు కొడుకు అనుదీప్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నట్టు తెలిసింది. శనివారం సాయంత్రానికి మృతదేహాలు కరీంనగర్‌కు వచ్చే అవకాశమున్నట్టు బంధువులు తెలిపారు.

మృతులు అర్చన, వంశీకృష్ణ, కృశాంత్, అద్వైత్ (ఫైల్)

లారీ-ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు..

సత్తుపల్లిరూరల్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సత్తుపల్లి పట్టణంలో కుమ్రం భీం విగ్రహావిష్కరణకు వెళ్తున్న గిరిజనుల కుటుంబాల్లో రోడ్డు ప్రమాదం విషాదం నింపింది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రామగోవిందాపురం గ్రామానికి చెందిన 32 మంది ట్రాక్టర్‌లో సత్తుపల్లి కార్యక్రమానికి బయలుదేరారు. బేతుపల్లి దాటిన తర్వాత ముందు వెళ్తున్న ఆటోను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఓ కంటెయినర్ లారీ ఢీకొట్టింది. ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడటంతో అందులోని 32 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సరియం వెంకటేశ్వరరావు(42), కణితి లక్ష్మణరావు(52) మృతిచెందారు. ఖమ్మం కిమ్స్‌లో చికిత్స పొందుతున్న తాటి సుకన్య, సిద్దిని గంగులు, వాసం కాంతమ్మ, అచ్చమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. లారీని వీఎం బంజర్ పోలీసులు పెనుబల్లి మండలంలో పట్టుకున్నారు. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సత్తుపల్లి ప్రభుత్వ దవాఖానకు చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు.

తండ్రిని పట్టించుకోని కొడుకుపై చర్యలు

సూర్యాపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ : తండ్రికి మెడికల్, ఇతరత్రా ఖర్చుల నిమిత్తం డబ్బులు ఇవ్వకుండా పట్టించుకోని ఓ కుమారుడిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ చైర్మన్, సూర్యాపేట ఆర్డీవో మోహన్‌రావు పోలీసులను ఆదేశించారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం మిడ్తనపల్లికి చెందిన పాశం సత్తిరెడ్డికి రాజిరెడ్డి, వెంకట్‌రెడ్డి అనే ఇద్దరు కుమారులున్నారు. ఆయనకు ఉన్న భూమిలో చెరి సగం పంచి ఇవ్వగా, వారు తండ్రిని పట్టించుకోవడం మరిచారు. దీంతో సత్తిరెడ్డి వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ చైర్మన్,ఆర్డీవో మోహన్‌రావుకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేసిన ఆర్డీవో ఇద్దరు కుమారులు చెరో రూ.2 లక్షల చొప్పున సత్తిరెడ్డికి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. రాజిరెడ్డి తన తండ్రికి రూ.2 లక్షలు ఇవ్వగా, మరో కొడుకు వెంకట్‌రెడ్డి డబ్బులు ఇవ్వలేదు. దీంతో గత జూన్ 29న బాధితుడు మళ్లీ ఫిర్యాదు చేశాడు. దీంతో వెంకట్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో పోలీసులను ఆదేశించారు. వెంటనే సత్తిరెడ్డికి డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే అరెస్టు చేసి జైలుకు పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



వైద్య శిబిరంలో పరీక్షల తీరును తెలుసుకుంటున్న డాక్టర్ కేఎన్‌రావు

చింతమడకలో కొనసాగుతున్న వైద్యశిబిరం

సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ : సిద్దిపేట జిల్లా చింతమడకలో ఉచిత వైద్య శిబిరం కొనసాగుతున్నది. ఐదో రోజు శుక్రవారం 664 మందికి వైద్యులు పరీక్షలు చేశారు. వైద్యశిబిరాన్ని యశోద హాస్పిటల్ ల్యాబ్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ కల్నాల్ కేఎన్‌రావు సందర్శించారు. యశోద గ్రూప్స్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఎంహెచ్‌వో అమర్‌సింగ్, గడా వైద్యాధికారి, వైద్య శిబిర ఇన్‌చార్జి డాక్టర్ కాశీనాథ్ పర్యవేక్షిస్తున్నారు.

epaper.ntnews.com

భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నీటమునిగి స్నానఘట్టాలు

భద్రాచంలో వరద పోటెత్తడంతో నీట మునిగిన ఆలయ పరిసర ప్రాంతాలు

జగిత్యాల జిల్లా ధర్మపురి వద్ద గోదావరిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

మోడల్ స్కూళ్లకు గిరాకీ

- ఏటేటా పెరుగుతున్న ప్రవేశాలు
- పోటీపడుతున్న ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ మోడల్‌స్కూళ్ల సొసైటీ ఆధ్వర్యంలోని పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో ప్రతి ఏటా ప్రవేశాల సంఖ్య పెరుగుతున్నది. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కూడా మోడల్‌స్కూళ్లలో ప్రవేశాలు పొందేందుకు పోటీపడుతుండటం విశేషం. 2015-16 విద్యా సంవత్సరంలో 69,233 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందగా.. 2018-19లో ఈ సంఖ్య 95,242కు పెరిగింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జూన్ 30 నాటికి 91,635 ప్రవేశాలు నమోదయ్యాయి. ఈ ఏడాది అడ్మిషన్ల ప్రక్రియ ముగిసే సమయానికి వీటి సంఖ్య 96వేలు దాటే అవకాశం ఉన్నదని మోడల్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ ఏ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్ని రకాల గురుకుల విద్యాసంస్థల్లో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతున్నదని, ఈ ప్రక్రియ ముగియడానికి మరో నెల వరకు గడువు ఉన్నదని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 27 జిల్లాల్లో 194 మోడల్‌స్కూళ్లు కొనసాగుతున్నాయి.

ప్రైవేట్ నుంచి పెరుగుతున్న వలసలు

ఐదేండ్ల నుంచి తెలంగాణ మోడల్‌స్కూళ్లలో ప్రవేశాలు పొందడానికి గ్రామీణ విద్యార్థులు పోటీపడుతున్నారు. అక్కడ సీట్లు పొందడం కోసం స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి కూడా సిఫారసు లేఖలు మోడల్‌స్కూళ్ల సొసైటీకీ అందుతున్నాయి. మోడల్‌స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్యాను బోధిస్తున్నారు. బాలికల కోసం ప్రతి మోడల్ స్కూల్‌లో హాస్టల్ సదుపాయం ఏర్పాటుచేశారు. ఒకేషనల్ విద్యను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫారాలు అందజేస్తున్నారు. బాలురకు, హాస్టళ్లలో లేని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలుచేస్తున్నారు. మోడల్‌స్కూళ్ల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 210 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారు.

జూనియర్ కాలేజీలకు మంచి స్పందన

పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో కొనసాగుతున్న మోడల్ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలు పొందడానికి ఇంగ్లిష్ మీడియం విద్యార్థుల నుంచి మంచి స్పందన వస్తున్నది. పదో తరగతి వరకు ప్రైవేట్‌స్కూళ్లలో చదివిన ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు కూడా ఈ కాలేజీల్లో ప్రవేశాలు పొందడానికి దరఖాస్తు చేస్తున్నట్టు సొసైటీ డైరెక్టర్ తెలిపారు. మోడల్ కాలేజీల్లో జేఈఈ, ఎంసెట్‌తోపాటు నీట్ పరీక్షల కోసం కూడా ప్రత్యేకంగా కోచింగ్ ఇస్తున్నారు. ఈ కాలేజీల్లో 2015-16 విద్యా సంవత్సరంలో 83,130 ప్రవేశాలు నమోదు కాగా.. 2019-20 జూన్ 2వ తేదీ వరకు 1,25,893 ప్రవేశాలు నమోదయ్యాయి. ప్రవేశాలకు మరో నెల రోజుల సమయం ఉండటంతో ఈ సంఖ్య 1.29 లక్షలకు చేరుకునే అవకాశం ఉన్నదని అధికారులు భావిస్తున్నారు. మొత్తం మోడల్ స్కూళ్లలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో కలిపి బాలురు కంటే బాలికల ప్రవేశాలే అధికంగా నమోదయ్యాయి. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు బాలురు 56,598 మంది, బాలికలు 69,295 మంది ప్రవేశాలు పొందారు.

మోడల్ స్కూళ్లు, కాలేజీల్లో గత ఐదేండ్లలో నమోదైన ప్రవేశాల వివరాలు

విద్యా సంవత్సరం	6 నుంచి 10వ తరగతి వరకు	ఇంటర్మీడియట్	మొత్తం
2015-16	69,233	13,897	83,130
2016-17	83,645	21,369	1,05,014
2017-18	91,919	33,711	1,25,630
2018-19	95,242	32,849	1,28,091
2019-20	91,635	34,258	1,25,893 (జూన్ 30 వరకు)

ఎస్సైల శిక్షణకు సర్వం సిద్ధం!

- ఈ నెలాఖరున ప్రారంభించే అవకాశం
- 'నమస్తే తెలంగాణ'తో తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ సంతోష్‌మెహ్రా



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: త్వరలో ప్రారంభం కానున్న ఎస్సైల శిక్షణకు రాష్ట్ర పోలీస్‌అకాడమీ సిద్ధమవుతున్నది. ఇప్పటికే టీవోటీ (ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్) పూర్తయింది. సబ్‌ఇన్‌స్పెక్టర్ తత్సమాన ర్యాంకులు కలిపి మొత్తం 1210 మంది ట్రైనీలకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్, అడిషనల్ డీజీ సంతోష్‌మెహ్రా తెలిపారు. ఎస్సైల శిక్షణకు సంబంధించి పలుఅంశాలను ఆయన 'నమస్తే తెలంగాణ'తో పంచుకున్నారు. ఎస్సైల ఎంపిక ప్రక్రియ పూర్తికావస్తుండడంతో ఆగస్టు చివరి వారం నుంచి శిక్షణ ప్రారంభిస్తామని చెప్పారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి

710 మంది సివిల్ ఎస్సైలు, 280 మంది ఏఆర్ (ఆర్మ్‌డ్ రిజర్వ్) ఎస్సైలు, 191 మంది టీఎస్ఎస్పీ ఆర్ఎస్సైలు, 29 మంది కమ్యూనికేషన్ ఎస్సైలకు శిక్షణ ఇవ్వనున్నారు. విధుల్లో అన్నిరకాల పరిస్థితులను ఎదుర్కొని.. శాంతిభద్రతలను పరిరక్షించేందుకు అవసరమైన తర్ఫీదు ఇచ్చేలా సిలబస్ రూపొందించినట్టు సంతోష్‌మెహ్రా తెలిపారు. ఇండోర్ తరగతుల్లో అనుభవజ్ఞులైన పోలీస్ అధికారులతోపాటు, వివిధ అంశాల్లో నిపుణులతో శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఇండోర్ క్లాసుల నిర్వహణకోసం ఒక్కోబ్యాచ్‌కు 80 మంది చొప్పున మొత్తం 240 మంది ట్రైనర్లకు టీవోటీ పూర్తిచేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్న ఆడియో, విజువల్ పరికరాలు, ఎల్‌సీడీ ప్రొజెక్టర్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మహిళా ఎస్సైల కోసం ప్రత్యేకంగా జిమ్‌ను, డ్రెస్ చేంజింగ్ రూంలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతి మైదానం వద్ద రెండు చొప్పున ఒక్కోగదిని రూ.8 లక్షల ఖర్చుతో 8 గదులను నిర్మిస్తున్నట్టు తెలిపారు. అవుట్‌డోర్ శిక్షణలో భాగంగా ఆయుదాలవాడకం, క్షేత్రస్థాయి పరిస్థితులపై శిక్షణ ఇచ్చేందుకు 35 మంది అధికారులను ఎంపికచేసి మధ్యప్రదేశ్‌లోని నీముచ్‌లోని సీఆర్పీఎఫ్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పించినట్టు తెలిపారు. ఎస్సైలతోపాటు పోలీస్‌అకాడమీలో 523 మంది మహిళా కానిస్టేబుళ్లకు శిక్షణ ఇవ్వబోతున్నట్టు టీఎస్పీఏ డైరెక్టర్ సంతోష్‌మెహ్రా తెలిపారు.

పారుగు మైదానాల్లోనూ పోలీస్ శిక్షణ!

- పోలీస్‌శాఖలో18 వేలకుపైగా పోస్టుల భర్తీ
- రాష్ట్రంలో 11 వేల మందికే శిక్షణఇచ్చే సామర్థ్యం
- ఏఆర్, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లకు ఏపీసహా నాలుగు రాష్ట్రాల పోలీస్ కేంద్రాల్లో శిక్షణపై కసరత్తు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర పోలీస్‌శాఖలో ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియ దాదాపు పూర్తికావస్తుండటంతో అభ్యర్థుల శిక్షణపై ఉన్నతాధికారులు దృష్టిపెట్టారు. 1,217 ఎస్సై ఖాళీలు, 29 కమ్యూనికేషన్ ఎస్సై, 26 ఫింగర్‌ప్రింట్ బ్యూరో ఏఎస్సై, 16,925 పోలీస్ కానిస్టేబుల్, 231 టెక్నికల్ కానిస్టేబుల్ (కమ్యూనికేషన్, డ్రైవర్లు, మెకానిక్‌లు) ఇలా అన్ని విభాగాల్లో కలిపి 18 వేలకుపైగా పోస్టులు ఒకేసారి భర్తీ అవుతున్నాయి. కొత్తగా నియమితులయ్యేవారికి శిక్షణ ఇవ్వడానికి ఉన్న అవకాశాలపై కసరత్తు తుదిదశకు చేరుకుంది. సాధారణంగా ఎస్సై ఆపైస్థాయి ర్యాంకు అధికారులకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో శిక్షణ ఇస్తారు. ఇవి కాకుండా హైదరాబాద్, జిల్లాల పోలీస్ శిక్షణ కళాశాలల్లో ఇతర విభాగాల కానిస్టేబుళ్లకు ట్రైనింగ్ ఉంటుంది. తెలంగాణ పోలీస్ అకాడమీ, ఇతర పోలీస్ శిక్షణ కళాశాలల కలిపి మన రాష్ట్రంలో 11 వేల మందికి మాత్రమే శిక్షణ ఇచ్చే సామర్థ్యం ఉన్నది. మిగిలినవారికి ఇతర రాష్ట్రాల్లోని పోలీస్ అకాడమీలు, కేంద్ర బలగాలైన సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్ వంటి కేంద్రాల్లో అవకాశాన్ని బట్టి శిక్షణ ఇప్పించాలని పోలీస్ ఉన్నతాధికారులు యోచిస్తున్నారు.

మహిళా కానిస్టేబుళ్లకు ఇక్కడే శిక్షణ

పెద్దసంఖ్యలో ఉన్న కానిస్టేబుళ్ల శిక్షణకు సరిపడా మైదానాలు రాష్ట్రంలో లేకపోవడంతోనే సమస్య ఉత్పన్నమవుతున్నది. మన రాష్ట్ర పోలీస్ శిక్షణ కళాశాలల్లో సివిల్ కానిస్టేబుళ్లకు శిక్షణ ఇప్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు సమాచారం. మహిళా కానిస్టేబుళ్లకు ఇక్కడే శిక్షణ ఇచ్చేలా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఆ తర్వాత మిగిలి ఏఆర్, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లకు ఇతర రాష్ట్రాల పోలీస్ అకాడమీల్లో శిక్షణ ఇవ్వాలని యోచిస్తున్నట్టు తెలిసింది. ఏఆర్, టీఎస్ఎస్పీ విభాగాల కానిస్టేబుళ్ల శిక్షణలో ఎక్కువ భాగం ఔట్‌డోర్‌కే ప్రాధాన్యం ఉంటుంది కాబట్టి వారికి బయటి రాష్ట్రాల్లో శిక్షణ ఇచ్చిన ఫర్వాలేదన్న అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తంచేశారు. వారి అకాడమీల్లో వసతులు, సదుపాయాలు వాడుకుంటున్నందుకు అద్దె చెల్లిస్తామని తెలిపారు. ఔట్‌డోర్ శిక్షణలో ఆయా శిక్షణ కేంద్రాల్లో ట్రైనర్లే ఉంటారని, అవసరం మేరకు ఇన్‌డోర్ తరగతులకు మన ట్రైనర్లు అక్కడి వెళ్లేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిసింది. కానిస్టేబుల్ తుది ఫలితాలు అత్యంత త్వరలోనే విడుదలచేయనున్న నేపథ్యంలో పూర్తిస్తాయిలో శిక్షణ ఏర్పాట్లను అధికారులు ముమ్మరం చేసినట్టు సమాచారం.

జిల్లాల్లో కొత్త పోలీస్ భవనాలు

- రెండునెలల్లో ప్రారంభించేందుకు పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ కసరత్తు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్న జిల్లా పోలీస్ కార్యాలయాల (డీపీవో) నిర్మాణాలు తుదిదశకు చేరుకుంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 13 కొత్త డీపీవోలతోపాటు సిద్దిపేట, రామగుండం పోలీస్ కమిషనరేట్లకు భవనాలు నిర్మిస్తున్నారు. పనులు పూర్తికావచ్చిన భవనాలను త్వరలో ప్రారంభించేలా పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ ప్రణాళికలు రూపొందించింది. కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయ నిర్మాణం దాదాపు పూర్తికావచ్చింది. కుమ్రంభీం ఆసిఫాబాద్, జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జగిత్యా ల, మెదక్ జిల్లాల్లోనూ పోలీస్ కార్యాలయాల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. నిర్మల్ డీపీవోకు కూడా స్థలం కేటాయింపు పూర్తయిందని, పనులకు టెండర్లు పిలిచినట్టు పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ మల్లారెడ్డి తెలిపారు. జిల్లాల్లో అందుబాటులోని స్థలాన్ని బట్టి, జిల్లా పోలీస్ కార్యాలయ సముదాయాలను 20 నుంచి 30 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ కార్యాలయాలు, జిల్లా పోలీస్ విభాగం నిర్వహణ అధికారుల చాంబర్లు, ఏఆర్ హెడ్ క్వార్టర్లు, పరేడ్‌గ్రౌండ్, శిక్షణ తరగతులు, డిజిటల్‌ల్యాబ్‌లు, కాన్ఫరెన్స్‌హాళ్లు, సిబ్బందికి బ్యారెక్స్ నిర్మించనున్నారు. తొలివిడుతలో ఎస్పీ, అదనపు ఎస్పీ ల కార్యాలయాలు, పరేడ్‌గ్రౌండ్, ఎస్పీ రెసిడెన్స్‌లను నిర్మిస్తున్నట్టు మల్లారెడ్డి తెలిపారు.

తుదిదశకు చేరుకున్న కామారెడ్డి డీపీవో భవనం పనులు

దసరాకు కామారెడ్డి డీపీవో ప్రారంభం

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు 13 జిల్లాల్లో డీపీవోలు, రెండు కమిషనరేట్ల భవన నిర్మాణాలు త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కామారెడ్డి డీపీవో భవనం రెండునెలల్లో పూర్తవుతుంది. దసరాకు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా కామారెడ్డి డీపీవోను ప్రారంభించాలన్న లక్ష్యంతో ఉన్నాం.

-కోలేటి దామోదర్ గుప్తా, పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్

జలశక్తి అభియాన్ పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

జలశక్తి అభియాన్ పనుల పరిశీలన

మల్యాల: జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న జలశక్తి అభియాన్ పనులను కేంద్ర బృందం సభ్యుడు మనూచౌదరి శుక్రవారం పరిశీలించారు. మానాలలో నిర్మిస్తున్న పాంపాండ్, మద్దుట్ల, రామన్నపేట గ్రామాల్లో నిర్మిస్తున్న బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్ పనులను, హరితహారం పనులను పరిశీలించారు. అనంతరం మనూచౌదరి మాట్లాడుతూ.. జలశక్తి అభియాన్ పనులపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు పనుల ద్వారా కలిగేలబ్ధిపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. వర్షం నీటిని ఒడిసి పట్టుకోవడమే జలశక్తి అభియాన్‌లో ముఖ్యోద్దేశమని, తద్వారా భవిష్యత్తులో నీటి ఎద్దడిని నివారించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జగిత్యాల జిల్లాలోని మల్యాల, కొడిమ్యాల, మేడిపల్లి, కథలాపూర్ మండలాల్లో జలశక్తి అభియాన్ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్నదని, వీటి ఫలితాల పరిశీలన తర్వాత జిల్లావ్యాప్తంగా కార్యక్రమాన్ని విస్తరించే అవకాశం ఉన్నదని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్, ఈవోపీఆర్డీ జనార్దన్, ఏపీవో లోకేశ్వరి, ఈజీఎస్ ఈసీ మనోజ్, ఎంపీటీసీ సభ్యులు పోతాని రవి, సఫియావలీబేగం, సర్పంచులు గడ్డం జలజ, కెల్లేటి మల్లమ్మ పాల్గొన్నారు.

డీలర్ల వద్దే వాహన రిజిస్ట్రేషన్లు

- హైసెక్యూరిటీ నంబర్‌ప్లేటూ అక్కడే.. షోరూంలకు వెళ్లి ఎంవీఐల ధ్రువీకరణ
- రవాణావాహనాలు ఆర్టీఏల వద్దనే.. నూతన రవాణా చట్టంలో కేంద్రం మార్పులు
- జరిమానాలన్నీ కొనసాగింపు.. సెప్టెంబర్ నుంచి కొత్త చట్టం అమలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వాహనాలను కొనుగోలు చేసినచోటే రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా కల్పిస్తూ కేంద్ర కొత్త రవాణాచట్టంలో మార్పులు చేసింది. రవాణేతర వాహనాలకు డీలర్లే రిజిస్ట్రేషన్ చేసి.. హైసెక్యూరిటీ ప్లేట్లు బిగించనున్నారు. మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ షోరూం వద్దకు వచ్చి వాహనాన్ని తనిఖీ చేయాల్సి ఉంటుంది. సవరణల అనంతరం లోక్‌సభ, రాజ్యసభ ఆమోదంపొందిన కొత్త రవాణాచట్టాన్ని రాష్ట్రపతి వద్దకు పంపించారు. అక్కడ ఆమోదం పొందగానే.. సెప్టెంబర్ నుంచి ఈ చట్టాన్ని అమలుచేయనున్నట్టు కేంద్ర ప్రకటించింది. చట్ట సవరణలో భాగంగా రవాణేతర వాహనాల రిజిస్ట్రేషన్లపై పలుమార్పులు తీసుకొచ్చారు. ఈ వాహనాల రిజిస్ట్రేషన్లను షోరూంల వద్దే నిర్వహించనున్నారు. డీలర్లకు మొత్తం అధికారాలివ్వకుండా.. మోటరు వెహికిల్ ఇన్స్‌పెక్టర్లు (ఎంవీఐ)లను సైతం బాధ్యులను చేశారు. రవాణాశాఖ కార్యాలయాల వద్ద ఏజెంట్ల మోసాలు, అవినీతిని తగ్గించేందుకు, వినియోగదారులు కొత్తగా వాహనం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నది. వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను డీలర్లకు అప్పగించాలని కేంద్రం ఈ మేరకు రాష్ట్రాలకు ఆదేశాలు జారీచేసింది. సెప్టెంబర్ నుంచి వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లను డీలర్ల వద్దే ముగించి, నంబర్ ప్లేట్లు జారీ చేయాలని, అంతకుముందు ఎంవీఐల ధ్రువీకరణ చేయించాలని ఆదేశాలిచ్చింది.

నిబంధనలు పాటించని డీలర్లపై వేటే

కొత్త వాహనాల హై సెక్యూరిటీ నంబరు ప్లేటు (హెచ్ఎస్ఆర్పీ)ను డీలర్లే అమర్చాల్సి ఉంటుందని కొత్తచట్టంలో పేర్కొన్న కేంద్రం.. నిబంధనలను అతిక్రమిస్తే జరిమానాలు విధించనున్నట్టు హెచ్చరించింది. హెచ్ఎస్ఆర్పీ లేకుండా వాహనం బయటకు వస్తే.. వాహన జీవితకాల పన్ను రెండొందల శాతం లేదా త్రైమాసిక పన్నును లెక్కించి ఏది ఎక్కువ ఉంటే ఆ మొత్తాన్ని జరిమానా, నెలరోజుల పాటు రిజిస్ట్రేషన్లు చేయకుండా నిషేధం విధించనున్నారు. అదేతరహా తప్పు రెండోసారి చేస్తే.. డీలరు లైసెన్సును మూడునెలలపాటు సస్పెండ్ చేయడంతోపాటు రూ. 5 లక్షల జరిమానా విధిస్తారు. తప్పు అలాగే కొనసాగితే రిజిస్ట్రేషన్ లైసెన్సును రద్దుచేసి, డీలర్లపై కేసులు నమోదు చేసేలా చట్టంలో పేర్కొన్నారు. ఇక రిజిస్ట్రేషన్ల కోసం ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుకంటే ఎక్కువగా వసూలు చేస్తే రూ.2 లక్షల జరిమానాతోపాటు రెండునెలలు డీలర్‌షిప్‌ను రద్దు.. రెండోసారికి రూ.5 లక్షల జరిమానా, మూడు నెలలు డీలర్‌షిప్ రద్దు చేయనున్నారు. ఆ తర్వాత ఫిర్యాదులు వస్తే.. విచారించి రిజిస్ట్రేషన్ అవకాశాలను పూర్తిగా రద్దుచేస్తారు. అయితే ఫ్యాన్సీనంబర్లు కావాలనుకుంటే మాత్రం ఎలాంటి వాహనదారులైనా రవాణాశాఖ కార్యాలయాలకు వెళ్లాల్సిందే. రిజిస్ట్రేషన్ అథారిటీ ప్రకారం ట్రాన్స్‌పోర్టు వాహనాలైన బస్సులు, లారీలు, 10 సీట్లు దాటిన మినీ బస్సులు, ఆటోరిక్షాలు, క్యాబ్‌లు, నాన్‌ట్రాన్స్‌పోర్టు వాహనాలైన రోడ్డు రోలర్స్, రిగ్‌మౌంటెడ్ వెహికల్స్, నిర్మాణ సంబంధమైన వాహనాలు కార్యాలయాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించాలని నిర్ణయించారు. మరోవైపు నూతన చట్టం ప్రకారం జరిమానాలను సైతం ఖరారుచేశారు. నిబంధనలను కఠినతరం చేశారు. దీన్నికూడా వచ్చేనెల నుంచి అమల్లోకి తీసుకురానున్నారు.

నేరం	జరిమానా(రూ.లో), శిక్ష
మైనర్లు వాహనాలు నడిపితే	25 వేలు, సంరక్షకులు, వాహన యజమానులకు మూడేండ్లు జైలు, వాహన రిజిస్ట్రేషన్ రద్దు
లైసెన్స్‌లేకుండా నడిపితే	5 వేలు
అతివేగం	2 వేలు
ప్రమాదకరంగా నడిపితే	5 వేలు
మద్యం సేవించి నడిపితే	10 వేలు
హెల్మెట్ లేకుంటే	1000, మూడు నెలలు లైసెన్స్ రద్దు
వెనుకఉన్నవారికి హెల్మెట్ లేకుంటే	1000
ఇన్సూరెన్స్ చేయించకుంటే	2 వేలు
అంబులెన్స్‌కు దారి ఇవ్వకుంటే	10 వేలు
అనర్హులని తేల్చినా వాహనం నడిపితే	10 వేలు
రవాణా శాఖ ఆదేశాలు ఉల్లంఘిస్తే	2 వేలు
సీటు బెల్ట్ ధరించకుంటే	1000
ఓవర్ లోడింగ్ చేస్తే	20 వేలు, (అదనంగా ప్రతి టన్నుకు రూ. 2 వేలు)
ఓవర్ లోడ్ రవాణా వాహనాలు	ప్రతి ప్యాసింజర్‌కు రూ.వెయ్యి చొప్పున.
రేసింగ్‌లకు పాల్పడితే	5 వేలు
లైసెన్స్ లేకుండా క్యాబ్ సర్వీసులు నడిపితే	1 లక్ష

సిరిసిల్లలో హోంగార్డు ఇమ్రాన్ కుటుంబసభ్యులకు చెక్ అందజేస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

హోంగార్డుల సంక్షేమానికి ప్రత్యేక కృషి

ఎస్పీ రాహుల్ హెగ్డే

సిరిసిల్ల క్రైం: హోంగార్డుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే పేర్కొన్నారు. ఇటీవల మృతి చెందిన హోంగార్డు ఇమ్రాన్ కుటుంబానికి శుక్రవారం రూ.1.75 లక్షల చెక్‌ను ఎస్పీ అందజేశారు. తోటి హోంగార్డు కుటుంబానికి జిల్లాలోని హోంగార్డులు ఒకరోజు వేతనం స్వచ్ఛందంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం ఎస్పీ సైతం తన ఒకరోజు వేతనాన్ని అందజేశారు. ఇమ్రాన్ కుటుంబ సభ్యులు ఎస్పీతోపాటు హోంగార్డులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హోంగార్డు ఇన్‌చార్జి, ఆర్ఐ కుమారస్వామి, రవీందర్ హెడ్ కానిస్టేబుల్, బాసు, సత్యనారాయణ, రవీందర్, హోంగార్డులు ఉన్నారు.

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు
ధర్మగంట
నమస్తే తెలంగాణ, 8-2-603/1/7,8,9 రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.
Whatsapp No. 9346979997
dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.
స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.
/NTDAILYONLINE

దళితుడి భూమి ఆక్రమణ

- అమ్మేసి సొమ్ముచేసుకొన్న మాజీ సర్పంచ్
- స్పందించని జనగామ జిల్లా లింగాల ఘనపురం అధికారులు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన నెల్లుట్ల రైతు పసుల నర్సయ్య

జనగామ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం నెల్లుట్లకు చెందిన పసుల నర్సయ్య నిరుపేద దళితుడు. 1973 లో అప్పటి ప్రభుత్వం రిటైర్డ్ ఆర్మీ అధికారి మిలానీ షరీఫ్‌కు సర్వే నంబర్ 431లో ఐదెకరాల భూమిని కేటాయించింది. ఆయన నుంచి నర్సయ్య 2.20 ఎకరాలు కొన్నారు. అప్పట్లో కలెక్టర్ అతడికి బావి కూడా మంజూరుచేశారు. దీంతో నర్సయ్య ఆ భూమిలో బావిని తవ్వుకొని వ్యవసాయం చేసుకొంటూ కాస్తులో ఉన్నారు. తల్లిదండ్రులు మరణానంతరం నర్సయ్య వారి సమాధులను కూడా ఆ భూమిలోనే నిర్మించుకొన్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుర్రెముల రామస్వామిగౌడ్ తన పరపతిని ఉపయోగించి నర్సయ్య భూమిని ఆక్రమించారు. నకిలీ పత్రాలు సృష్టించి తన భార్య ఎలేంద్ర పేరిట పాస్‌పుస్తకాలు పొందారు. ఈ విషయం తెలుసుకొన్న బాధితుడు నర్సయ్య రెవెన్యూ అధికారులను కలిసి న్యాయంచేయాలని వేడుకొన్నారు. దీనిపై విచారణచేసిన తాసిల్దార్ ఆ భూమి సైనికుల కోటా కింద ఆర్మీ మాజీ అధికారి మిలానీ షరీఫ్‌కు ప్రభుత్వం కేటాయించినట్టు గుర్తించారు. నర్సయ్య 11-11-1973లో ఆర్మీ మాజీ అధికారి మిలానీ షరీఫ్ నుంచి 2.20 ఎకరాలు కొనుగోలుచేసి ఆ భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం జారీచేయాలని దరఖాస్తు చేసుకొన్నట్టు తేల్చారు. కానీ ప్రస్తుత రికార్డుల ప్రకారం కుర్రెముల ఎలేంద్ర పేరిట పట్టా మార్పు జరిగిందని, వారు ఆర్వోఆర్ ద్వారా హక్కు పొందారని గుర్తించారు. ఈ మేరకు 4-1-2013న అప్పటి తాసిల్దార్ పీవోటీ యాక్ట్-1977, 2001 నిబంధనలకు విరుద్ధంగా భూమి బదిలీచేసినట్టు గుర్తించి స్వాధీన ఉత్తర్వులు జారీ చేస్తూ దాన్ని ప్రభుత్వ భూమిగా ధ్రువీకరించారు. అప్పటికీ పసుల నర్సయ్య ఆ భూమిని సాగు చేసుకొంటున్నందున నిరుపేద దళితుడు కావడంతో అతడికి అసైన్ చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆర్డీవోకు ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు కుర్రెముల రామస్వామి తన అనుచరుల సాయంతో రెవెన్యూ అధికారులపై తీవ్రమైన ఒత్తిడి తెస్తూ భూమిని నర్సయ్యకు అసైన్ చేయకుండా అడ్డుకొన్నారు. నర్సయ్య సాగు చేసుకొంటున్న భూమికి విపరీతమైన డిమాండ్ రావడంతో కుర్రెముల రామస్వామి నెల్లుట్లకు చెందిన నర్సింగ లీల, ఎడ్ల రాజు అనే ఇద్దరు వ్యక్తులకు అక్రమంగా విక్రయించి సొమ్ము చేసుకొన్నారు. దీంతో బాధితుడు నర్సయ్య రెండున్నరేండ్లుగా ఆర్డీవో ఉత్తర్వులు అమలు చేసి తనకు న్యాయంచేయాలని తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు మాత్రం తనను పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తన భూమిని ఆక్రమించుకొన్న వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని నర్సయ్య 'ధర్మగంట' ద్వారా కోరుతున్నారు.

బాధిత రైతు పసుల నర్సయ్య

వివరాలు వెల్లడిస్తున్న చందంపేట తాసిల్దార్ దేస్యనాయక్

చందంపేట తాసిల్ కార్యాలయంలో భూరికార్డులను పరిశీలిస్తున్న ప్రత్యేక బృందం

భూఅక్రమాలపై కలెక్టర్‌కు నివేదిస్తాం

- విచారణ అధికారులు భూపత్రాలను పరిశీలిస్తున్నారు
- నల్లగొండ జిల్లా చందంపేట తాసిల్దార్ దేస్యనాయక్
- 'అడవిని అమ్మేశారు' కథనానికి స్పందన

చందంపేట: 'నమస్తే తెలంగాణ'లో 'అడవిని అమ్మేశారు' శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన కథనానికి నల్లగొండ జిల్లా చందంపేట తాసిల్దార్ దేస్యనాయక్ స్పందించారు. చందంపేట మండల రెవెన్యూ యంత్రాంగంలో జరిగిన అక్రమాలపై పూర్తి నివేదిక తయారుచేసి కలెక్టర్‌కు అందజేయనున్నట్టు తెలిపారు. తాసిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. భూపత్రాలను విచారణ అధికారుల ఆధ్వర్యంలో పరిశీలిస్తున్నట్టు చెప్పారు. పొగిళ్ల గ్రామంలో జరిగిన భూఅక్రమాలపై విచారణ నిర్వహించి నివేదిక తయారుచేసి కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ప్రస్తుతం అచ్చంపేటపట్టి సర్వే నంబర్ 50లో ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టాలు చేసినవాటిపై మరో మూడురోజులపాటు విచారణ కొనసాగనున్నదని తెలిపారు. విచారణ అధికారులుగా ఒక బృందాన్ని ఏర్పాటుచేసినట్టు వివరించారు. అచ్చంపేట పట్టితోపాటు పొగిళ్ల, కంబాలపల్లి, రేకులగడ్డ, చిత్రియాల, పెద్దమూల, కోరుట్ల, ఎలమలమంద, తెల్‌దేవర్‌పల్లి గ్రామాలకు సంబంధించిన భూరికార్డులను పరిశీలించి నివేదిక తయారుచేస్తామని చెప్పారు. 2014-2019 వరకు మాన్యువల్ రికార్డుల ఆధారంగా, ప్రస్తుతం ఉన్న కంప్యూటర్ రికార్డులను పరిశీలించి రైతుల వివరాలు సేకరిస్తామని అన్నారు. మండలంలోని సుమారు మూడు వేల మంది రైతులు బోగస్ పట్టాలు పొందినట్టు తమ దృష్టికి వచ్చిందని, వాటిపై దృష్టిసారించి అసలు రైతులను పరిశీలిస్తామన్నారు. ఇప్పటికే మండలంలోని వివిధగ్రామాల్లో ప్రభుత్వ అటవీ భూములపై సర్వే చేపడుతున్నట్టు తెలిపారు. అక్రమంగా పట్టాలుచేసిన వీఆర్వోలపై నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్టు చెప్పారు. రికార్డులను పరిశీలించిన వారిలో దేవరకొండ, చింతపల్లి, డిండి, చందంపేట ఆర్ఐలు శ్రీనివాస్ రెడ్డి, నర్సింహ, శ్రీధర్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కంబాలపల్లిలో అటవీ భూముల పరిశీలన

చందంపేట మండలంలోని కంబాలపల్లిలో అటవీప్రాంతాన్ని శుక్రవారం అటవీశాఖ అధికారులు, సర్వేయర్ల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. మండలంలోని 28 గ్రామపంచాయతీల్లో అటవీశాఖ, ప్రభుత్వ భూములు ఎన్ని ఎకరాలు ఉన్నాయో లెక్క తేల్చేందుకు వివిధశాఖల అధికారులతో సర్వే నిర్వహిస్తున్నది. అందులో భాగంగానే కంబాలపల్లిలో అటవీశాఖకు చెందిన సుమారు ఆరు వేల ఎకరాల భూములు కలిగి ఉన్నందున వాటి వివరాలను సేకరించి సర్వే నిర్వహిస్తున్నారు. అటవీశాఖకు చెందిన భూములు, ప్రభుత్వభూములు, రైతుల పట్టా భూములపై సర్వే నిర్వహిస్తున్నట్టు డివిజన్ సర్వేయర్ అధికారి వంశీ తెలిపారు. మండలంలోని అన్నిగ్రామాల్లో త్వరలో సర్వే నిర్వహించి ప్రభుత్వ, అటవీ ప్రాంత, రైతుల పట్టా భూముల లెక్క తేల్చి జిల్లా అధికారులకు సమర్పించనున్నట్టు చెప్పారు. నల్లమల అటవీప్రాంతంలో వివిధ గ్రామాల పరిధిలో సుమారు 26 వేల హెక్టార్ల భూములు ఉన్నాయని అటవీశాఖ అధికారులు చెప్తున్నారు. సర్వే నిర్వహించిన వారిలో సర్వేయర్లు లక్ష్మణ్, సాయికృష్ణ, శ్రీనివాస్, జ్యోతి, ప్రియదర్శిని, సెక్షన్ ఆఫీసర్ సైదులు, బీట్ ఆఫీసర్లు కవిత, ప్రీతి ఉన్నారు.

చందంపేట మండలం కంబాలపల్లి అటవీప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కొత్త పాస్‌పుస్తకాలు ఇవ్వండి

- నిజామాబాద్ జిల్లా కందకుర్తి రైతుల డిమాండ్
- రెంజల్ తాసిల్ ఎదుట ధర్నా

శుక్రవారం రెంజల్ తాసిల్ ఎదుట ధర్నాచేస్తున్న కందకుర్తి రైతులు

రెంజల్: తమ భూమికి సంబంధించి కొత్త పాస్‌పుస్తకాలు అందించాలని నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి రైతులు పాత పాస్‌పుస్తకాలతో తాసిల్ ఎదుట ధర్నాకు దిగారు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకొన్నా కనికరించడంలేదని వాపోయారు. దీంతో తమకు రైతుబంధు సాయం అందడంలేదన్నారు. 70 ఏండ్లుగా 308.30 ఎకరాల భూమిని సాగుచేసుకొంటున్నామని, తమ భూములకు కొత్త పాస్‌పుస్తకాలను ఎందుకు ఇవ్వడం లేదో అధికారులు సమాధానం చెప్పాలని బాధితులు ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ధర్నా విరమించబోమని, తాసిల్ సిబ్బంది విధులకు విఘాతం కలిగించకుండా శాంతియుతంగా నిరసన కొనసాగిస్తామన్నారు. ఈ విషయమై తాసిల్దార్ అసదుల్లా ఖాన్ మాట్లాడుతూ.. కోర్టు కేసు కారణంగా బాధిత రైతులకు న్యాయంచేయలేకపోతున్నాని పేర్కొన్నారు. ఈ భూములు వక్ఫ్‌బోర్డుకు చెందినవని కోర్టులు కేసు వేశారని చెప్పారు. కేసు అప్పీల్, రీ నోటిఫికేషన్ అయ్యేంత వరకు ఈ భూములు వక్ఫ్‌బోర్డుకు చెందినవిగానే పరిగణించాలని, దీనిపై రెవెన్యూశాఖ పట్టాలు జారీచేయడం కుదరదన్నారు. గతంలో బోధన్ సబ్ కలెక్టర్‌గా పనిచేసిన అనురాగ్ జయంతికి చేరిన రిపోర్టు కాపీని తాను సదరు రైతులకు అందజేసినట్టు తెలిపారు.

భూమి కోసం రైతుకుటుంబం ధర్నా

- రంగారెడ్డి జిల్లా మంచాల తాసిల్ ఎదుట బైఠాయింపు
- మోఖాలో ఉన్నా దొంగ సంతకంతో పట్టా మార్చారని ఆరోపణ
- ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్న తాసిల్దార్

శుక్రవారం మంచాల తాసిల్ ఎదుట ధర్నాచేస్తున్న యాదమ్మ కుటుంబసభ్యులు

మంచాల: తమ భూమి ఇప్పించాలని, దొంగ సంతకాలతో భూమిని రిజిస్ట్రేషన్ చేసుకొన్న వారిపై చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా మంచాల మండలం జాపాల గ్రామ రైతులు శుక్రవారం మంచాల తాసిల్ కార్యాలయం ఎదుట ఆందోళనచేపట్టారు. జాపాలలోని సర్వే నంబర్ 118తోపాటు పలు నంబర్లలో బీనమోని పోచమ్మకు 3.22 ఎకరాల భూమి ఉండేది. ఈ భూమిని ఆమె చనిపోకముందు సాదాబైనామాపై బీనమోని నర్సింహ, భీమయ్యకు అమ్మగా, వీరు ఆర్వోఆర్‌లో ఇంప్లూమెంట్ చేయించుకోలేదు. దీంతో ఆ భూమి తన తల్లిదండ్రులు పోచమ్మ కూతురు పోలమోని యాదమ్మ తాసిల్ కార్యాలయం లో దరఖాస్తు చేసుకొన్నారు. రెండేండ్లపాటు జేసీ కోర్టులో కేసు నడిచింది. జేసీ ఆదేశాలతో తాసిల్దార్ 3.22 ఎకరాలను యాదమ్మ పేరిట ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. కొంతకాలానికి యాదమ్మ తనకు భూమిని విక్రయించిందని శ్రవంతి శ్రీనివాస్‌రెడ్డి మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకొన్నారు. దీంతో వారి పేరిట 2017లో పాస్‌పుస్తకాలు వచ్చాయి. కబ్జాలో మాత్రం యాదమ్మ కుటుంబమే ఉన్నది. తనను నమ్మించి మోసం చేశారని, భూమిని అగ్రిమెంట్ చేసుకొంటున్నామని చెప్పి దొంగ సంతకాలతో రిజిస్ట్రేషన్ చేసుకొన్నారని యాదమ్మ.. కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం తాసిల్ వద్ద ఆందోళనకు దిగారు. పోలీసులు వచ్చి వారికి నచ్చజెప్పి ఠాణాకు తీసుకెళ్లారు. ఈ విషయమై తాసిల్దార్ సుచరితను వివరణ కోరగా.. రిజిస్ట్రేషన్ చేసుకొన్న డాక్యుమెంట్‌తో శ్రీనివాస్‌రెడ్డి మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకొన్నారని, నిబంధనల ప్రకారమే అతనికి పాస్‌పుస్తకాలు అందజేశామని చెప్పారు. దొంగ సంతకాలతో రిజిస్ట్రేషన్ చేసుకొన్న విషయం తమకు తెలియదన్నారు. బాధిత రైతులు దరఖాస్తు చేసుకొంటే మోఖాలోకి వెళ్లి పరిశీలించామని, కాస్తులో మాత్రం యాదమ్మనే ఉన్నారని తెలిపారు. పట్టా మాత్రం శ్రవంతి శ్రీనివాస్‌రెడ్డి పేరిట ఉన్నదన్నారు. ఆ భూమికి సంబంధించిన పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు.

హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో తనను కలిసిన వరంగల్ సీపీ రవీందర్, ఇతర సిబ్బందిని అభినందిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

వరంగల్ సీపీకి డీజీపీ అభినందనలు

చిన్నారి కేసులో త్వరితగతిన దర్యాప్తుపై ప్రశంసలు

హైదరాబాద్/ వరంగల్ క్రైం, నమస్తే తెలంగాణ: వరంగల్‌లో తొమ్మిదినెలల పాపపై లైంగిక దాడి, హత్య కేసులో నిందితుడికి శిక్షపడేలా దర్యాప్తును త్వరితగతిన పూర్తిచేసినందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ రవీందర్‌ను డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి అభినందించారు. శుక్రవారం వరంగల్ సీపీ రవీందర్, ఇతర సిబ్బంది డీజీపీ కార్యాలయంలో మహేందర్ రెడ్డిని కలిశారు. శాస్త్రీయ ఆధారాలు సేకరించడంతోపాటు 21 రోజుల్లోనే కోర్టులో చార్జిషీట్ దాఖలుచేయడంలో పోలీస్ సిబ్బంది పనితీరును డీజీపీ ప్రశంసించారు. అభినందనలు అందుకున్న వారిలో ఇన్‌స్పెక్టర్లు సంపత్ రావు, సదయ్య, ఎస్సై ప్రవీణ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్స్ శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్‌కుమార్, కానిస్టేబుల్ శ్రీనివాస్ ఉన్నారు.

నేడు టీవీఎస్ మూడో రాష్ట్ర మహాసభ

ముఖ్యఅతిథిగా హాజరుకానున్న కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ వికాస సమితి (టీవీఎస్) మూడో రాష్ట్ర మహాసభ నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో శనివారం జరుగనుంది. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే మహాసభకు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. టీవీఎస్ అధ్యక్షుడు దేశపతి శ్రీనివాస్ సభాధ్యక్షులుగా వ్యవహరించనుండగా, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ నిరా చంధోక్ 'మతతత్వ రాజకీయాలు- ప్రజాస్వామ్య శక్తుల పాత్ర'పై ప్రారంభోపన్యాసం చేయనున్నారు. 'సమాఖ్య స్ఫూర్తి- ఎదురవుతున్న సవాళ్లు' అంశంపై కేంద్ర సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, 'తెలంగాణ సామాజిక ఐక్యత సవాళ్లు- పరిష్కారాలు' అంశంపై నమస్తే తెలంగాణ డిప్యూటీ ఎడిటర్ పీ వేణుగోపాల స్వామి మాట్లాడుతారని సంస్థ ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్ తెలిపారు. గౌరవ అతిథులుగా తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్‌రావు, ఉన్నత విద్యామండలి సభ్యులు నరసింహారెడ్డి, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి కే సీతారామారావు పాల్గొంటారని చెప్పారు.

విదేశీ రాయబారులతో ఏపీ సీఎం భేటీ

అమరావతి: భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా వివిధ దేశాల అంబాసిడర్లు, హైకమిషనర్లు, కాన్సులేట్ జనరల్స్‌తో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు. డిప్లొమాటిక్ ఔట్‌రీచ్ పేరిట విజయవాడలో వాణిజ్య దౌత్య సదస్సు నిర్వహించారు. భారత విదేశాంగశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా వాణిజ్యం, పెట్టుబడులకు అంతర్జాతీయ గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ మారిందనే విషయాన్ని చాటిచెప్పాలని భావిస్తున్నట్టు జగన్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో దక్షిణ కొరియా, సింగపూర్, ఆస్ట్రియా, టర్క్ మెనిస్థాన్, మయన్మార్, కిర్గిస్థాన్, పోలాండ్, బల్గేరియా రాయబారులు, బోట్స్‌వాన, శ్రీలంక హై కమిషనర్లు, డెన్మార్క్, ఇండోనేషియా, ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్స్, యూకే డిప్యూటీ హైకమిషనర్ తదితరులతోపాటు మొత్తం 35కుపైగా దేశాల రాయబారులు పాల్గొన్నారు.

కృష్ణాజలాల పంపిణీకి పాతలెక్కే

- తెలంగాణకు 34 శాతం, ఏపీకి 66 శాతం
- నదీ యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయం
- 103 టీఎంసీలకు తెలంగాణ ఇండెంట్, 38 టీఎంసీలు కావాలన్న ఏపీ
- గుండుగుత్తగా అనుమతులిచ్చేందుకు చైర్మన్ గుప్తా నిరాకరణ
- ఇండెంట్లు సవరించి 13లోగా సమర్పించాలని సూచన
- బోర్డు పరిధి, కార్యాలయ తరలింపుపై పట్టుబట్టిన ఆంధ్రప్రదేశ్
- కార్యాలయ తరలింపు వద్దన్న తెలంగాణ నీటిపారుదలశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పంపిణీని మునుపటి లెక్కల ప్రకారమే కొనసాగించాలని నిర్ణయించారు. దామాషా ప్రకారం తెలంగాణ 34 శాతం, ఆంధ్రప్రదేశ్‌కు 66 శాతం జలాల పంపిణీకి రెండు రాష్ట్రాల ఇంజినీర్లు అంగీకరించారు. కృష్ణా బేసిన్‌లో భారీ ఇన్‌ఫ్లోలు నమోదవుతున్న నేపథ్యంలో ఆ నదీ యాజమాన్య బోర్డు శుక్రవారం జలసౌధలో రెండు రాష్ట్రాల ఇంజినీర్లతో పాటు త్రిసభ్య కమిటీ సమావేశాన్ని నిర్వహించింది. సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. బోర్డు పరిధిని నిర్ణయించి కార్యాలయాన్ని విజయవాడకు తరలించాలని ఏపీ పట్టుబట్టగా.. తెలంగాణ ఇంజినీర్లు భిన్నాభిప్రాయాలను వ్యక్తంచేశారు. ప్రాజెక్టులవారీగా నీటి కేటాయింపులు జరిగిన తర్వాతే బోర్డు పరిధిని నిర్ణయించాలని తెలంగాణ నీటిపారుదలశాఖ పునరుద్ఘాటించింది. సాగర్ కుడికాల్వ నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, కనుక ఆ కాల్వ నిర్వహణను బోర్డు పరిధిలోకి తీసుకురావాలని ఏపీ కోరగా.. తెలంగాణ వ్యతిరేకించింది. బేసిన్‌లో భారీగా వరద వస్తున్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తే అవకాశమేలేదని తెలంగాణ ఈఎన్సీ మురళీధర్‌రావు అన్నారు. అయినప్పటికీ ఏపీ ఇంజినీర్లు పట్టుబట్టడంతో.. ఈ అంశంపై అపెక్స్‌కౌన్సిల్ వేదికగా సీఎంల స్థాయిలో నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. బోర్డు కార్యాలయాన్ని విజయవాడకు తరలించాలని ఏపీ అధికారులు విజ్ఞప్తిచేయగా.. హైదరాబాద్‌లోనే కొనసాగించాలని తెలంగాణ నీటిపారుదలశాఖ పట్టుబట్టింది. ఈ విషయంలో ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం నడుచుకుంటామని బోర్డు చైర్మన్ ఆర్కే గుప్తా పేర్కొంటూ.. తెలంగాణ అభిప్రాయాన్ని కేంద్ర జలవనరులశాఖకు పంపుతామని చెప్పారు.

శుక్రవారం జలసౌధలో మీడియాతో మాట్లాడుతున్న గోదావరి యాజమాన్య బోర్డు చైర్మన్ ఆర్కే జైన్

14న నీటి విడుదల ఉత్తర్వులు

ప్రస్తుతం కృష్ణాబేసిన్‌లో మంచి ఇన్‌ఫ్లోలు నమోదవుతున్నందున మూడునెలల అవసరాల నిమిత్తం రాష్ట్రానికి 103 టీఎంసీల నీరు ఇవ్వాలని తెలంగాణ ఇంజినీర్లు విజ్ఞప్తిచేయగా.. నెలరోజుల అవసరాల కోసం ఏపీకి 38 టీఎంసీల నీరు ఇవ్వాలని ఆ రాష్ట్ర ఇంజినీర్లు కోరారు. దీనిపై బోర్డు చైర్మన్ గుప్తా స్పందిస్తూ.. గతేడాది మాదిరిగా గుండుగుత్తగా నీటి విడుదల ఉత్తర్వులిస్తే నీటిసంవత్సరం చివర్లో ఎండీడీఎల్ దిగువకు వెళ్లాల్సివస్తుందని, కనుక ఈసారి అలా ఇవ్వడంలేదని స్పష్టంచేశారు. సెప్టెంబర్ చివరినాటికి వరకు ఉండే అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇండెంట్లను సవరించాలని, సవరించిన ఇండెంట్లను ఈ నెల 13లోగా తమకు ఇస్తే.. వాటిని పరిశీలించి నీటి విడుదలకు 14న ఉత్తర్వులు జారీచేస్తామన్నారు. వర్కింగ్ మాన్యువల్ అంశం కూడా ఈ సమావేశంలో చర్చకు రావడంతో దీనిపై 15 రోజుల్లో ప్రత్యేక సమావేశాన్ని నిర్ణయించారు. టెలిమెట్రీ ఎందుకు ఆలస్యమైందని తెలంగాణ నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి సోమేశ్‌కుమార్ ప్రశ్నించగా.. పోతిరెడ్డిపాడు సహాతొమ్మిది పాయింట్ల వద్ద వెంటనే సైడ్‌లు కింగ్‌డాప్లర్స్ ఏర్పాటుచేస్తామని బోర్డు అధికారులు చెప్పారు. ఈ సమావేశంలో బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం, రెండు రాష్ట్రాల ఈఎన్సీలు మురళీధర్‌రావు, వెంకటేశ్వరరావు, తెలంగాణ ఇంటర్‌స్టేట్ సీఈ నర్సింహారావు, సీఈలు నరసింహ, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాల తరలింపుపై చర్చ జరగలేదు: జైన్

జలసౌధలో శుక్రవారం గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశాన్ని కూడా నిర్వహించారు. బోర్డు చైర్మన్ ఆర్కే జైన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఏపీ తరపున ఆ రాష్ట్ర జలవనరులశాఖ కార్యదర్శి హాజరుకాలేదు. దీంతో కీలక అంశాలపై చర్చించలేదని చైర్మన్ తెలిపారు. వర్కింగ్ మాన్యువల్‌పై త్వరలో కృష్ణాబోర్డు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నందున దీన్ని కూడా ఆ సమావేశంలోనే చర్చిస్తామన్నారు. కృష్ణా బేసిన్‌కు గోదావరి జలాల తరలింపుపై ఎలాంటి చర్చ జరుగలేదని, దీనిపై తమకు ఎలాంటి ప్రతిపాదన రాలేదని, రెండు రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు వస్తే చర్చిస్తామని జైన్ తెలిపారు. సమావేశంలో బోర్డు సభ్య కార్యదర్శి పాండే, రెండు రాష్ట్రాల ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఫారెస్ట్ విద్యార్థులకు ఆర్థికచేయూత

- ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తున్న అధికారులు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: బీఎస్సీ (ఫారెస్ట్రీ) చదువుతున్న విద్యార్థులకు తెలంగాణ అటవీశాఖ ప్రత్యేక ఇంటర్న్‌షిప్ సౌకర్యాలను కల్పించి వారికి ఆర్థికంగా చేయూతనిస్తున్నది. క్షేత్రస్థాయిలో అధ్యయనం, ప్రాజెక్ట్ రిపోర్టుల తయారీ, పంటలపై రైతులకు అవగాహన కల్పించడం వంటి అవకాశాలను కల్పిస్తున్నారు. కొన్ని కీలకసంస్థలు యూనియన్ ఆఫ్ ఫారెస్ట్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (యుఎఫ్ఆర్వో), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ, తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీ, సెంటర్ ఫర్ ఫారెస్ట్ అండ్ నేచురల్ రీసోర్స్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌తోపాటు నెహ్రూ జూలాజికల్ పార్క్, పాకాల బయోడైవర్సిటీ పార్క్ , అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో శాస్త్రీయపరమైన అధ్యయనాలకు అవకాశమిస్తున్నారు. దీనిద్వారా ఒక్కోవిద్యార్థి నిర్ణీత కాలానికి 5 నుంచి 10 వేల రూపాయల వరకు సంపాదిస్తున్నట్టు ఫారెస్ట్ కాలేజీ, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పర్సన్ ఇంచార్జి, హైదరాబాద్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ జీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 2016లో దూలపల్లి ఫారెస్ట్‌అకాడమీ క్యాంపస్‌లో ప్రారంభమైన బీఎస్సీ (ఫారెస్ట్రీ) కోర్సులో ఇప్పటికే మూడుబ్యాచులు పూర్తయ్యాయి. నాలుగోబ్యాచ్ ప్రవేశాలు మొదలయ్యాయి. ఈ కోర్సులు పూర్తిచేసినవారికి అటవీశాఖ ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్‌ను కల్పించనున్నారు.

నాలుగో బ్యాచ్ విద్యార్థులకు 16న కౌన్సెలింగ్

ఈ ఏడాది బీఎస్సీ (ఫారెస్ట్రీ) కోర్సులో ప్రవేశానికి అర్హత సంపాదించిన విద్యార్థులకు 16న కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నారు. దివ్యాంగులైన విద్యార్థులకు 17న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఫారెస్ట్ కాలేజీ, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పర్సన్ ఇంచార్జి, హైదరాబాద్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ జీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 19 నుంచి తరగతులు మొదలవుతాయని చెప్పారు. ప్రస్తుతం దూలపల్లి ఫారెస్ట్‌లో తాత్కాలికంగా కొనసాగుతున్న ఫారెస్ట్‌కాలేజీ, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్‌ను గజ్వేల్ నియోజకవర్గం ములుగులో నిర్మితమైన నూతన భవనంలోకి మార్చడానికి అధికారులు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు.

కృష్ణా నీళ్లు చెన్నైకి ఇవ్వండి

ఏపీ సీఎం జగన్‌కు తమిళనాడు మంత్రుల విజ్ఞప్తి

అమరావతి: చెన్నై నగర ప్రజల తాగునీటి కష్టాలను తీర్చేందుకు కృష్ణా నీటిని విడుదల చేయాలని తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఇద్దరు మంత్రులు శుక్రవారం ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు తమిళనాడు మున్సిపల్‌శాఖ మంత్రి ఎస్పీ వేలుమణి, మత్స్యశాఖ మంత్రి జయకుమార్, ఆ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి మనివాసన్ విజయవాడలో జగన్‌ను కలిశారు. చెన్నై నగరంలోని 90 లక్షల మంది తాగునీరు అందక అల్లాడుతున్నారని, కృష్ణా నీటి విడుదలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన జగన్.. తాగునీటి విడుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధిక

పీకేఎల్‌లో నేడు

గుజరాత్ X తలైవాస్ -7.30గం.
పుణేరి X ఢిల్లీ -8.30గం.

స్టార్ స్పోర్ట్స్‌లో

క్వార్టర్స్‌లో సుశీల్ ఓటమి

న్యూఢిల్లీ: సుదీర్ఘ విరామం అనంతరం మ్యాట్‌పై అడుగుపెట్టిన భారత స్టార్ రెజ్లర్, రెండు ఒలింపిక్స్ మెడల్స్ విజేత సుశీల్ కుమార్ పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. బెలారస్ వేదికగా జరుగుతున్న మెడ్‌వెడ్ రెజ్లింగ్ టోర్నమెంట్ క్వార్టర్‌ఫైనల్లో సుశీల్ పరాజయం పాలయ్యాడు. 74 కేజీల విభాగంలో శుక్రవారం జరిగిన పోరులో సుశీల్.. బెక్‌జోద్ అబ్దురఖ్‌మొనోవ్ (ఉజ్బేకిస్థాన్) చేతిలో ఓడాడు. ఆసియా క్రీడల చాంపియన్ బెక్‌జోద్ పట్టిన పట్టు వీడకుండా సుశీల్‌పై పైచేయి సాధించడంతో 90 సెకన్లలోనే పోరు ముగిసింది.

పాత నీరు వెళ్లిపోతూ.. కొత్త నీరు వచ్చి చేరితేనే ఏ నదికైనా అందం, ఆనందం. రంగం ఏదైనా జట్టుకు జవసత్వాలు నింపాలంటే కొత్త రక్తం ఎక్కించాల్సిందే..! ప్రస్తుతం టీమ్‌ఇండియా కూడా ఆ దిశగానే అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తున్నది. 'మిషన్-2023'పేరిట ఇప్పటి నుంచి యువ ఆటగాళ్లకు విరివిగా అవకాశాలిస్తూ.. వారిలో టీమ్‌కు ఉపయోగపడేవారెవరో పరీక్షిస్తున్నది. పనిలో పనిగా వచ్చే ఏడాది జరుగనున్న పొట్టి ప్రపంచకప్‌లోనూ కుర్రాళ్లకే పెద్దపీట వేసేలా కనిపిస్తున్నది. టాప్-3 బ్యాట్స్‌మెన్‌ను మినహాయిస్తే.. మిగిలిన బ్యాటింగ్ స్థానాలకు జట్టులో సుస్థిర ఆటగాళ్లు పెద్దగా లేరనే చెప్పాచ్చు. ఇటీవల ముగిసిన ప్రపంచకప్‌లో ఆడిన దినేశ్ కార్తీక్ సోదిలోనే లేకుండా పోతే.. కేదార్ జాదవ్ మెడపై కత్తి వేలాడుతుంది. ధోనీ ఎంత కాలం కొనసాగుతాడో స్పష్టంగా చెప్పలేని పరిస్థితి. మరి ఇలాంటి నేపథ్యంలో కొత్త కుర్రాళ్ల స్థితిగతులపై ఓ లుక్కేస్తే..

కొత్త రక్తం వస్తున్నది

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

నవయువ తార.. నవదీప్ సైనీ

ఆస్ట్రేలియా వేదికగా జరిగిన 2015 వన్డే ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ లీగ్‌దశలోనే నిష్క్రమించింది. బంగ్లాదేశ్ చేతిలో ఓడి భారంగా టోర్నీ నుంచి వెనుదిరిగింది. అయితే అక్కడితో ఆ ఓటమిని మర్చిపోని ఆ దేశ బోర్డు జట్టు ప్రక్షాళనపై దృష్టి పెట్టింది. పేరున్న ఆటగాళ్లైనా జట్టు అవసరాల మేరకు వారిని పక్కనపెట్టి.. కొత్త వారికి చాన్సిచ్చింది. కొన్నాళ్లకే మార్పు కనిపించింది. బాదుడే మంత్రంగా బరిలోకి దిగిన యువ ఆటగాళ్లు వచ్చిన అవకాశాలను రెండు చేతులా అందిపుచ్చుకున్నారు. ఫలితం.. నాలుగేండ్లు తిరిగేసరికి సొంతగడ్డపై జరిగిన ప్రపంచకప్‌లో ఇంగ్లిష్ జట్టు విశ్వవిజేతగా నిలిచింది. అదీ కేవలం బాదుడు కారణంగానే. తుదిపోరులో ఇరు జట్లు సమానమైన స్కోరే చేసినా ఎక్కువ బౌండ్రీలు కొట్టిన కారణంగా ఆతిథ్య జట్టు కప్పు కల నెరవేరింది. ప్రస్తుత భారత జట్టు పరిస్థితి అదే అని చెప్పడం సరికాకున్నా.. 2023లో సొంతగడ్డపై జరుగనున్న వన్డే వరల్డ్‌కప్ కోసం ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టక తప్పని స్థితి. అందుకు గానూ కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తే ధైర్యంగా ముందడుగు వేయాల్సిందే. ఇదివరకులా కాకుండా ఒక్కో ఆటగాడికి ఎక్కువ చాన్స్‌లు ఇస్తూ వారి ప్రతిభను వెలికితీయాలని బోర్డు కూడా భావిస్తున్నది. అందులో భాగంగా రాహుల్ చాహర్, నవదీప్ సైనీ, ఖలీల్ అహ్మద్, మనీశ్ పాండే, శ్రేయస్ అయ్యర్ వంటి వారికి వెస్టిండీస్ సిరీస్‌కు ఎంపిక చేసింది. వీరే కాక దేశవాళీల్లో పరుగుల వరద పారిస్తున్న శుభ్‌మన్ గిల్, అపార ప్రతిభ ఉన్న పృథ్వీ షా, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ కూడా క్యూలో ఉన్నారు. మరి వీరిలో ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జట్టులో సుస్థిర స్థానం ఏర్పరుచుకునేవారెవరో వేచి చూడాలి.

గత కొంతకాలంగా భారత క్రికెట్‌లో ఎక్కువగా వినిపిస్తున్న పేరు నవదీప్ సైనీ. బక్కపల్చని శరీరం, సాధారణ ఎత్తుతోనే అసాధారణ వేగం రాబడుతున్న నవదీప్‌ను భారత భవిష్యత్తు ఆశాకిరణంగా ఇప్పటికే పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. చిన్న పట్టణంలోని దిగువ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన సైనీ.. భారత జట్టుకు ఎంపిక కావడం వెనుక పెద్ద కథే ఉంది. ఎన్నో అడ్డంకులను అవరోధాలను దాటుకుంటూ వచ్చిన అతడు గతేడాది ఐపీఎల్లో బెంగళూరు రాయల్ చాలెంజర్స్ తరపున 13 మ్యాచ్‌ల్లో 11 వికెట్లు పడగొట్టి సత్తాచాటాడు. నిలకడగా 150 కిలోమీటర్ల వేగంతో బంతులు వేయగల సైనీని ఆరంభంలోనే గుర్తించిన టీమ్‌ఇండియా మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్ చేయూతనిచ్చి రంజీ జట్టుకు ఎంపికయ్యేలా చేశాడు. అక్కడి నుంచి వెనుదిరిగి చూసుకోని అతడు వన్డే వరల్డ్‌కప్‌లో నెట్‌బౌలర్‌గా ఎంపికయ్యాడు. అక్కడ కూడా టీమ్ సభ్యుల మన్ననలు పొందిన సైనీ ఆడిన తొలి అంతర్జాతీయ టీ20లోనే 3 వికెట్లు పడగొట్టి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఈ దూకుడు ఇలాగే కొనసాగిస్తే.. భారత పేస్ దళం సురక్షిత హస్తాల్లో చేరినట్లే.

పంజాబ్‌కా పుత్తర్

వయసుకు మించిన పరిణితి కనబరుస్తున్నాడని టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్‌కోహ్లీ చేత శభాష్ అనిపించుకున్న యువ కెరటం శుభ్‌మన్ గిల్ దేశవాళీల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాడు. తాజాగా వెస్టిండీస్-ఏతో జరుగుతున్న అనధికారిక మూడో టెస్టులో భారత్-ఏ తరపున బరిలో దిగిన గిల్ డబుల్ సెంచరీ బాది ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అత్యంత పిన్న వయసులో ఈ ఫీట్ సాధించిన భారత బ్యాట్స్‌మన్‌గా రికార్డుల్లోకెక్కాడు. న్యూజిలాండ్ పర్యటన సందర్భంగా టీమ్‌ఇండియాకు ఎంపికైన గిల్ రెండు మ్యాచ్‌ల్లోనూ పెద్దగా ఆకట్టుకోలేకపోయినా.. అతి త్వరలోనే తిరిగి జట్టులోకి వచ్చే చాన్సుంది. అతడితో పాటు అండర్-19 జట్టు సహచరుడు పృథ్వీ షాపై కూడా భారీ అంచనాలున్నాయి. టెస్టు అరంగేంట్రలోనే సెంచరీతో కదం తొక్కిన యంగ్ తరంగ్ షా త్వరలోనే పరిమిత ఓవర్ల క్రికెట్‌లోనూ అడుగుపెట్టే అవకాశాలు కోకొల్లలు,

రాజస్థాన్ ఎక్స్‌ప్రెస్.. ఖలీల్ అహ్మద్

జహీర్ ఖాన్ రిటైర్ అయిన తర్వాత నిఖార్సైన ఏడమ చేతి వాటం పేసర్ కోసం భారత్ చాన్నాళ్ల పాటు నిరీక్షించింది. భీకరమైన పేస్‌తో పాటు గాలి దిశను వాడుకుంటూ బంతిని స్వింగ్ చేయడంలో సిద్ధ హస్తుడైన జాక్ జట్టుకు దూరమైన ఆరేండ్ల తర్వాత కూడా ఆ స్థాయిలో రాణించగలవారు కనిపించలేదు. అయితే సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ నేనున్నానంటూ.. రాజస్థాన్‌కు చెందిన ఖలీల్ అహ్మద్ దూసుకొచ్చాడు. కచ్చితమైన వేగం, బౌన్సర్లు విసరగల నేర్పరితనం వెరిసి అతడికి జట్టులో చోటు దక్కింది. బుమ్రా, భువనేశ్వర్, మొహమ్మద్ షమీతో కూడిన పేస్ బృందంలో వైవిధ్యం పెంచేందుకు ఉపయోగపడగలిగే ఖలీల్‌కు మేనేజ్‌మెంట్ విరివిగా అవకాశాలు ఇస్తున్నది. ఇప్పటి వరకు 9 వన్డేలాడిన ఈ లెఫ్టార్మ్ పేసర్ 11 వికెట్లు పడగొట్టాడు. 11 టీ20ల్లోనూ 11 వికెట్లు తీశాడు. ఈ ఏడాది ఐపీఎల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున 9 మ్యాచ్‌ల్లోనే 19 వికెట్లు తీసి అందరి దృష్టిలో పడ్డ ఖలీల్.. ఇదే నిలకడ కొనసాగిస్తే భవిష్యత్తులో మంచి పేసర్‌గా ఎదిగే అవకాశాలున్నాయి. సన్‌రైజర్స్ జట్టులో సీనియర్ పేసర్ భువీ సలహాలతో చెలరేగిపోయిన ఖలీల్ అంతర్జాతీయ స్థాయిలో తనదైన ముద్ర వేయాలని తహతహలాడుతున్నాడు.

చాహర్ బ్రదర్స్

ఈ ఏడాది హైదరాబాద్ వేదికగా జరిగిన ఐపీఎల్ 12వ సీజన్ ఫైనల్లో ముంబై ఇండియన్స్ తరపున ఓ పందొమ్మిదేండ్ల కుర్రాడు 4 ఓవర్లు వేసిన 14 పరుగులే ఇచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. మహామహా హిట్టర్లుగా పేరున్న చెన్నై సూపర్ కింగ్స్ బ్యాట్స్‌మెన్ ఆ కుర్రాడి బౌలింగ్‌ను ఎదుర్కొవడానికి నానా తంటాలు పడ్డారు. తీవ్రమైన ఒత్తిడిలో కూడా ఎలాంటి బెరుకు లేకుండా తనపని తాను చేసుకుంటూ వెళ్లిన ఆ యువ లెగ్ స్పిన్నరే రాహుల్ చాహర్. సోదరుడు దీపక్ చాహర్ బాటలోనే నడుస్తూ.. అనతి కాలంలోనే టీమ్‌ఇండియా తలుపు తట్టాడు. విండీస్‌తో చివరి టీ20లో మంచి ప్రదర్శనే చేశాడు. ప్రస్తుతం టీమ్‌ఇండియాలో కుల్దీప్, చాహల్ జోడీ ఆకట్టుకుంటున్నా.. ఇదే నిలకడ కనబరిస్తే భవిష్యత్తులో రాహుల్ చాహర్‌కు జట్టులో పక్కా ప్లేస్ దక్కొచ్చు.

శ్రేయస్ అయ్యర్, మనీశ్ పాండే..

నాలుగేండ్ల క్రితమే టీమ్‌ఇండియా తరపున అరంగేట్రం చేసిన మనీశ్ పాండే ఇప్పటివరకు 23 వన్డేలాడి 36.66 సగటుతో 440 పరుగులు చేశాడు. చక్కటి ఫామ్‌లో ఉన్నప్పుడు అవకాశాలు రాక.. చాన్స్ వచ్చిన సమయంలో నిరూపించుకోలేక జట్టులో ఇప్పటి వరకు స్థిరమైన స్థానాన్ని ఏర్పరుచుకోలేకపోయిన పాండేకు ఇది చక్కటి అవకాశం అనే చెప్పొచ్చు. ప్రస్తుతం 29 ఏండ్ల పాండేను సానబెడితే మిడిలార్డర్‌లో ఎక్కువ కాలం జట్టుకు సేవలందించే చాన్స్ ఉండటంతో టీమ్‌మేనేజ్‌మెంట్ అతడికి ఎక్కువ చాన్స్‌లు ఇవ్వాలని నిర్ణయించుకుంది. అయితే విండీస్‌తో టీ20 సిరీస్‌లో రెండు మ్యాచ్‌ల్లో బ్యాటింగ్ చాన్స్ వచ్చినా దాన్ని వినియోగించుకోవడంలో పాండే విఫలమయ్యాడనే చెప్పాలి. యువ ఆటగాళ్ల నుంచి పోటీ ఎక్కువగా ఉండటంతో తనదైన ముద్ర వేయకపోతే కనుమరుగవడం ఖాయమైన తరుణంలో పాండే ఇప్పటికైనా విజృంభిస్తేనే అతడు టీమ్‌ఇండియా ప్రణాళికల్లో భాగమవుతాడు. అంతర్జాతీయ స్థాయిలో పెద్దగా నిరూపించుకోకముందే ఐపీఎల్లో ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా ఎంపికైన శ్రేయస్ అయ్యర్‌లో ప్రతిభకు కొదవలేకున్నా.. నిలకడే ప్రధాన సమస్య. వీరితో పాటు ధోనీ గైర్హాజరీలో పంత్ కూడా తనను తాను నిరూపించుకోవాల్సిందే. లేకుంటే ఇషాన్ కిషన్, సంజూ శాంసన్ నుంచి పోటీ తప్పకపోవచ్చు.

నాడా నీడలోకి..

పంతం వీడిన బీసీసీఐ.. జాతీయ స్పోర్ట్స్ ఫెడరేషన్‌గా అవకాశం

అందరితో సమానంగా క్రికెటర్లకు డోపింగ్ పరీక్షలు

భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)ఎట్టకేలకు తమ పంతం వీడింది. ఇన్నాళ్లు మాకు మేమే స్వతంత్రంగా అన్నట్లు వ్యవహరించిన బోర్డు దిగిరాక తప్పలేదు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ(నాడా)తో సంప్రదింపుల తర్వాత బీసీసీఐ తమ వైఖరి మార్చుకుంది. దీంతో ఇక నుంచి బీసీసీఐ నాడా పరిధిలోకి రానుంది. దీనికి తోడు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా బీసీసీఐ జాతీయ క్రీడా సమాఖ్య(ఎన్ఎస్ఎఫ్) గా ఏర్పడే అవకాశముంది. నాడా నిబంధనలు అనుసరించి ప్రతి ఒక్క క్రికెటర్ డోపింగ్ పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుంది. లేని యెడల నాడా విధించే శిక్షలకు గురికావాల్సి ఉంటుంది.

న్యూఢిల్లీ: జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) పరిధిలోకి బీసీసీఐ వచ్చింది. ఇన్నాళ్లు స్వతంత్రంగా వ్యవహరించిన బోర్డు...నాడా నిబంధనలకు అనుగుణంగా మారేందుకు ముందుకొచ్చింది. కేంద్ర క్రీడా కార్యదరి రాధేశ్యామ్ ఝులనియా, నాడా డీజీ నవీన్ అగర్వాల్‌తో బీసీసీఐ సీఈవో రాహుల్ జోహ్రీ, క్రికెట్ ఆపరేషన్స్ జీఎం సాబా కరీమ్ శుక్రవారం సమావేశమయ్యారు. ఈ భేటీలో తాము నాడా పరిధిలో వచ్చేందుకు సమ్మతమే అంటూ లిఖితపూర్వక హామీ ఇచ్చారు. దీంతో ఇక నుంచి నాడా నీడలోకి రావడంతో పాటు ఇకముందు జాతీయ స్పోర్ట్స్ సమాఖ్య(ఎన్ఎస్ఎఫ్)గా బీసీసీఐ ఏర్పడనుంది. ఈ కారణంగా సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) పరిధి కింద బీసీసీఐని ప్రశ్నించే అవకాశం కూడా దక్కింది. బోర్డులో జరుగుతున్న ఏ విషయం గురించి అయినా ఆర్టీఐ కింద సమాచారం పొందే అవకాశం లభిస్తుంది. బీసీసీఐ సమ్మతితో క్రికెటర్లందరినీ నాడా పరీక్షిస్తుందని క్రీడా కార్యదర్శి ఝులనియా అన్నారు. 'అంగీకారానికి ముందు బీసీసీఐ మా ముందు మూడు ప్రతిపాదనలు తీసుకొచ్చింది. డోప్ టెస్టింగ్ కిట్స్ నాణ్యత, పాథలజిస్టుల అనుభవం, సాంపిల్ సేకరణ. బోర్డు కోరిన వాటికి మేము సమ్మతించాం. కానీ సమకూర్చేందుకు డబ్బులు వసూలు చేస్తాం. అలాగనీ దేశంలోని అన్ని ఎన్ఎస్ఎఫ్‌ల లాగే బీసీసీఐకి సౌకర్యాలు కల్పిస్తాం అందులో ఎలాంటి తేడా ఉండదు. ఎవరైనా నిబంధనలు పాటించాల్సిందే' అని ఝులనియా అన్నారు.

గోప్యత పాటిస్తారా:

దాదాపు నాడా నిబంధనలకు అన్నింటికీ ఓకే చెప్పిన బీసీసీఐ.. స్టార్ ఆటగాళ్ల పరీక్షలపై గోప్యత పాటించాల్సిందిగా కోరింది. 'నాడా నిర్దేశించిన పరిమితులు, నిబంధనలకు మేము పూర్తిగా అంగీకరించాం. కొన్ని అంశాలపై క్రీడాశాఖ కార్యదర్శితో చర్చించాం. సాంపిల్స్ పరీక్షల విషయంలో అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలు పాటించేందుకు అవసరమయ్యే ఖర్చును భరిస్తామని చెప్పాం. అదే సమయంలో ఆటగాళ్ల గోప్యత అనేది ముఖ్యమైనది. స్టార్ ఆటగాళ్లు తమ ప్రైవసీ విషయంలో ఒకింత ఆందోళన చెందుతున్నారు' అని రాహుల్ జోహ్రీ అన్నాడు.

డిక్లరేషన్ ఇవ్వాల్సిందే:

నాడా నిబంధనల్లో ముఖ్యంగా ప్రతి ఆటగాడు ఒక ఏడాది కాలంలో మూడు తేదీలను కచ్చితంగా ఇవ్వాల్సి ఉంటుంది. సిరీస్‌లు, పోటీలు లేని సమయంలో నాడా డోప్ కంట్రోల్ ఆఫీసర్(డీసీవో) సాంపిల్స్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలి. ఒక వేళ సదరు ఆటగాడు ఇచ్చిన తేదిల్లో సాంపిల్స్ ఇవ్వకపోతే ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ(వాడా) నిబంధనలు ఉల్లంఘించినట్లు అవుతుంది. దీనికి ఉదాహరణ వెస్టిండీస్ ఆల్‌రౌండర్ అండ్రూ రస్సెల్. అవును నిర్దేశిత తేదిల్లో సాంపిల్స్ సమర్పించని కారణంగా రస్సెల్‌పై వాడా ఏడాది పాటు నిషేధం విధించిన సంగతి తెలిసిందే.

స్విస్ కంపెనీపై ఆధారం

ఇప్పటికీ నాడా స్విట్జర్లాండ్‌కు చెందిన ఇంటర్నేషనల్ డోప్ టెస్టింగ్ మేనేజ్‌మెంట్(ఐడీటీఎమ్)పై ఆధారపడుతున్నది. ఆటగాళ్ల నుంచి సేకరించిన సాంపిల్స్‌ను నాడాకు అందిస్తున్నది.

సీవోఏ అనుమతితోనే

ఇన్నాళ్లు డోప్ పరీక్షల విషయంలో స్వతంత్రంగా వ్యవహరించుకుంటూ వచ్చిన బీసీసీఐ తాజాగా నాడా పరిధిలోకి రావడం వెనుక క్రికెట్ పరిపాలకుల కమిటీ(సీవోఏ) హస్తం ఉంది. సుప్రీం కోర్టు నియమించబడిన సీవోఏ అంగీకారంతో బీసీసీఐ సీఈవో జోహ్రీ ముందడుగు వేయడానికి కారణమైంది.

ఒత్తిడికి తీసుకొచ్చినందుకేనా

నాడా పరిధిలోకి బీసీసీఐని తీసుకొచ్చేందుకు కేంద్ర క్రీడాశాఖ తీసుకొచ్చిన ఒత్తిళ్లు బాగానే పనిచేశాయి. దక్షిణాఫ్రికా ఏ సిరీస్‌తో పాటు మహిళల జట్టు టోర్నీలో ఆడేందుకు అనుమతి కోసం బీసీసీఐ ఆరు నెలల పాటు ఎదురుచూడాల్సి వచ్చింది. దీంతో లైన్‌లోకి వచ్చిన బీసీసీఐ.. నాడాకు తలొగ్గింది.

ఆర్టీఐ పరిధిలోకి వస్తుందా



నాడా నిబంధనలకు ఒప్పుకున్న బీసీసీఐ సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కిందికి వస్తుందా లేదా అన్నది తెలియాల్సి వస్తుంది. నాడా పరిధిలోకి రావడంతో జాతీయ క్రీడా సమాఖ్యగా మారిన బీసీసీఐకి ఆర్టీఐ వర్తించనుంది. 'ఈ రోజు జరిగిన ఎజెండాలో ఆర్టీఐ అంశం చర్చకు రాలేదు. నిబంధనలకు అనుగణంగా నడుచుకునేందుకు మేము సిద్ధంగా ఉన్నాం' అని జోహ్రీ అన్నాడు.

అలీ ఔట్.. ఆర్చర్ ఇన్!

ఆర్చర్

లండన్: వన్డే ప్రపంచకప్‌లో చక్కటి ప్రదర్శన చేసిన బార్బడోస్ పేసర్ జోఫ్రా ఆర్చర్ టెస్టు అరంగేట్రానికి మార్గం సుగమమైంది. ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌లో భాగంగా బుధవారం నుంచి ప్రారంభం కానున్న రెండో టెస్టులో ఆర్చర్ బరిలో దిగడం దాదాపు ఖాయమైంది. మ్యాచ్‌కు ఐదు రోజుల ముందే ఇంగ్లండ్ బోర్డు 12 మందితో కూడిన జట్టును ప్రకటించింది. గాయం కారణంగా ఆటకు దూరమైన అండర్సన్ స్థానంలో ఆర్చర్‌ను ఎంపిక చేసింది. లార్డ్స్ వేదికగా జరుగనున్న ఈ మ్యాచ్‌లో మొయిన్ అలీపై వేటు పడింది. అలీని పక్కన పెట్టిన బోర్డు అతడి స్థానంలో ఐర్లాండ్‌తో ఏకైక టెస్టులో అదరగొట్టిన లెఫ్టార్మ్ స్పిన్నర్ జాక్ లీచ్‌కు అవకాశం ఇచ్చింది. ఐర్లాండ్‌పై నైట్‌వాచ్‌మన్‌గా బరిలో దిగిన లీచ్ 92 పరుగుల చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. తొలి టెస్టులో అలీ అటు బంతితో ఇటు బ్యాట్‌తో విఫలమయ్యాడు.

ఇటీవలి ప్రపంచ రెజ్లింగ్ పోటీల్లో భారత జట్టుకు కోచ్‌గా వ్యవహరించి పతకాలు సాధించడంలో కీలకమైన డీవైఎస్‌వో అశోక్‌కుమార్‌కు శుక్రవారం కరీంనగర్‌లో ఘన స్వాగతం పలుకుతున్న దృశ్యం. కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌తో పాటు జిల్లా రెజ్లింగ్ సంఘం అధ్యక్షు రమేశ్ రెడ్డి, ఒలింపిక్ సంఘం కార్యదర్శి జనార్దన్ రెడ్డి తదితరులు అశోక్‌ను అభినందించారు.

'ఐపీఎల్ మేలు చేసింది'

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో భాగంగా ప్రపంచ మేటి ఆటగాళ్లతో కలిసి ఆడటం న్యూజిలాండ్ ప్లేయర్లకు బాగా తోడ్పడిందని ఆ జట్టు సీనియర్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్ అన్నాడు. ఈ అనుభవం కివీస్ జట్టుకు మేలు చేసిందని అతడు పేర్కొన్నాడు. 'ఐపీఎల్ వల్ల గొప్ప ఆటగాళ్లు, గొప్ప జట్లతో ఆడే అదృష్టం దక్కింది. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లకు చెందిన మేటి ఆటగాళ్లు ఇందులో పాల్గొంటున్నారు. దీనివల్ల ఆటగాళ్ల మధ్య అంతరం తగ్గింది. గొప్ప క్రికెటర్ల సహచర్యం, సలహాల కారణంగా న్యూజిలాండ్ క్రికెట్‌కు ఎంతో మేలు జరిగింది. అత్యుత్తమ ఆటగాళ్లతో కలిసి డ్రెస్సింగ్ రూమ్‌ను పంచుకోవడం, వారి నుంచి విలువైన సలహాలు పొందడం వల్ల విశేష ప్రయోజనం చేకూరింది'అని టేలర్ చెప్పుకొచ్చాడు.

కేకేఆర్ అసిస్టెంట్ కోచ్‌గా మెకల్లమ్

న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ బ్రెండన్ మెకల్లమ్ కేకేఆర్‌కు అసిస్టెంట్ కోచ్‌గా సేవలందించనున్నాడు. ఇటీవల అన్ని రకాల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన మెకల్లమ్ కోచ్ అవతారం ఎత్తనున్నాడు. ఐపీఎల్‌తో పాటు కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో ట్రినిబాగో టీమ్‌కు అతడు హెడ్‌కోచ్‌గా వ్యవహరించనున్నాడు.

పాట్నా మూడో గెలుపు

యూపీ యోధాపై పైరేట్స్ విజయం

పాట్నా: సొంతగడ్డపై ఆడిన చివరి లీగ్ మ్యాచ్‌లో పాట్నా పైరేట్స్ సత్తాచాటింది. స్టార్ రైడర్, 'డబ్బీ కింగ్'పర్దీప్ నర్వాల్ విజృంభించడంతో పాట్నా 41-20తో యూపీ యోధాను చిత్తు చేసింది. ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో పైరేట్స్‌కు ఇది మూడో విజయం. మ్యాచ్ ఆరంభం నుంచే ఆధిపత్యం కనబర్చిన పైరేట్స్ చివరి వరకు అదే జోరు కొనసాగించింది. రైడింగ్‌లో పాట్నాకు కాస్త పోటీ ఇవ్వగలిగిన యోధా.. ట్యాక్లింగ్‌లో మాత్రం పూర్తిగా నిరాశ పర్చింది. మ్యాచ్ మొత్తంలో పైరేట్స్16 ట్యాకిల్ పాయింట్లు సాధిస్తే.. యూపీ 4 పాయింట్లతోనే సరిపెట్టుకుంది. పాట్నా కెప్టెన్ పర్దీప్ 12 పాయింట్లతో చెలరేగితే.. నీరజ్ కుమార్ (8 పాయింట్లు), జాంగ్ కున్ లీ (5 పాయింట్లు) ఆకట్టుకున్నారు. యూపీ తరపున మోనూ గోయత్ (4 పాయింట్లు) నిరాశ పరచడం ఫలితంపై ప్రభావం చూపింది. తొలి పది నిమిషాల ఆట పూర్తయ్యేసరికే పాట్నా 11-3తో స్పష్టమైన ఆధిక్యం సాధించింది. హాఫ్ టైమ్‌కు ముందే యూపీ జట్టు రెండు సార్లు ఆలౌట్ కావడంతో అర్ధభాగం ముగిసే సమయానికి పాట్నా 24-9తో ముందంజలో నిలిచింది. రెండో సగంలోనూ చక్కటి ప్రదర్శన కనబర్చిన పైరేట్స్ మరోసారి ప్రత్యర్థిని ఆలౌట్ చేసి విజయాన్ని పరిపూర్ణం చేసుకుంది. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 32-30తో యూ ముంబాపై గెలిచింది.

ప్రపంచ టైటిల్ సాధిస్తా: సింధు

పేట్ బషీరాబాద్: బాసెల్(స్విట్జర్లాండ్) వేదికగా ఈనెల 19 నుంచి మొదలయ్యే ప్రతిష్ఠాత్మక ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ సాధిస్తానని స్టార్ షట్లర్ పీవీ సింధు తెలిపింది. కుత్బుల్లాపూర్ సర్కిల్ సుచిత్ర అకాడమీలో సింధు శిక్షణ తీసుకుంటున్నది. ఈ విషయం తెలుసుకున్న మలేషియా బ్యాడ్మింటన్ క్రీడాకారులు శుక్రవారం ఆమెను కలిసి ఆటలో పలు మెళకువలు అడిగి తెలుసుకున్నారు. తర్వాత నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సింధు మాట్లాడుతూ అత్యాధునిక హంగులతో విక్టరీ శిక్షణ కేంద్రం ఉందని పేర్కొంది.

ఖోఖోలో హైదరాబాద్ అదుర్స్

కాగజ్‌నగర్ టౌన్: నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ స్థాయి ఖోఖో పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నవోదయ విద్యాలయం డిప్యూటీ కమిషనర్ ఉమామహేశ్వర్ రావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తొలి రోజు జరిగిన అండర్-14 బాలుర విభాగంలో హైదరాబాద్ 7-6తో పుణెపై విజయం సాధించింది. మరోవైపు అండర్-19 బాలుర కేటగిరీలో హైదరాబాద్ 14-12తో పుణెను ఓడించి ముందంజ వేసింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చక్రపాణి, శ్రీనివాస్‌రావు, సంజయ్‌కుమార్, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సెన్సెక్స్	నిఫ్టీ
37,582	11,109
254	77

ముడి చమురు (బ్రెంట్) 58.71 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ (రూ.లలో)

24 క్యారెట్లు	38,330
22 క్యారెట్లు	38,160
వెండి (కిలో)	44,010

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	67.50	73.00
యూరో	75.00	81.50
బహ్రెయిన్ దినార్	175.00	188.00
కువైట్ దినార్	220.00	232.00
సౌదీ రియాల్	17.40	19.20
యూఏఈ దిర్హామ్	17.80	19.50

వృద్ధికి సంస్కరణలే ఊతం

కేంద్రం, ఆర్బీఐలు ఆ దిశగా కృషి • కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, ఆగస్టు 9:

ఆర్థిక వ్యవస్థకు మరింత బూస్ట్‌నివ్వడానికి కేంద్ర ప్రభుత్వం, రిజర్వుబ్యాంకులు గట్టిగా కృషి చేస్తున్నాయని పారిశ్రామిక వర్గాలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారు. భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ఆరేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన వృద్ధికి ఊతమివ్వడానికి వచ్చే కొద్ది రోజుల్లో కీలక రంగాల్లో సంస్కరణలు తీసుకురానున్నట్లు, తద్వారా వృద్ధి మళ్లీ మెయిన్ ట్రాక్‌లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో సంపన్న వర్గాలపై సర్‌చార్జ్ విధించడంతో విదేశీ పెట్టుబడిదారుల్లో నెలకొన్న ఆందోళనను తగ్గించడానికి మంత్రి..శుక్రవారం ఎఫ్‌పీఐలు, ఇతర పెట్టుబడిదారులతో కూడా సమావేశమయ్యారు. ముఖ్యంగా పన్ను వేధింపులపై పడుతున్న మనోవేదనలకు సంబంధించి వాటిపై ప్రధానంగా చర్చించనున్నట్లు ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. ప్రపంచ దేశాల్లో ఇప్పటికీ అతి వేగవంతమైన వృద్ధిని నమోదు చేసుకుంటున్న భారత్‌ను మరో ఉన్నత శిఖరాలకు చేర్చడానికి సెంట్రల్ బ్యాంక్, ప్రభుత్వం కలిసి పనిచేస్తున్నాయన్నారు.

సీఐఐ ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. చిత్రంలో సీఐఐ ప్రెసిడెంట్ ఉదయ్ కొటక్, వైస్ ప్రెసిడెంట్ టీవీ నరేంద్రన్, డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ

పారిశ్రామిక వర్గాలపై ప్రత్యేక దృష్టి

పారిశ్రామిక వర్గాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడు కృషి చేస్తున్నదని, ముఖ్యంగా వాహన విక్రయాలు పడిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటోమొబైల్ సంస్థలకు ఊతమివ్వడానికి త్వరలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నదని మంత్రి సంకేతాలిచ్చారు. బ్యాంకింగేతర ఆర్థిక సేవల సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యపై మంత్రి ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సమస్యల సుడిగుండం నుంచి బయటపడేందుకు త్వరలో చర్యలు తీసుకోబోతున్నట్లు ఆమె సంకేతాలిచ్చారు. ఇన్వెస్టర్లు లేవనెత్తిన పలు అంశాలపై తిరిగి దృష్టి సారించనున్నట్లు వారికి మంత్రి హామీ ఇచ్చారు. సంపన్న వర్గాలపై విధించిన సర్‌చార్జ్‌ని ఎత్తివేయాలని ఇండస్ట్రీ వర్గాలు ఈ సందర్భంగా మంత్రికి సూచించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆమె..త్వరలో జరుగబోయే సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు.

జీఎస్టీ తగ్గించండి: సియామ్

అమ్మకాలు పడిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటోమొబైల్ వాహన తయారీ సంస్థలు నేరుగా ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నాయి. వాహనాలపై విధిస్తున్న జీఎస్టీని వెంటనే 18 శాతానికి తగ్గించాలని దేశీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నది. ఇటీవల ఆర్థిక మంత్రితో జరిగిన సమావేశంలో ఇదే విషయాన్ని స్పష్టం చేయడంజరిగిందని సియామ్ ప్రెసిడెంట్ రాజన్ వాధేరా తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి అమలులోకి రానున్న బీఎస్-6 ప్రమాణాలు అమలుచేయాలంటే ప్రస్తుతం జీఎస్టీని తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బజాజ్ ఆటో ఎండీ రాజీవ్ బజాజ్ పేర్కొన్నారు. ప్రస్తుతం వాహనాలపై 28 శాతం జీఎస్టీతోపాటు 22 శాతంవరకు అదనపు సెస్‌ను విధిస్తున్నారు. మరోవైపు వాహనాలకు డిమాండ్ పడిపోవడంతో ఉత్పత్తిని భారీ స్థాయిలో తగ్గించుకుంటున్నా యి సంస్థలు. ఇప్పటికే మారుతి తగ్గించుకోగా.. తాజాగా ఈ జాబితాలోకి టాటా మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రాలు వచ్చి చేరాయి. ప్రస్తుత త్రైమాసికంలో మహీంద్రా ఏకంగా 8 నుంచి 14 రోజుల వరకు ఉత్పత్తిని నిలిపివేస్తున్నట్లు ప్రకటించగా..టాటా మోటర్స్ కూడా డిమాండ్ లేకపోవడంతో ఉత్పత్తిని నిలిపివేస్తున్నట్లు సంకేతాలిచ్చింది.

పారిశ్రామిక పరుగుకు బ్రేక్

- నాలుగు నెలల కనిష్ఠానికి వృద్ధి
- జూన్ నెలలో 2 శాతంగా నమోదు
- దెబ్బతీసిన గనులు, తయారీ రంగాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 9: పారిశ్రామిక పరుగుకు బ్రేకులు పడ్డాయి. గనులు, తయారీ రంగాల్లో నెలకొన్న మందకొడి వృద్ధి కారణంగా జూన్ నెలలో పారిశ్రామిక వృద్ధిరేటు నాలుగు నెలల కనిష్ఠ స్థాయి 2 శాతానికి జారుకున్నది. శుక్రవారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. 2018 ఏడాది ఇదే నెలలో పారిశ్రామిక వృద్ధి 7 శాతంగా ఉన్నది. ప్రస్తుతం సంవత్సరం ఫిబ్రవరి నెలలో నమోదైన వృద్ధి తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి. అప్పట్లో ఇది 0.2 శాతం. ఆ తర్వాతి నెల(మార్చి)లో 2.7 శాతంగా నమోదైన పారిశ్రామికం..ఏప్రిల్‌లో 4.3 శాతంగాను, మే నెలలో 4.6 శాతంగా నమోదయ్యాయి. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను పారిశ్రామిక ప్రగతి 3.6 శాతంగా ఉన్నది. అంతక్రితం ఏడాది నమోదైన 5.1 శాతంతో పోలిస్తే ఇది తక్కువ. తయారీ రంగంలో నెలకొన్న మందకొడి కారణంగా వృద్ధికి బ్రేక్‌పడిందని తెలిపింది. జూన్ నెలలో తయారీ రంగ పనితీరు 1.2 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇది 6.9 శాతంగా ఉన్నది. అలాగే పెట్టుబడులకు గిటురాయి అయిన క్యాపిటల్ గూడ్స్ వృద్ధి కూడా 9.7 శాతం నుంచి 6.5 శాతానికి పడిపోగా..మైనింగ్ 1.6 శాతానికి జారుకున్నది. అలాగే, విద్యుత్ రంగంలో వృద్ధి 8.2 శాతంగాను, ప్రాథమిక వస్తువులు 0.5 శాతం, మౌలిక సదుపాయాలు/నిర్మాణ రంగ వస్తువుల్లో వృద్ధి 0.8 శాతానికి పరిమితమైంది. కన్జ్యూమర్ గూడ్స్, నాన్-డ్యూరబుల్ రికార్డు స్థాయి పనితీరును కనబరిచాయి. 23 రంగాల్లో ఎనిమిది వృద్ధిని నమోదు చేసుకోగా, మిగతావి ప్రతికూలానికి పడిపోయాయి. ఇండస్ట్రీ గ్రూపునకు చెందిన తయారీ రంగం అత్యధిక వృద్ధి 17.7 శాతం నమోదు చేసుకోగా, ఆహార ఉత్పత్తులు 16.5 శాతం, పొగాకు ఉత్పత్తులు 10.3 శాతం చొప్పున పనితీరు కనబరిచాయి.



హైదరాబాద్‌లో 'సర్వీస్‌నౌ'

- ప్రారంభించిన ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్

హైదరాబాద్, ఆగస్టు 9: అమెరికాకు చెందిన ప్రముఖ టెక్నాలజీ సేవల సంస్థ సర్వీస్‌నౌ.. ప్రపంచంలో రెండో అతిపెద్ద సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ ఇంజినీరింగ్ హెడ్ రావు సూరపనేని మాట్లాడుతూ..నాలుగేండ్ల క్రితం కేవలం ఇద్దరు సిబ్బందితో ప్రారంభమైన సెంటర్ ప్రస్తుతం వేలాది మందికి ఉపాధి కల్పించేస్థాయికి ఎదిగిందన్నారు. అమెరికా తర్వాత ఏర్పాటైన ఈ అతిపెద్ద సెంటర్‌లో రెండు వేలకు పైగా మంది విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐటీ రంగంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న చొరవ వల్లనే గడిచిన ఐదేండ్లలో వ్యాపారాన్ని శరవేగంగా విస్తరించినట్లు, ఇక్కడ నైపుణ్యం కలిగిన వారు అత్యధిక మంది లభిస్తుండటం కూడా సెంటర్‌ను విస్తరించడానికి పరోక్షంగా దోహదం చేసిందన్నారు. వచ్చే తొమ్మిది నుంచి 12 నెలల్లో మరో అతిపెద్ద సెంటర్‌ను ఇక్కడే నెలకొల్పే అవకాశం ఉందన్నారు. 80 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 400 నుంచి 600 మంది సిబ్బంది పనిచేసుకోవచ్చునని చెప్పారు.

ఏడాదిలోగా 1,200 మంది సిబ్బంది

టెక్నాలజీ రంగానికి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని సంస్థ వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. ఇప్పటికే హైదరాబాద్ ఐటీ క్లస్టర్‌లో అతిపెద్ద సర్వీసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన సంస్థ..వచ్చే ఏడాదిలోగా మరో కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ నూతన సెంటర్ ద్వారా మరో 1,200 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ సెంటర్ కంపెనీ నూతన ఆవిష్కరణలు, విధానాల్లో కీలక పాత్ర పోషించనున్నది. కృత్రిమ మేధస్సు, అధునాతన సౌలభ్యాలపై కృషి చేయడమే కాకుండా..భవిష్యత్తులో ఉద్యోగులు మెరుగైన రీతిలో పనిచేసేందుకు అనువైన పరిస్థితులను కల్పించనున్నట్లు చెప్పారు.

ప్రపంచంలో రెండో అతిపెద్ద సెంటర్ ఏర్పాటు

హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సర్వీస్‌నౌ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్. చిత్రంలో కంపెనీ సీనియర్ డైరెక్టర్ రాధా శ్రీనివాస్, ఇతర ఉన్నతాధికారులు

టాస్క్‌లోకి 100 కాలేజీలు: జయేశ్ రంజన్

రాష్ట్రంలో నైపుణ్యం శిక్షణ ఇవ్వడానికి ఏర్పాటైన టాస్క్‌లో మరికొన్ని కళాశాలను చేర్చనున్నట్లు జయేశ్ రంజన్ చెప్పారు. ప్రస్తుతం ఈ టాస్క్‌లో 20 కాలేజీలు ఉండగా..ఈ ఏడాది చివరినాటికి వీటిని 100కి పెంచాలనుకుంటున్నట్లు సర్వీస్‌నౌ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన చెప్పారు. టాస్క్ ద్వారా శిక్షణ పొందిన వారిలో ఎంతో మంది ఉపాధి అవకాశాలు లభించాయని, ముఖ్యంగా సర్వీస్‌నౌ కూడా పలువురు ఉద్యోగులను రిక్రూట్ చేసుకున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

ఎన్‌డీటీవీ ప్రమోటర్లకు గట్టి షాక్

- విదేశాలకు వెళ్ళకుండా ముంబై ఎయిర్‌పోర్టులో అదుపులోకి

ముంబై, ఆగస్టు 9: ఎన్‌డీటీవీ వ్యవస్థాపకుడు ప్రణయ్ రాయ్, ఆయన భార్య రాధికాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. విదేశాలకు వెళ్లేందుకు ముంబై విమానాశ్రయానికి చేరుకున్న వీరిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ దాఖలు చేసిన అవినీతి కేసునకు సంబంధించి వీరిని విదేశాలకు వెళ్లనీయకుండా పోలీసు వర్గాలు అడ్డుకున్నట్లు తెలుస్తున్నది. ఈ నెల 16న భారత్‌కు తిరిగిరానున్న వీరిద్దరు ఎక్కడికి వెళ్లతున్నారో మాత్రం తెలియరాలేదు. వీరిద్దరి అదుపులోని తీసుకున్న విషయంపై ముంబై విమానాశ్రయ వర్గాలు స్పందించడానికి నిరాకరించాయి. నెలరోజుల క్రితం జెట్ ఎయిర్‌వేస్ అధినేత నరేష్ గోయల్ కూడా విదేశాలకు పారిపోవాలని చూశారు. కానీ, పోలీసులు అడ్డుకోవడంతో ఆయన వెనక్కితగ్గాల్సి వచ్చింది. బ్యాంకును మోసం చేసిన కేసులో రాయ్‌కు సంబంధించిన ఆస్తులపై ఇటీవల సీబీఐ దాడుల చేసిన విషయం తెలిసిందే.

పటన్‌చెరులో అయాన్ పరిశోధన కేంద్రం

రూ.30 కోట్లతో ఏర్పాటు చేసిన సంస్థ

హైదరాబాద్, ఆగస్టు 9: నీటి శుద్ధి పరికరాలు, కెమికల్స్ తయారీ సంస్థ అయాన్ ఎక్స్చేంజ్..హైదరాబాద్‌కు అత్యంత సమీపంలోని పటన్‌చెరు వద్ద నూతన పరిశోధన కేంద్రాన్ని ప్రారంభించింది. 24 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ ఆర్ అండ్ డీ కోసం రూ.30 కోట్ల నిధులను ఖర్చు చేసినట్లు కంపెనీ చైర్మన్, ఎండీ రాజేశ్ శర్మ చెప్పారు. ప్రస్తుతం ఈ సెంటర్‌లో 29 మంది సైంటిస్టులు విధులు నిర్వహిస్తుండగా, త్వరలో ఈ సంఖ్యను 45కి పెంచుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ.1,195 కోట్ల ఆదాయంపై రూ.65 కోట్ల లాభా న్ని గడించింది. ఈసారి రూ. 1,500 కోట్లకు చేరుకునే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌తోపాటు ముంబైలో ఉన్న పరిశోధన కేంద్రాల్లో 60 మంది సిబ్బంది ఉండగా, త్వరలో ఈ సంఖ్యను 75కి పెంచుకోవాలని చూస్తున్నది. ఇకనుంచి ప్రతియేటా రెండు నుంచి మూడు ఉత్పత్తులను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.

మార్కెట్లకు ఉద్దీపనల కిక్కు

ముంబై, ఆగస్టు 9: వరుసగా రెండోరోజు స్టాక్ మార్కెట్లు లాభాల బాటపట్టాయి. దిగజారుతున్న దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడానికి కేంద్ర ప్రభుత్వం త్వరలో ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు వచ్చిన వార్తలు మదుపరుల్లో జోష్ పెంచింది. ఫలితంగా వారాంతం ట్రేడింగ్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ భారీగా లాభపడింది. ఒక దశలో 480 పాయింట్లకు పైగా లాభపడిన సూచీ చివరకు 254.55 పాయింట్లు ఎగబాకి 37,581.91 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ నిఫ్టీ మరో 77.20 పాయింట్లు అందుకొని 11,019.65 వద్దకు చేరుకున్నది. ఈవారంలో సెన్సెక్స్ 463.69 పాయింట్లు, నిఫ్టీ 112.30 పాయింట్లు ఎగబాకాయి. బడ్జెట్‌లో విధించిన సర్‌చార్జీని ఎత్తివేసే అవకాశాలున్నట్లు వచ్చిన వార్తలు కూడా మార్కెట్లలో కొనుగోళ్లకు జోష్‌నిచ్చిందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. మారుతి, బజాజ్ ఫైనాన్స్, వేదాంతా, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌యూఎల్, కొటక్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌ల షేర్లు 3.36 శాతం వరకు లాభపడ్డాయి. మరోవైపు యెస్ బ్యాంక్ 7.91 శాతం పతనం చెంది టాప్ లూజర్‌గా నిలిచింది. వీటితోపాటు టెక్ మహీంద్రా, టాటా మోటర్స్, టాటా స్టీల్, ఐటీసీ, సన్ ఫార్మాలు 2.50 శాతం వరకు మార్కెట్ వాటాను కోల్పోయాయి. ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించడానికి త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోబోతున్న కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఐటీ, ఇతర స్టాక్‌ల్లో ర్యాలీ కొనసాగింది.

254 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ శాఖ
జిల్లా కలెక్టరు, వరంగల్ (గ్రామీణ) గారి ప్రకటన

ఫారం - సి
నోటిఫికేషన్

(కేంద్ర చట్టం 30/2013 యొక్క సెక్షన్ 11 ప్రకారం 10 ఎ మినహాయింపు పొందినందున) (రూల్ 6/12 అనుసరించి)

వరంగల్ (గ్రామీణ) జిల్లా రాయపర్తి మం. 13వరంగల్ (గ్రామీణ)-2019 తేదీ: 03-08-2019
శ్రీమతి జిల్లా కలెక్టరు, వరంగల్ (గ్రామీణ) వారి ఆజ్ఞల మే. జి/164/2019 తేదీ: 02-08-2019
జి.ఓ.మి.నెం. జి/164/2019 తేదీ: 02-08-2019

ఈ దిగువ నిర్దిష్ట పరిచిన వరంగల్ జిల్లా (గ్రామీణ) సంగెం మండలం తీగరాజుపల్లి గ్రామ శివారు లోని సీస్మిర్వం ఎ. 07-18 గుంటలు భూమి ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా ఎనుగల్ చెరువుకు ఫీడర్ ఛానల్ తవ్వకం కొరకు OT @ 265.900 కి.మీ. ఈ దిగువ చూపిన పట్టా భూములు అవసరము అయి ఉన్నదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / కలెక్టర్ వరంగల్ (గ్రామీణ) భావించినందున భూసేకరణలో సముచిత పరిహారం మరియు పారదర్శకత పునరావాసం పాక్షు చట్టం, పునరావాస, 2013 మరియు సవరణ చట్టం 2016 లోని సెక్షన్ 11 (1) అనుసరించి ప్రకటన జారీచేయనైనది.

జిల్లా ప్రజా ప్రయోజనార్థం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సవరణ చట్టం 2016 (చట్టము నెం. 21.2017) ద్వారా సవరించబడిన భూసేకరణ ద్వారా పునరావాస, పునరుపాధి కల్పనకు మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే చట్టం 2013 ప్రకారం ప్రభుత్వ ఉత్తర్వులు నె. 51 ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ (IP & INF) డిపార్టుమెంట్ తేది, 01-08-2017 ద్వారా సెక్షన్ 10-ఎ చట్టం పరిధిలో ఉన్నందున కాస్టర్-2 లోని సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక మరియు కాస్టర్-3 ప్రకారం ఆహార భద్రత పరిరక్షణ మినహాయింపు ఉన్నందున మరియు ప్రభుత్వం ద్వారా జి.ఓ. 120, తేది 30-06-2017 నందు ప్రకటించిన ప్రకారం ఈ దిగువ పేర్కొనిన భూములకై ప్రకటన జారీ చేయనైనది.

గ్రామము: తీగరాజుపల్లి మండలము: సంగెం జిల్లా: వరంగల్ (గ్రామీణ)

క్రమ సంఖ్య	సర్వే నెం.	పట్టా / ఉపనెం	భూమి రకం	సబ్ డివిజన్ విస్తీర్ణము	భూమి యజమాని / అనుభవదారులు / ప్రస్తుతం మెళుకువ ఉన్న వారి పేర్లు	క్షమాపణ కోసం సైట్ ఫోటో
1	2	3	4	5	6	7
1	187	పట్టా	ఖుష్కి	1-04	పట్టాదారులు పాలకుర్తి లావణ్య భర్త అజయ్ రంగరాజు నరసింహారావు తండ్రి రాఘవరావు మైదం ఎల్లగౌడ్ తండ్రి నర్సయ్య మైదం కుమారస్వామి తండ్రి రామస్వామి మైదం రాజు తండ్రి శ్రీహరి అనుభవదారులు పాలకుర్తి లావణ్య భర్త అజయ్ రంగరాజు నరసింహారావు తండ్రి రాఘవరావు మైదం ఎల్లగౌడ్ తండ్రి నర్సయ్య మైదం కుమారస్వామి తండ్రి రామస్వామి మైదం రాజు తండ్రి శ్రీహరి ప్రస్తుతం మెళుకువ ఉన్నవారు మైదం ఎల్లగౌడ్ మైదం కుమారస్వామి తండ్రి రామస్వామి పోశబోయిన మహేశస్వామి తండ్రి గట్టయ్య మైదం రాజు తండ్రి శ్రీహరి	భావుడు -3
2	189	పట్టా	ఖుష్కి	0-02	పట్టాదారులు పోశబోయిన గట్టయ్య తండ్రి కొరయ్య అనుభవదారులు పోశబోయిన గట్టయ్య తండ్రి కొరయ్య ప్రస్తుతం మెళుకువ ఉన్నవారు మైదం కుమారస్వామి తండ్రి రామస్వామి	--
3	190	పట్టా	ఖుష్కి	0-24	పట్టాదారులు రంగరాజు శ్యాంసుందర్ తండ్రి మురళీధర్ పోశబోయిన గట్టయ్య తండ్రి కొరయ్య రంగరాజు వేణుమాధవరావు తండ్రి మురళీధర్ రావు రంగరాజు రత్నాకర్ తండ్రి మురళీధర్ అనుభవదారులు రంగరాజు శ్యాంసుందర్ తండ్రి మురళీధర్ పోశబోయిన గట్టయ్య తండ్రి కొరయ్య రంగరాజు వేణుమాధవరావు తండ్రి మురళీధర్ రావు రంగరాజు రత్నాకర్ తండ్రి మురళీధర్ ప్రస్తుతం మెళుకువ ఉన్నవారు పోశబోయిన గట్టయ్య తండ్రి కొరయ్య ఆర్. శ్యాంసుందర్	--
4	195	పట్టా	ఖుష్కి	0-08	పట్టాదారులు రంగరాజు రత్నాకర్ తండ్రి మురళీధర్ రామమల్ల రాజలింగం తండ్రి చిన్న రాజయ్య రంగరాజు గోపాల కిషన్ రావు తండ్రి జనార్దన్ రావు మైదం రవీందర్ తండ్రి నర్సయ్య పాల్య రమ తండ్రి భిక్ష రంగరాజు వేణుమాధవరావు తండ్రి మురళీధర్‌రావు బనోత్ భీమ తండ్రి సీత అనుభవదారులు రంగరాజు రత్నాకర్ తండ్రి మురళీధర్ రామమల్ల రాజలింగం తండ్రి చిన్న రాజయ్య రంగరాజు గోపాల కిషన్ రావు తండ్రి జనార్దన్ రావు రంగరాజు శ్యాంసుందర్ తండ్రి శ్రీనివాస్ మైదం రవీందర్ తండ్రి నర్సయ్య పాల్య రమ తండ్రి భిక్ష రంగరాజు వేణుమాధవరావు తండ్రి మురళీధర్ రావు చింపాల వీరయ్య తండ్రి రాజయ్య చింపాల రమేష్ తండ్రి వీరయ్య బనోత్ భీమ తండ్రి సీత ప్రస్తుతం మెళుకువ ఉన్నవారు పాల్య రమ తండ్రి భిక్ష	--
5	196	పట్టా	ఖుష్కి	0-18	పట్టాదారులు ఐతుల మొండయ్య తండ్రి కొరయ్య చింపాల వీరయ్య తండ్రి రాజయ్య చింపాల విశోధ భర్త లింగయ్య చింపాల రమేష్ తండ్రి వీరయ్య అనుభవదారులు ఐతుల మొండయ్య తండ్రి కొరయ్య చింపాల వీరయ్య తండ్రి రాజయ్య చింపాల విశోధ భర్త లింగయ్య చింపాల రమేష్ తండ్రి వీరయ్య ప్రస్తుతం మెళుకువ ఉన్నవారు చింపాల విశోధ భర్త లింగయ్య చింపాల రమేష్ తండ్రి వీరయ్య చింపాల విశోధ భర్త లింగయ్య చింపాల రమేష్ తండ్రి వీరయ్య	--
6	222	పట్టా	ఖుష్కి	0-02	పట్టాదారులు పాలిత్ రఘు తండ్రి భిక్ష తోపుచేర్ల కిషన్ రావు తండ్రి నర్సయ్య అనుభవదారులు పాలిత్ రఘు తండ్రి భిక్ష తోపుచేర్ల కిషన్ రావు తండ్రి నర్సయ్య ప్రస్తుతం మెళుకువ ఉన్నవారు పాలిత్ రఘు తండ్రి భిక్ష	--
7	223	పట్టా	ఖుష్కి	0-12	పట్టాదారులు పాలిత్ రఘు తండ్రి భిక్ష అనుభవదారులు పాలిత్ రఘు తండ్రి భిక్ష ప్రస్తుతం మెళుకువ ఉన్నవారు పాలిత్ రఘు తండ్రి భిక్ష	--
8	225	ప్రభుత్వ	ఖుష్కి	0-11	పట్టాదారులు బనోత్ దీనా తండ్రి మోహన్ బనోత్ కోలల్ తండ్రి చంద్రు రంగరాజు వేణుగోపాల్ తండ్రి వెంకటస్వామి ప్రస్తుతం మెళుకువ ఉన్నవారు బనోత్ యాకుబ్ రంగరాజు విజయ తండ్రి వెంకటస్వామి	--
9	404	పట్టా	ఖుష్కి	0-15	పట్టాదారులు గజ్జెల ఎల్లయ్య తండ్రి కొమరయ్య గజ్జెల బాలు తండ్రి కొమరయ్య గజ్జెల కుమారస్వామి తండ్రి కొమరయ్య బనోత్ కోలల్ తండ్రి చంద్రు గజ్జెల కొరయ్య తండ్రి మల్లేశ్వయ్య రామమల్ల ఎల్లేశం తండ్రి చిన్న రాజయ్య బనోత్ కొన్నల్ భర్త సంపు అనుభవదారులు గజ్జెల ఎల్లయ్య తండ్రి కొమరయ్య గజ్జెల బాలు తండ్రి కొమరయ్య గజ్జెల కుమారస్వామి తండ్రి కొమరయ్య బనోత్ కోలల్ తండ్రి చంద్రు గజ్జెల కొరయ్య తండ్రి మల్లేశ్వయ్య రామమల్ల ఎల్లేశం తండ్రి చిన్న రాజయ్య బనోత్ కొన్నల్ భర్త సంపు ప్రస్తుతం మెళుకువ ఉన్నవారు జి. కొరయ్య తండ్రి మొండయ్య రోడ్డు	--
10	403	పట్టా	ఖుష్కి	0-03	పట్టాదారులు గోదల మల్లేష్ తండ్రి దురయ్య గుగులోత్ వెంకన్న తండ్రి సామ్య సోలంగుడి ప్రవీణ్ తండ్రి భాస్కర్ రంగరాజు భాగ్యమ్మ భర్త సదయ్య రామమల్ల రవీందర్ తండ్రి చిన్న రాజయ్య రామమల్ల ఎల్లేశం తండ్రి చిన్న రాజయ్య రామమల్ల సాంబయ్య తండ్రి చిన్న సాంబయ్య సోలంగుడి ప్రమోద్ కుమార్ తండ్రి భాస్కర్ సోలంగుడి రామకృష్ణ తండ్రి ప్రకాశం అనుభవదారులు గోదల మల్లేష్ తండ్రి దురయ్య గుగులోత్ వెంకన్న తండ్రి సామ్య సోలంగుడి ప్రవీణ్ తండ్రి భాస్కర్ రంగరాజు భాగ్యమ్మ భర్త సదయ్య రామమల్ల రవీందర్ తండ్రి చిన్న రాజయ్య రామమల్ల ఎల్లేశం తండ్రి చిన్న రాజయ్య రామమల్ల సాంబయ్య తండ్రి చిన్న సాంబయ్య సోలంగుడి ప్రమోద్ కుమార్ తండ్రి భాస్కర్ సోలంగుడి రామకృష్ణ తండ్రి ప్రకాశం	--
11	405	పట్టా	ఖుష్కి	0-13	పట్టాదారులు బనోత్ శ్రీను తండ్రి బడి రాము బనోత్ మోహన్ తండ్రి భద్రు ఉమ్మనబోయిన లింగయ్య తండ్రి పుల్లయ్య పట్ల మంగ్య తండ్రి బుధియా పట్ల బైక తండ్రి మంగ్య రంగరాజు గోపాలకిషన్ రావు తండ్రి జనార్దన్ రావు రంగరాజు లక్ష్మీనరసింహారావు తండ్రి రామచందర్ రావు అనుభవదారులు బనోత్ శ్రీను తండ్రి బడి రాము బనోత్ మోహన్ తండ్రి భద్రు ఉమ్మనబోయిన లింగయ్య తండ్రి పుల్లయ్య పట్ల మంగ్య తండ్రి బుధియా పట్ల బైక తండ్రి మంగ్య బనోత్ బాలాజీ తండ్రి హత్య రంగరాజు లక్ష్మీనరసింహారావు తండ్రి రామచందర్ రావు ప్రస్తుతం

రసరమ్యమైన రామాయణం.. ధర్మం, నీతి, ఉత్తమ విలువలను పెంపొందించే గొప్ప ఇతిహాసమని రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ చెప్పారు. శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన ముఖ్యమంత్రి సీపీఆర్వో వనం జ్వాలా నరసింహారావు తాను రచించిన 'కిష్కింధ కాండ' గ్రంథాన్ని అందించారు. ఈ సందర్భంగా రామాయణ ఇతిహాస విశిష్టత, నీతి, ధర్మంపై ఇద్దరు సమాలోచనలు జరిపారు. - హైదరాబాద్, నమస్తే తెలంగాణ

హరితహారం కల్లుగీతకు వరం!

- 'గీత'కొస్తున్న ఈత, కజ్జూర మొక్కలు
- గిరికతాళ్లు కూడా పెంచేందుకు ఏర్పాట్లు

ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ: గీతకార్మికులకు చేయూతనిచ్చేందుకు హరితహారంలో భాగంగా నాటిన ఈత, కజ్జూర మొక్కలు ఫలితాలిస్తున్నాయి. కొన్నిచోట్ల కల్లు ఉత్పత్తి మొదలైంది. ఇప్పటివరకు నాలుగు విడుతలుగా నిర్వహించిన హరితహారంలో 2.74 కోట్ల ఈత, కజ్జూర మొక్కలను నాటారు. వీటితోపాటు ఈసారి గిరికతాళ్ల మొక్కలను కూడా నాటాలని అధికారులు నిర్ణయించారు. ఐదోవిడుత హరితహారంలో 1.83 కోట్ల ఈత, కజ్జూర, గిరికతాళ్లు మొక్కలను నాటనున్నారు. ఇందుకోసం ఆయా జిల్లాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి వెంటనే వివరాలను పంపాలని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది. నాలుగేండ్లుగా హరితహారంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో విరివిగా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి, కల్లును ఉత్పత్తిచేసే స్థాయికి చేరాయి. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల దామరగిద్దలో ప్రైవేట్‌పొలంలో హరితహారం కింద నాటిన ఈతమొక్కలు పూర్తిగా ఎదిగి కల్లును ఉత్పత్తిచేస్తున్నాయి.

దామరగిద్దలో ఏపుగా పెరిగిన ఈత మొక్కలు

తాండూరులో పలుచోట్ల ఇదే పరిస్థితి ఉన్నదని అధికారులు వెల్లడించారు. దీంతోపాటు మరి కొన్నిచోట్ల మొక్కలను నాటించి డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఉపాధిహామీ పథకం కింద కూలీలకు సాయం కూడా చేస్తున్నారు. మొదట్లో గీత కార్మికసంఘాలకు చెందిన భూముల్లో మొక్కలు నాటారు. ఆ తర్వాత ప్రభుత్వ, అటవీభూముల్లో , చెరువుగట్లు, నదులఒడ్డున లక్షలసంఖ్యలో ఈత, కజ్జూర మొక్కలను నాటారు. ప్రతి గ్రామ పంచాయతీలో మూడువేల నుంచి ఆరువేల వరకు మొక్కలను నాటాలని తాజాగా ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు 11.87 లక్షల గుంతలను తవ్వగా తాజా సమాచారం ప్రకారం 8.81లక్షల మొక్కలను నాటినట్టు అధికారులు వెల్లడించారు. మేడ్చల్, జవహర్‌నగర్, శంషాబాద్‌లో ఉపాధిహామీ పథకం కింద 64.99లక్షల మొక్కలను నర్సరీలలో సిద్ధంగా ఉంచారు.

తెలంగాణలో గిరికతాళ్లు

హరితహారంలో భాగంగా అతితక్కువ ఎత్తులో ఉండి, ఎక్కువ మొత్తంలో శ్రేష్ఠమైన కల్లును ఉత్పత్తిచేసే గిరికతాళ్ల మొక్కలను విరివిగా నాటాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఏపీలోని మారేడ్‌మిల్లి, అరకులోయ ప్రాంతాల్లో విరివిగా పెరుగుతున్న గిరికతాళ్లు నీరు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మనగలుగుతాయి. తెలంగాణలో మొదటిదశలో వరంగల్ జిల్లా పాకాలలో గిరికతాళ్లను నాటారు.

కాకా ఆశయాలను తుంగలో తొక్కిన వివేక్

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి మండిపాటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మాజీ ఎంపీ వివేక్ ఆయన తండ్రి వెంకటస్వామి ఆశయాలను తుంగలో తొక్కి బీజేపీలో చేరారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి మండిపడ్డారు. అంబేద్కర్ వాది, కాంగ్రెస్ వాది అయిన కాకా ఆశయాలకు విరుద్ధంగా వివేక్ మనువాద బీజేపీలో చేరారని శుక్రవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. పంజాగుట్టలో అంబేద్కర్ విగ్రహం పెట్టాలని డిమాండ్ చేసిన వివేక్.. అంబేద్కర్ వ్యతిరేకించిన పార్టీలో ఎందుకు చేరారని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వంలో దేశవ్యాప్తంగా దళితులపై దాడులు జరుగుతుంటే ఆయన ఆ పార్టీలో చేరడం దళితులకు ద్రోహం చేయడమేనని పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేసి, వారి ఓటమికి పనిచేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఈ కారణంగానే ఆయనకు పార్టీ టికెట్ నిరాకరించిందని స్పష్టంచేశారు.

బీజేపీలో చేరిన మాజీ ఎంపీ వివేక్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మాజీ ఎంపీ జి వివేక్ శుక్రవారం బీజేపీలో చేరారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ సమక్షంలో ఆయన ఆ పార్టీ కండువా కప్పుకొన్నారు. అంతకుముందు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డాను కలువగా.. వారు పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధాని నరేంద్రమోదీ విధానాలునచ్చి బీజేపీలో చేరినట్టు వివేక్ చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ నాయకుడు రాంమాధవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

యురేనియం తవ్వకాలతో కాలుష్యం

- ఏపీపీసీబీ అధికారులకు రిటైర్డ్ శాస్త్రవేత్తల బృందం లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యురేనియం తవ్వకాలతో ఏపీలోని కడప జిల్లాలో భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని శాస్త్రవేత్తల బృందం ఆరోపించింది. ఈ మేరకు శుక్రవారం ఏపీ కాలుష్యనియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ వివేక్ యాదవ్‌కు శాస్త్రవేత్తలు లేఖరాశారు. కడప జిల్లా వేముల మండలం మబ్బుచింతలపల్లి, కేకే కోటాలా, కనుములవారిపల్లిలో యురేనియం తవ్వకాలతో భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని వారు పేర్కొన్నారు. యురేనియం తవ్వకాలకు సోడియం కార్బోనేట్‌ను వినియోగిస్తూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని.. దీనిద్వారా భూగర్భ జలాలు కాలుష్యమవుతున్నాయని ఐఐసీటీ రిటైర్డ్ శాస్త్రవేత్త కే బాబురావు తెలిపారు. తవ్వకాలు జరిపే ప్రాంతాల్లో 2017లో కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ పర్యటించి యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) నిబంధనలు ఉల్లంఘించిందని గుర్తించిందని చెప్పారు. కాగా ఈ అంశంపై యూసీఐఎల్ స్పందిస్తూ.. చెరువులకు సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపింది. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలు పాటిస్తున్నట్టు పేర్కొన్నది.

తెలంగాణలో సుగంధద్రవ్యాల సాగుకు అవకాశాలు

- అదనపు విలువల జోడింపుతో ఎగుమతులను పరిశీలించాలి
- జాతీయ ఉద్యానశాఖ కమిషనర్ డాక్టర్ బీఎన్ఎస్ మూర్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉద్యాన పంటల ఉత్పత్తులకు విలువ జోడింపు పద్ధతులను అనుసరించడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని జాతీయ ఉద్యాన శాఖ కమిషనర్ డాక్టర్ బీఎన్ఎస్ మూర్తి చెప్పారు. తెలంగాణలో ఉద్యాన పంటల సాగుకు మంచి వాతావరణం ఉన్నదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగ అభివృద్ధికి అమలుచేస్తున్న పథకాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయని ప్రశంసించారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ఉద్యాన విశ్వవిద్యాలయంలో పసుపు, అల్లంపై అఖిల భారత పరిశోధన సమన్వయ పథకం ఏర్పాటుచేసిన సమీక్షా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణలో సుగంధద్రవ్యాల సాగుకు అనుకూలమైన ప్రాంతాలను ప్రభుత్వం ఇప్పటికే గుర్తించి పంటలకాలనీల తరహాలో ప్రోత్సహిస్తున్నదని, నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం పరిధిలోని పడ్కల్ గ్రామంలో రూ.30 కోట్లతో 'స్పైస్ పార్క్' ఏర్పాటుచేసిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నిపుణులు, శాస్త్రవేత్తలు, కమిషనర్లతో పాటు ఉద్యాన పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

జీడిమెట్ల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో పూల మొక్కలను పరిశీలిస్తున్న జాతీయ ఉద్యానశాఖ కమిషనర్ బీఎన్ఎస్ మూర్తి

సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ల సందర్శన

జాతీయ ఉద్యానశాఖ కమిషనర్ బీఎన్ఎస్ మూర్తి.. ములుగు, జీడిమెట్లలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లను సందర్శించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టిన కూరగాయల నారు, పూల మొక్కలను పరిశీలించారు.

నగదు డ్రా పరిమితి రూ.5 వేలకు పెంచండి

విద్యాశాఖకు గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పాఠశాలల నిర్వహణ కోసం బ్యాంకు నుంచి నగదు డ్రా చేసుకొనే పరిమితిని రూ.500 నుంచి రూ.5,000 పెంచాలని తెలంగాణ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల సంఘం రాష్ట్ర నాయకులు వీ సర్దార్, భానుచంద్రప్రకాశ్ శుక్రవారం విద్యాశాఖ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. పాఠశాల అవసరాలకు హెడ్‌మాస్టర్లే సొంతంగా ఖర్చులు భరించాల్సి వస్తున్నదని.. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా నగదు పరిమితిని పెంచాలని కోరారు.

చేనేత, హస్తకళలకు చేయూతనివ్వాలి

ఐకియా స్టోర్ తొలి వార్షికోత్సవంలో జయేశ్‌రంజన్

కొండాపూర్: చేనేత, హస్తకళారంగాలకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని రాష్ట్ర ఐటీ కార్యదర్శి జయేశ్‌రంజన్ అన్నారు. ఐకియా స్టోర్‌లో తెలంగాణ చేనేత, హస్తకళా ఉత్పత్తుల అమ్మకాలకు సహకరించాలని స్టోర్ యాజమాన్యాన్ని కోరారు. దీంతో కళాకారులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్ మాదాపూర్ ఐటీ కారిడార్‌లోని ఐకియా ఫర్నిచర్ స్టోర్ మొదటి వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. అతి త్వరలోనే వరంగల్‌లో 100 ఎకరాల్లో ఫర్నిచర్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నదని, ఈ పార్కులో ఐకియా స్టోర్‌ను ఏర్పాటుచేయాలని కోరారు. స్టోర్‌లో విక్రయించే వస్తువులను స్థానికులతో తయారుచేయించడం ద్వారా ఉపాధి కల్పనకు సహకరించాలన్నారు. అనంతరం ఐకియా హైదరాబాద్ స్టోర్ మేనేజర్ అరేలీ రాయ్‌మన్ మాట్లాడుతూ.. నగరంలో స్టోర్ ప్రారంభించినప్పటి నుంచి 40 లక్షల మంది సందర్శించారని చెప్పారు.

ఐకియా స్టోర్ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఐటీ కార్యదర్శి జయేశ్‌రంజన్

టీటీడీకి ఎన్నారైల విరాళం 14 కోట్లు

- అన్నప్రసాదం ట్రస్టుకు రూ.1.11 కోట్లు ఇచ్చిన హైదరాబాద్‌కు చెందిన మరో భక్తుడు

తిరుపతి, నమస్తే తెలంగాణ: అమెరికాకు చెందిన ఇద్దరు ప్రవాస భారతీయ వ్యాపారులు తిరుమల శ్రీవేంకటేశ్వరుడికి శుక్రవారం రూ.14 కోట్ల భారీ విరాళం అందజేశారు. ఆలయ అధికారుల సమాచారం మేరకు.. స్నేహితులైన ఎన్నారై వ్యాపారులు వరలక్ష్మి అమ్మవారి వ్రతం రోజు శ్రీవారిని కుటుంబ సభ్యులతోపాటు దర్శించుకున్నారు. అనంతరం టీటీడీ ప్రత్యేకాధికారి ఏవీ ధర్మారెడ్డికి రూ.14 కోట్ల డిమాండ్ డ్రాఫ్ట్‌ను అందజేస్తూ, తమ పేర్లను గుప్తంగా ఉంచాలని కోరారు. తాము ఇచ్చిన విరాళాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా సంక్షేమ ట్రస్టులకు వినియోగించాలని ఆలయ అధికారులను కోరారు. ఈ ఇద్దరు గత సంవత్సరం జూలైలోనూ రూ.13.5 కోట్లను టీటీడీ ట్రస్టులకు విరాళంగా ఇవ్వడం విశేషం. హైదరాబాద్‌కు చెందిన మరో భక్తుడు గురువారం రూ.1.11 కోట్లను టీటీడీ శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్‌కు విరాళంగా అందజేశారు. యుగమేటి రామిరెడ్డి కుటుంబసభ్యులతో శ్రీవారిని దర్శించుకుని విరాళం డిమాండ్ డ్రాఫ్ట్‌ను టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి అందజేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
శనివారం 10 ఆగస్టు 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

మహా'కీర్తి'

66వ జాతీయ చలన చిత్ర పురస్కారాల ప్రకటన | జాతీయ ఉత్తమ నటిగా కీర్తి సురేష్ | ఉత్తమ తెలుగు చిత్రం 'మహానటి' | 'రంగస్థలం' 'అ!' 'చి॥ల॥సౌ' చిత్రాలకు జాతీయ అవార్డులు

తెలుగు సినీ చరిత్రలో అసమాన నటనకు, అద్వితీయమైన సౌందర్యానికి, తెలుగుదనానికి ప్రతీకలా నిలిచిన సావిత్రి జీవితకథతో రూపొందించిన 'మహానటి' చిత్రానికి ఈ ఏడాది జాతీయ అవార్డుల్లో పంటపండింది. సావిత్రి పాత్రధారిణి కీర్తి సురేష్ ఉత్తమ నటిగా జాతీయ అవార్డును సొంతం చేసుకొని సంచలనం సృష్టించింది. శారద(నిమజ్జనం), అర్చన(దాసి), విజయశాంతి(కర్తవ్యం) తర్వాత తెలుగు సినిమా నాయిక జాతీయ ఉత్తమ నటిగా పురస్కారాన్ని పొందడం విశేషం. మూడు విభాగాల్లో అవార్డులను కైవసం చేసుకున్న 'మహానటి' చిత్రం తెలుగు చిత్రసీమ ఖ్యాతిని జాతీయస్థాయిలో ఇనుమడింపజేసింది. ఈ సినిమాతో పాటు 'రంగస్థలం', 'అ!', 'చి॥ల॥ సౌ' జాతీయ అవార్డుల్ని సొంతం చేసుకున్నాయి. 2018 సంవత్సరానికిగాను 66వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్ని శుక్రవారం ప్రకటించారు. ఉత్తమ చిత్రంగా గుజరాతీకి చెందిన 'హెల్లారో' అవార్డును కైవసం చేసుకుంది. 'అంధాధున్', 'యురి' చిత్రాలకుగాను ఆయుష్మాన్ ఖురానా, విక్కీకౌశల్ ఉత్తమ నటులుగా అవార్డుల్ని సాధించారు. హిందీ'బదాయిహో' ఉత్తమ జనరంజక చిత్రంగా నిలిచింది. 'యురి' చిత్రానికిగాను ఆదిత్యధర్ ఉత్తమ దర్శకుడిగా అవార్డును కైవసం చేసుకున్నారు. ఆనవాయితీ ప్రకారం ఈ పురస్కారాల్ని ఏప్రిల్‌లో ప్రకటించి మేలో విజేతలకు ప్రదానం చేస్తారు. అయితే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది అవార్డుల ప్రకటన ఆలస్యమైంది.

జాతీయ యవనికపై తెలుగు వెలుగులధార

ఈ ఏడాది జాతీయ పురస్కారాల్లో తెలుగు చిత్రాలు సత్తాచాటాయి. అలనాటి నటనాభినేత్రి సావిత్రి జీవిత కథతో రూపొందించిన 'మహానటి' మూడు అవార్డులను గెలుచుకొని అగ్రభాగాన నిలిచింది. ఉత్తమ ప్రాంతీయ చిత్రంతో పాటు..సినిమాలో అద్భుతాభినయాన్ని ప్రదర్శించిన కీర్తి సురేష్ జాతీయ ఉత్తమ నటిగా అవార్డును కైవసం చేసుకుంది. ఉత్తమ కాస్ట్యూమ్స్ విభాగంలో కూడా 'మహానటి' పురస్కారాన్ని సాధించింది. సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన 'రంగస్థలం' ఉత్తమ ఆడియోగ్రఫీ, రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన 'చి॥ల॥సౌ' ఉత్తమ స్క్రీన్‌ప్లే విభాగాల్లో అవార్డులను సాధించాయి. 'అ!' చిత్రం మేకప్, వీఎఫ్‌ఎక్స్ విభాగాల్లో పురస్కారాల్ని సాధించింది.

'మహానటి'కి పురస్కారాల నివాళి

తెలుగులో తొలి జీవిత కథా చిత్రంగా 'మహానటి'ని తెరకెక్కించారు. నాగ్‌అశ్విన్ దర్శకత్వం వహించారు. స్వప్నదత్, ప్రియాంకదత్ నిర్మాతలు. తెలుగు చిత్రసీమలో మహానటిగా కీర్తించబడిన సావిత్రి జీవితంలోని భిన్న కోణాల్ని ఆవిష్కరిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సాధారణ కుటుంబంలో పుట్టిన సావిత్రి ప్రేక్షక హృదయ సామ్రాజ్ఞిగా ఎలా ఎదిగింది? వ్యక్తిగత జీవితంలో ఆమె ఎదుర్కొన్న ఒడిదొడుకులు, దాంపత్య జీవితంలో ఎదుర్కొన్న కష్టాలకు హృద్యమైన దృశ్యరూపంగా ఈ చిత్రం ప్రేక్షకుల మనసుల్ని స్పృశించింది. ఓ మహోత్సవంగా సాగిన మహానటి జీవిత ఉత్థానపతనాలకు సాక్షీభూతంగా నిలిచింది. సావిత్రి వ్యక్తిగత జీవితం గురించి ప్రపంచానికి తెలియని ఎన్నో సంగతుల్ని ఈ సినిమాలో ఆవిష్కరించారు. నలభై ఐదేళ్ల సావిత్రి జీవితాన్ని మూడుగంటల్లో పరిపూర్ణంగా ఆవిష్కరించిన చిత్రంగా 'మహానటి' విశేష ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంది. 1940ల నాటి కాలమాన పరిస్థితుల్ని ఈ సినిమాలో కళ్లకు కట్టినట్లుగా చూపించారు. నేటితరానికి సావిత్రి గురించి తెలియజెప్పిన చిత్రంగా 'మహానటి' యువతరాన్ని కూడా మెప్పించింది. ఈ చిత్రానికి ఇంద్రాక్షి పట్నాయక్ కాస్ట్యూమ్స్ డిజైన్ చేశారు. ఆనాటి సంస్కృతి సంప్రదాయాలు, అభిరుచులకు అద్దం పట్టిన వస్త్రధారణను వాస్తవికంగా, యథార్థంగా చూపించారు. అందుకుగాను ఉత్తమ కాస్ట్యూమ్స్ విభాగంలో కూడా 'మహానటి' అవార్డును సొంతం చేసుకుంది.

'కీర్తి'కిరీటంలో కలికితురాయి..

చిత్రసీమలో అరంగేట్రం చేసిన అనతికాలంలోనే జాతీయ అవార్డును సొంతం చేసుకొని మలయాళీ సోయగం కీర్తి సురేష్ సంచలనం సృష్టించింది. కేవలం పది సినిమాల అనుభవం ఉన్న నాయిక భిన్న పార్శ్వాలు కలిగిన మహానటి పాత్రకు ఎలా న్యాయం చేస్తుందో అని అందరూ సంశయం వ్యక్తం చేశారు. అందరి అనుమానాల్ని పటాపంచలు చేస్తూ సావిత్రి పాత్రకు ప్రాణప్రతిష్ట చేసింది కీర్తిసురేష్. అసాధారణ అభినయంతో అందరి మన్ననలు దక్కించుకుంది. అభినవ సావిత్రి అంటూ ఆమెను ప్రేక్షకులు ప్రశంసించడం మొదలు పెట్టారు. కీర్తిసురేష్ నాన్న మలయాళంలో మంచిపేరున్న నిర్మాత. అమ్మ మేనక కథానాయికగా దక్షిణాదిలో సుపరిచితురాలు. తండ్రి నిర్మించిన పైలట్స్ (2000), కుబేరన్ (2002) చిత్రాల్లో బాలనటిగా కనిపించింది. నాలుగో తరగతి వరకు చెన్నైలో విద్యాభ్యాసం చేసిన కీర్తిసురేష్ తిరువనంతపురంలోని కేంద్రియ విద్యాలయంలో ప్లస్‌టూ చదివారు. అనంతరం చెన్నైలో ఫ్యాషన్ డిజైనింగ్‌లో డిగ్రీ చేశారు. ప్రియదర్శన్ దర్శకత్వంలో రూపొందిన మలయాళ చిత్రం 'గీతాంజలి' ద్వారా కథానాయికగా అరంగేట్రం చేశారు. తొలి చిత్రంలోనే ద్విపాత్రాభినయంతో మెప్పించింది. 'నేను శైలజ' (2016) చిత్రం ద్వారా తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేసింది కీర్తి సురేష్. శైలజ పాత్రలో అమాయకత్వం, తెలుగు అందాన్ని స్ఫురించే రూపంతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ఆ తర్వాత తెలుగులో 'నేను లోకల్' 'అజ్ఞాతవాసి' చిత్రాల్లో నటించింది. అనంతరం 'మహానటి'లో అవకాశాన్ని సొంతం చేసుకుంది. ప్రస్తుతం కీర్తిసురేష్ తెలుగులో ఓ స్పోర్ట్స్ డ్రామాతో పాటు ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నది. ఆమె అతిథి పాత్రలో మెరిసిన 'మన్మథుడు-2' శుక్రవారమే ప్రేక్షకుల ముందుకొచ్చింది.

> 'మహానటి'లో సావిత్రి పాత్రకు ఎంపిక చేసినప్పుడు ఆ పాత్రకు సరిపోనని కొంతమంది విమర్శించిన సంగతి నాకు తెలిసింది. 'మహానటి' సినిమాను ధైర్యంగా ఒప్పుకున్నా నాలో తెలియని టెన్షన్ వుండేది. సరిగ్గా నిద్రకూడా పట్టేది కాదు. సినిమా ఫస్ట్‌లుక్, టీజర్ విడుదల తర్వాత అందరూ సావిత్రి పాత్రకు కీర్తిసురేష్ సరైన ఎంపిక అని ప్రశంసించినప్పుడు కాస్త ఆనందం కలిగింది. మహానటి సావిత్రి పాత్రను పోషించడం పెద్ద బాధ్యతగా ఫీలయ్యాను. సావిత్రమ్మ పేరు చెడగొట్టకుండా చేయాలి అనుకునేదాన్ని. నేడు ఆమె పాత్ర ద్వారా నాకు జాతీయఅవార్డు రావడం ఎంతో సంతోషంగా వుంది.

మహిళా సాధికారతకు పట్టం 'హెల్లారో'

అభిషేక్‌షా దర్శకత్వంలో రూపొందిన 'హెల్లారో' ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. మహిళా సాధికారత అంశాన్ని చర్చిస్తూ మానవీయ కోణంలో ఈ చిత్రాన్ని రూపొందించారు. శ్రద్ధా డంగర్, జయేష్‌మోర్, తేజల్ పంచాత్రా ప్రధాన పాత్రల్లో నటించారు. పురుషస్వామ్య వ్యవస్థలో స్త్రీలు ఎదుర్కొంటున్న వివక్షను ఈ చిత్రంలో చర్చించారు. మహిళలు ప్రతీరంగంలో స్వీయవ్యక్తీకరణతో పురోగమించాలనే సందేశాన్ని అందించారు. గుజరాతీ చిత్రసీమలో కొత్త ప్రయోగాలకు నాందిపలికిన సినిమాగా 'హెల్లారో' గుర్తింపు తెచ్చుకుంది.

ఆయుష్మాన్ ఖురానా అద్భుతాభినయం

'అంధాదున్' చిత్రంలో అంధుడి పాత్రలో అద్భుతాభినయాన్ని కనబరిచాడు ఆయుష్మాన్ ఖురానా. ఈ చిత్రానికిగాను ఉత్తమ నటుల్లో ఒకరిగా ఎంపికయ్యారు. శ్రీరామ్ రాఘవన్ దర్శకత్వంలో మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ కథాంశంతో రూపొందిన ఈ చిత్రంలో ఆయుష్మాన్‌ఖురానా నటన అందరిని మెప్పించింది. నటుడిగా, గాయకుడిగా, టెలివిజన్ ప్రయోక్తగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు తెచ్చుకున్నారు అయుష్మాన్‌ఖురానా. 'విక్కీడోనర్' చిత్రంతో బాలీవుడ్‌లో అరంగేట్రం చేసిన ఆయన కెరీర్ ఆరంభం నుంచి విలక్షణ కథల్ని ఎంపిక చేసుకుంటూ సత్తాచాటుతున్నారు. బేవకూఫియాన్, ధమ్ లగాకే ఐసా, శుభ్ మంగళ్ సావ్‌ధాన్, బదాయిహో, ఆర్టికల్ 15 ఆయనకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి.

అయుష్మాన్‌ఖురానా

విక్కీ కౌశల్ పవర్‌ఫుల్ పర్‌ఫార్మెన్స్ 'యురి'

2016 యురి సర్జికల్ స్ట్రైక్స్ నేపథ్యంలో దేశభక్తి ప్రధానంగా 'యురి' చిత్రాన్ని రూపొందించారు. ఆదిత్యధర్ దర్శకుడు. ఈ చిత్రంలో ఆర్మీ అధికారిగా పవర్‌ఫుల్ పర్‌ఫార్మెన్స్ కనబరిచాడు విక్కీ కౌశల్. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అయిన విక్కీ కౌశల్ 'గ్యాంగ్స్ ఆఫ్ వస్సేపూర్' చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. 'మసాన్' 'రమన్ రాఘవ్ 2.0' 'రాజీ' ఆయనకు మంచి గుర్తింపును తెచ్చాయి. సాధారణ నటుడిగా ప్రస్థానాన్ని మొదలుపెట్టిన విక్కీ కౌశల్ 'యురి' చిత్రానికిగాను ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డును కైవసం చేసుకొని సంచలనం సృష్టించారు. ఇదే చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా ఆదిత్యధర్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈయన గతంలో 'కాబుల్ ఎక్స్‌ప్రెస్' 'డాడీ కూల్' 'ఆక్రోష్' 'తేజ్' వంటి చిత్రాల్ని రూపొందించాడు.


విక్కీ కౌశల్

'అ!' సరికొత్త ప్రపంచం

హీరో నాని నిర్మాతగా ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో రూపొందిన 'అ!' మేకప్, వీఎఫ్‌ఎక్స్ విభాగాల్లో జాతీయ పురస్కారాలను దక్కించుకున్నది. యానిమేషన్ రూపంలో టైటిల్ కార్డ్స్‌లో పాత్రల పరిచయంతో పాటు చేపపిల్లకు నాని, బోన్సాయ్ చెట్టుకు రవితేజ గళాన్ని అందించిన సన్నివేశాల్ని విజువల్ ఎఫెక్ట్స్ ద్వారా సృష్టించారు. ఇవన్నీ కొత్త ప్రపంచంలో విహరింపజేసాయి. చిన్న సినిమాలు సాంకేతికంగా అద్భుతాలు సృష్టిస్తున్నాయడానికి ఈ చిత్రం ఉదాహరణగా నిలిచింది.

సంగీత దర్శకుడిగా సత్తాచాటిన భన్సాలీ

'పద్మావత్' చిత్రానికిగానూ ఉత్తమ సంగీత దర్శకుడిగా సంజయ్‌లీలా భన్సాలీ అవార్డును దక్కించుకున్నారు. రాజస్థానీ జానపదం, అరబిక్‌తో పాటు శాస్త్రీయ సంగీత శైలుల్లో భన్సాలీ స్వరపరచిన ఈ సినిమాలోని గీతాలు ప్రజాదరణను చూరగొన్నాయి. ఈ సినిమాలోని 'బిన్తే దిల్ మిస్రియా మే' అనే గీతాన్ని ఆలపించిన గాయకుడు ఆర్జిత్‌సింగ్ మేల్ ప్లేబ్యాక్ సింగర్‌గా జాతీయ అవార్డును అందుకున్నారు.

'ప్యాడ్‌మాన్' సామాజిక సందేశం

చెన్నైకి చెందిన సామాజిక వేత్త అరుణాచలం మురుగనాథన్ జీవితం ఆధారంగా రూపొందిన బాలీవుడ్ చిత్రం 'ప్యాడ్‌మాన్' ఉత్తమ సామాజిక చిత్రంగా నేషనల్ అవార్డును సొంతం చేసుకున్నది. శానిటరీ న్యాప్‌కిన్లను తయారుచేసే క్రమంలో కథానాయకుడికి ఎదురయ్యే అవరోధాలతో స్ఫూర్తిదాయకంగా దర్శకుడు ఆర్ బాల్కీ ఈ చిత్రాన్ని రూపొందించారు.

66వ జాతీయ పురస్కారాలు

జాతీయ ఉత్తమ చిత్రం: హెల్లారో (గుజరాతి)
ఉత్తమ దర్శకుడు: ఆదిత్య ధర్(యురి)
ఉత్తమ నటుడు: ఆయుష్మాన్ ఖురానా (అంధాధున్), విక్కీకౌశల్ (యురి)
ఉత్తమనటి: కీర్తిసురేష్ (మహానటి)
ఉత్తమ హిందీ చిత్రం: అంధాధున్
ఉత్తమ తెలుగు చిత్రం: మహానటి
ఉత్తమ మరాఠీ చిత్రం: భోంగా
ఉత్తమ సహాయ నటుడు: స్వానంద్ కిర్‌కిరే (చంబక్)
ఉత్తమ సహాయనటి: సురేఖా సిక్రీ (బదాయ్ హో)
ఉత్తమ పర్యావరణ పరిరక్షణ నేపథ్య చిత్రం: పానీ (మరాఠీ)
ఉత్తమ సామాజిక చిత్రం: ప్యాడ్‌మ్యాన్
ఉత్తమ వినోదాత్మక చిత్రం : బదాయ్ హో
ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు: సుధాకర్‌రెడ్డి యక్కంటి (నాల్ మరాఠీ చిత్రం)
ఉత్తమ ఛాయాగ్రహణం: ఎం.జె. రాధాకృష్ణ ('ఓలు' మలయాళం)
ఉత్తమ ఉర్దూ చిత్రం: హమీద్
ఉత్తమ సంగీత దర్శకుడు: సంజయ్ లీలా భన్సాలీ (పద్మావత్)
ఉత్తమ యాక్షన్ డైరెక్టర్ : విక్రమ్, అన్బు అరివు(కేజీఎఫ్)
ఉత్తమ ఆడియోగ్రఫీ: రంగస్థలం (రాజా కృష్ణన్)
ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే చిత్రం: చి॥ల॥సౌ
ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్ : 'అ!' (తెలుగు), ' కేజీఎఫ్' (కన్నడ)
ఉత్తమ సాహిత్యం: మంజునాథ్ ('నాతిచరామి' కన్నడ)
ఉత్తమ మేకప్: రంజిత్ ('అ!')
ఉత్తమ నేపథ్య సంగీతం: శశ్వత్ సచ్‌దేవ్ (యురి ది సర్జికల్ స్ట్రైక్స్)
ఉత్తమ ఆడియోగ్రఫీ: బిశ్వజీత్ దీపక్ ఛటర్జీ (యురి ది సర్జికల్ స్ట్రైక్స్)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: ఇంద్రాక్షి పట్నాయక్, గౌరంగ్ షా, అర్చనా రావు (మహానటి)
ఉత్తమ ప్రొడక్షన్ డిజైనర్: బంగాలన్ ('కమ్మార సంభవం' మలయాళం)
ఉత్తమ ఎడిటింగ్: నాగేంద్ర కె. ఉజ్జాని ('నాతిచరామి' కన్నడ)
ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే: అంధాధున్
ఉత్తమ సంభాషణల రచయిత: చుర్మీ గంగూలీ ('తారీఖ్' బెంగాలీ)

బాధ్యతను పెంచింది

కాజల్ అగర్వాల్, నిత్యామీనన్, రెజీనా , ఈషా రెబ్బా, ప్రియదర్శి, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'అ!'. ప్రశాంత్‌వర్మ దర్శకుడిగా పరిచయమైన ఈ చిత్రాన్ని హీరో నాని, ప్రశాంతి త్రిపురనేని సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రానికి 66వ జాతీయ పురస్కారాల్లో ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్, ఉత్తమ మేకప్ విభాగాల్లో అవార్డులు దక్కాయి. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత నాని మాట్లాడుతూ 'కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మా వాల్‌పోస్టర్ సినిమాను స్థాపించాం. తొలి ప్రయత్నంలో ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో సరికొత్త కథాంశంతో 'అ!' చిత్రాన్ని రూపొందించాం. సినిమా మంచి విజయాన్ని సాధించడమే కాకుండా ప్రశంసల్ని సొంతం చేసుకుంది. ఇప్పుడు జాతీయ పురస్కారాల్లో ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్, ఉత్తమ మేకప్ విభాగాల్లో అవార్డులు రావడం మా కెంతో ఉత్సాహాన్నిచ్చింది. నిర్మాతగా మా బాధ్యతను మరింత పెంచింది' అన్నారు.

అవార్డు దక్కడం ఆనందంగా వుంది!

రాహుల్ రవీంద్రన్ దర్శకుడిగా పరిచయమవుతూ రూపొందించిన చిత్రం 'చి!!ల!!సౌ!!'. సుశాంత్, రుహానీశర్మ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి ఉత్తమ అడిషనల్ స్క్రీన్‌ప్లే విభాగంలో అవార్డు లభించింది. రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ 'నా చిత్రానికి జాతీయ పురస్కారం దక్కడం చాలా ఆనందంగా వుంది. ఈ సందర్భంగా నా తల్లిదండ్రులకు, నా భార్యకు, నా సోదరుడికి కృతజ్ఞతలు చెప్పాలి. ఉద్యోగం వదిలేసి సినిమాల్లోకి వెళతానంటే మేమున్నాం అంటూ సపోర్ట్‌గా నిలిచారు. చిన్న చిత్రాన్ని రూపొందించాను. అవార్డులకు పంపించి మర్చిపోయాను. అలా మర్చిపోయిన చిత్రానికి అవార్డు దక్కడం ఆనందంగా వుంది' అన్నారు.

నిశ్శబ్దపు సౌందర్యం

నిశ్శబ్దంలోని మార్మిక సౌందర్యాన్ని 'రంగస్థలం' చిత్రంలో అద్భుతంగా ఆవిష్కరించిన ఆడియోగ్రాఫర్ ఎం.ఆర్.రాజాకృష్ణన్ జాతీయ అవార్డును కైవసం చేసుకున్నారు. 1980ల కాలంనాటి గ్రామీణ ఇతివృత్తంతో సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో హీరో రామ్‌చరణ్ చెవిటి యువకుడి పాత్రలో అద్భుతమైన అభినయాన్ని కనబరిచాడు. వినికిడి శక్తి లేని అతడు నిశ్శబ్దంలో నుంచే ఎదుటివారి మనస్తత్వాల్ని, మనోభావాల్ని అర్థం చేసుకునే సన్నివేశాల్ని తన ఆడియోగ్రఫీతో ఛాలెంజింగ్‌గా తీర్చిదిద్ది ప్రతిభను చాటారు.



ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు సుధాకర్‌రెడ్డి యక్కంటి

గుంటూరుకు చెందిన సినిమాటోగ్రాఫర్ సుధాకర్‌రెడ్డి యక్కంటి మరాఠీ చిత్రం 'నాల్'కు గాను ఇందిరాగాంధీ జాతీయ ఉత్తమ నూతన దర్శకుడిగా అవార్డును సొంతం చేసుకున్నారు. ఈ సినిమాలో ప్రధాన పాత్రలో నటించిన శ్రీనివాస్ పోకలే ఉత్తమ బాలనటుడిగా జాతీయ పురస్కారం దక్కించుకున్నారు. మరాఠీ చిత్రం 'సైరాట్'కు ఛాయాగ్రహకుడిగా వ్యవహరించారు సుధాకర్‌రెడ్డి. తెలుగులో మధుమాసం, పౌరుడు, దళం చిత్రాలకు కెమెరామెన్‌గా పనిచేశారు. 'సైరాట్' చిత్రానికి దర్శకత్వం వహించిన నాగరాజ్ మంజులే 'నాల్' చిత్రాన్ని నిర్మించారు. సుధాకర్ యక్కంటి ప్రస్తుతం తెలుగులో 'జార్జిరెడ్డి' చిత్రానికి ఛాయాగ్రాహణ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నాడు.

epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
నిధి
[కరీంనగర్]
శనివారం 10 ఆగస్టు 2019

పాప లేదా బాబు పుడితే తల్లిదండ్రుల ఆనందమే వేరు. చిన్నారులు బులిబులి అడుగులు వేస్తుంటే సంతోషమే వేరు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యం, చదువుల విషయాల్లో ఎలాంటి అశ్రద్ధ కనబర్చరు. ఉన్నతంగా ఎదిగేందుకు అహర్నిశలు శ్రమిస్తారు. అందుకే, అత్యుత్తమ స్కూళ్లు, కాలేజీల్లో చేర్పించడానికి ప్రయత్నిస్తారు. చిన్నారులకు అత్యున్నత విద్యను అందించడం కాస్తో కూస్తో ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే. కొన్ని సందర్భాల్లో, ప్రస్తుతం తల్లిదండ్రులు ఆర్జించే జీతంతో భవిష్యత్తులో చిన్నారులకు మెరుగైన విద్యను అందించకపోవచ్చు. ఇలాంటి కీలక తరుణంలో చిన్నారుల పేరిట బీమా పాలసీ తీసుకోవడమే సరైన నిర్ణయం. ఫలితంగా, వారికి బంగారు భవిష్యత్తును అందించినట్లు అవుతుంది.

చిన్నారుల భవిష్యత్తుకు భరోసా

క్లిక్ కొడితే బీమా పాలసీ..

మొబైల్ యాప్‌లో క్లిక్ చేస్తే చాలు.. ఇన్సూరెన్స్ పాలసీని తీసుకోవచ్చు. రూ. లక్ష గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీకి ఏడాదికి చెల్లించాల్సిన ప్రీమియం రూ.148 మాత్రమే. అదే, రూ.3 లక్షల పాలసీ అనుకోండి.. రూ.443 కడితే చాలు. రూ.738 ప్రీమియం చెల్లిస్తే రూ.5 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకోవచ్చు. మొత్తానికి, బ్యాంకులు దృష్టి సారించని సామాన్యులకు మొబైల్ యాప్ ద్వారా పాలసీని విక్రయించేందుకు ఎడెల్‌వైజ్ టోకియో లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ మొబీక్విక్‌తో ఒప్పందం కుదుర్చుకున్నది. స్మార్ట్‌ఫోన్‌ను వినియోగించే వారి సంఖ్య పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో, సులభంగా పాలసీని అందించేందుకు ఎడెల్‌వైజ్ టోకియో ముందుకొచ్చింది. అనేక మంది బీమా పరిధిలోకి తేవడానికి ప్రయత్నిస్తున్నది. ఇప్పటికే మొబైల్ ఫోన్లు అనేక వ్యాపారాలను సరికొత్త కోణంలోకి తీసుకెళ్లేందుకు దోహదం చేశాయి. ఇదే క్రమంలో, సాధారణ ప్రజానీకానికి సులువుగా బీమా పాలసీలను అందించాలన్న కృతనిశ్చయంతో ఎడెల్‌వైజ్ ముందుకెళుతున్నది.

కుటుంబ బరువు బాధ్యతల్ని మోసే వ్యక్తి దుర్మరణం చెందితే, అతనిపై ఆధారపడ్డ పిల్లల చదవులు అటకెక్కే ప్రమాదమున్నది. కొన్ని సందర్భాల్లో ఆ చిన్నారులు బాలకార్మికులుగా మారినా ఆశ్చర్యపోనక్కర్లేదు. తను లేకున్నా పిల్లల భవిష్యత్తుకు ఎలాంటి ఢోకా ఉండకూడదని భావించే ప్రతిఒక్కరూ తప్పకుండా చిన్నారుల పేరిట బీమా పాలసీలను తీసుకుంటారు. ఎందుకంటే, పాలసీదారుడు దుర్మరణం చెందితే.. అతనిపై ఆధారపడ్డ పిల్లల చదువును నిరాటంకంగా కొనసాగడానికి అవసరమయ్యేలా సొమ్ము చేతికి అందుతుంది.

- ఒకవేళ పాలసీ తీసుకున్న వ్యక్తి మరణిస్తే.. భవిష్యత్తులో ఎలాంటి ప్రీమియం కట్టాల్సిన అవసరమూ లేదు.
- చిల్డ్రన్స్ బీమా పథకాల మీద రుణాలూ లభిస్తాయి.
- ఆదాయ పన్ను చట్టం ప్రకారం పన్ను ప్రయోజనాల్ని అందుకోవచ్చు. పాలసీ నిమిత్తం చెల్లింపు చేసే ప్రీమియాన్ని సెక్షన్ 80సి కింద పన్ను ప్రయోజనం లభిస్తుంది.

మూడు రకాలు..

చిన్నారులకు బంగారు భవిష్యత్తును అందించేందుకు మూడు రకాల పాలసీలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో చిన్నారుల యూలిప్ మొదటిది. క్రమం తప్పకుండా యూలిప్‌లో సొమ్ము పెట్టడం వల్ల మూడు రకాల ప్రయోజనాలున్నాయి. ఒకవేళ, చిన్నారి తండ్రి దుర్మరణం చెందితే పిల్లలకు పాలసీ మొత్తాన్ని అందజేస్తారు. భవిష్యత్తులో కట్టాల్సిన సొమ్మును మాఫీ చేస్తారు. మెచ్యూరిటీ తీరాక మొత్తం సొమ్మును చేతికిస్తారు. చిన్నారుల ఉన్నత విద్యకు ఎలాంటి ఢోకా ఉండదు.

యూనిట్ ఆధారిత బీమా పథకం

దీర్ఘకాలాన్ని దృష్టిలో పెట్టుకుని యూనిట్ ఆధారిత బీమా పథకం ఓ చక్కటి ప్రత్యామ్నాయం అని చెప్పొచ్చు. ఇందులో పెట్టే సొమ్మును ఈక్విటీ మార్కెట్లలో మదుపు చేస్తారు. మార్కెట్‌ను బట్టి, ఫండ్‌ల పనితీరును బట్టి యూలిప్‌ల నుంచి వచ్చే రాబడి ఆధారపడుతుంది. ఇందులో ఎవరి స్థోమతకు తగ్గట్టు వారు పెట్టుబడి పెట్టొచ్చు. పైగా, వాటిని ఎప్పటికప్పుడు నియంత్రించే వీలుంటుంది. యూలిప్‌లో మదుపు చేశాక వచ్చే లాభాలు నేరుగా బ్యాంకు ఖాతాలో వచ్చి పడతాయి.

సంప్రదాయ ఎండోమెంట్..

చిన్నారులకు స్థిరమైన ఆదాయాన్ని అందించే పథకాల్లో సంప్రదాయ ఎండోమెంట్ రకాలు ముందువరుసలో ఉంటాయి. వీటిపై బోనస్‌ను రెండో ఏట నుంచే అందుకోవచ్చు. పైగా, పాలసీదారులకు చివరికీ సొమ్ము ఎంత అందుతుందనే విషయం ఇట్టే తెలిసిపోతుంది.

ఇవీ అందుబాటులో..

చిన్నారులకు బంగారు భవిష్యత్తును అందించే పలు బీమా పథకాల్ని వివిధ సంస్థలు అందజేస్తున్నాయి. అవేమిటంటే..

రిలయన్స్ చైల్డ్ ప్లాన్

చిన్నారుల రేపటి భవిష్యత్తు గురించి చింతించకుండా ఉండేందుకు ఈ పాలసీ తోడ్పడుతుంది. బాబు లేదా పాప భవిష్యత్తుకు భరోసాను కల్పించడానికి రిలయన్స్ సంస్థ ప్రత్యేక పాలసీని అందజేస్తుంది. ఇది స్థిరమైన ప్రయోజనాల్ని అందజేసే నాన్- లింక్డ్ పథకం.

ఎల్ఐసీ జీవన్ అంకుర్

ఎల్ఐసీ అందజేస్తున్న మెరుగైన ఎండోమెంట్ పథకం ఇది. సంప్రదాయమైన ఈ పొదుపు పథకం వల్ల చిన్నారుల ఉన్నతవిద్యకు మెరుగైన ప్రణాళికల్ని రచించేందుకు తోడ్పడుతుంది. ఈ పాలసీ కింద ప్రీమియంను నిర్ణీత గడువులోపు చెల్లించాల్సి ఉంటుంది. వ్యవధి తీరిన తర్వాత అదనపు సొమ్ము చేతికి అందుతుంది. పాలసీదారుడు జీవించినా, మరణించినా దీంతో సంబంధం ఉండదు. ఒకవేళ పాలసీదారుడు దుర్మరణం చెందితే, నామినీకి ప్రాథమిక సొమ్ము చేతికి అందుతుంది. ఈ పాలసీకి మిగతా వ్యవధికి ఎలాంటి సొమ్ము చెల్లించాల్సిన అవసరముండదు. పైగా, పాలసీదారుడు మరణించిన తేది నాటి నుంచి.. నామినీకి పాలసీ మొత్తంలో పది శాతం సొమ్ము ఏటా చేతికొస్తుంది. గడువు పూర్తయ్యే లోపు ఈ మొత్తం చేతికి అందుతుంది.

అవీవా యంగ్ స్కాలర్ అడ్వాంటేజీ ప్లాన్

చిన్నారులకు మెరుగైన ఆర్థిక భద్రతను అందించడానికి ఈ పథకం అక్కరకొస్తుంది. ప్రతిచిన్నారికి రేపటి భవిష్యత్తును మెరుగ్గా అందజేయడానికి ఇది ఉపయోగపడుతుంది. పాలసీదారుడు మరణిస్తే మూడింతల ప్రయోజనాల్ని అందజేస్తుంది. తదుపరి ప్రీమియం చెల్లించక్కర్లేదు. నిర్ణీత గడువు తీరాక సులువుగా సొమ్మును విత్‌డ్రా చేసుకోవచ్చు.

బిర్లా సన్‌లైఫ్ ఇన్సూరెన్స్ విజన్ స్టార్ ప్లాన్

కొందరు చిన్నారుల పేరిట పాలసీలు తీసుకున్న కొన్నాళ్ల తర్వాత.. ప్రీమియాన్ని కట్టడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంటారు. దీని వల్ల చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగనీయకుండా తోడ్పడే పథకమిది. ప్రీమియం పూర్తి చేసిన ఐదేండ్ల తర్వాత గ్యారెంటీగా కొంత సొమ్మును అందజేస్తుంది.

ఐసీఐసీఐ ప్రూ స్మార్ట్ కిడ్ అష్యూర్ ప్లాన్

ఈ యూలిప్ పథకం రెండు ఆప్షన్లలో లభిస్తుంది. పాలసీ మెచ్యూరిటీ తీరిన తర్వాత అధిక శాతం సొమ్ము ఇన్‌కం ఫండ్‌లోకి జమ అవుతుంది.

- ఇవే కాకుండా హెచ్‌డీఎఫ్‌సీ ఎస్ఎల్ యంగ్‌స్టార్ సూపర్ ప్రీమియం, బజాజ్ అలయాంజ్ యంగ్ అస్యూర్, మాక్స్ లైఫ్ శిక్షా ప్లస్ సూపర్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ యంగ్ స్టార్ ఉడాన్, ఏబీఎస్ఎల్ఐ విజన్ స్టార్ ప్లాన్, ఎస్‌బీఐ లైఫ్ స్మార్ట్ ఛాంప్ ఇన్సూరెన్స్ ప్లాన్, ఎడిల్‌వైజ్ టోకియో లైఫ్ ఎడ్యూసేవ్ ప్లాన్, పీఎన్‌బీ మెట్‌లైఫ్ కాలేజ్ ప్లాన్ వంటి పథకాలు చిన్నారుల కోసం అందుబాటులో ఉన్నాయి.

రాబడి.. ఏన్ను లాభం

మార్చి నెల వస్తే చాలు.. చాలామంది పన్ను పోటు తప్పించుకునే సాధనాలపై దృష్టి సారిస్తారు. అయితే, ఇందులో మదుపు చేస్తే ఎంత రాబడి గిట్టుబాటయ్యే అవకాశముంది? సొమ్మును కనీసం ఎంత కాలం కదపకుండా ఉంచాలి? తప్పనిసరిగా ఆదాయాన్ని ఇచ్చే మదుపు సాధనాలేవి? అందులో ట్యాక్స్ ఫ్రీ ఉన్నవి ఏవి? ఇలాంటి కీలక అంశాలను తెలుసుకుందాం. ఈక్విటీ లింక్డ్ సేవింగ్ స్కీము అంటే మ్యూచువల్ ఫండ్ మదుపు సాధనమని గుర్తుంచుకోండి. బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, బీమా, నేషనల్ సేవింగ్స్ స్కీమ్, నేషనల్ పెన్షన్ స్కీము వంటివాటిలో మదుపు చేస్తే ఒనగూడే ప్రయోజనాలేమిటి? ఎందులో ఎంత సొమ్మును కదపకుండా ఉంచాలి? తప్పనిసరిగా రాబడి ఎందులో వస్తుందో తెలుసుకోవడానికి ఈ ఉదాహరణను పరిశీలిద్దాం. స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసినవారు సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీము (ఎస్‌సీఎస్ఎస్) ఖాతాను యాభై ఐదు ఏండ్లకు తెరవవచ్చు. కనీసం ఐదేండ్ల పాటు సొమ్మును కదపకుండా ఉంచవచ్చు. అవసరమనుకుంటే, కాల పరిమితిని మరో మూడేండ్లు అదనంగా పొడిగించుకోవచ్చు.

మదుపు	లాకిన్ పీరియడ్	రాబడి?	గ్యారెంటీ రిటర్న్స్	ట్యాక్స్ ఫ్రీ రిటర్న్
ఈఎల్ఎస్ఎస్	3	12-16%	లేదు	ఔను
బ్యాంక్ ఎఫ్‌డీ	5	7-9%	ఔను	లేదు
పీపీఎఫ్	15	7.80 %	ఔను	ఔను
ఇన్సూరెన్స్	5	0- 6.5%	లేదు	ఔను
ఎన్ఎస్‌సీ	5	7.80%	ఔను	లేదు
ఎన్‌పీఎస్	10	9%	ఔను	లేదు
ఎస్‌సీఎస్ఎస్	5	8.30%	ఔను	లేదు

ఫిక్స్‌డ్ డిపాజిట్ల రేట్లు..

బ్యాంకు	వడ్డీ రేటు (%)	పెద్దలకు వడ్డీ రేటు(%)
ఎస్‌బీఐ ఫిక్స్‌డ్ డిపాజిట్	5-6.80	5.50-7.30
హెచ్‌డీఎఫ్‌సీ ఫిక్స్‌డ్ డిపాజిట్	3.50-7.30	4-7.80
ఐసీఐసీఐ ఫిక్స్‌డ్ డిపాజిట్	4-7.30	4.50 - 7.80
యాక్సిక్	3.50 - 7.30	3.50 - 7.95
కోటక్	3.50 - 7.20	4 - 7.70
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు	4 - 7.75	4.50 - 8.25
బ్యాంకు ఆఫ్ బరోడా	4.50 - 6.70	5 - 7.20
సిటిబ్యాంకు	3 - 6	3.50 - 6.50
ఐడీబీఐ	5 - 7.10	5.50 - 7.60
ఇండియన్ బ్యాంకు	4.50 - 6.90	5 - 7.40
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు	4.50 - 6.80	5 - 7.30
ఓబీసీ	5.75 - 6.85	---
పీఎన్‌బీ	5.50 - 6.80	6 - 7.25
హెచ్‌డీఎఫ్‌సీ	7.45 - 7.45	7.50 - 7.50
పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్	8.25 - 8.45	8.5 - 8.70
అలహాబాద్ బ్యాంకు	5 - 6.75	---
ఆంధ్రాబ్యాంకు	4 - 6.80	7.30
బ్యాంకు ఆఫ్ ఇండియా	5.25 - 6.70	5.25 - 7.20
బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర	4.25 - 6.50	4.25 - 7
కెనరా బ్యాంకు	5.75 - 6.70	6.25 -7.20
సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా	4.75 - 6.65	5.25 - 7.15
పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు	4 - 6.85	4 - 7.35
యూసీవో బ్యాంకు	4.50 - 6.60	4.75 - 7
యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా	5 - 6.75	5.50 - 7.25
యునైటెడ్ బ్యాంకు ఆఫ్ ఇండియా	4 - 6.50	4 - 6.50
స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకు	4.25 - 7.30	5 - 7.80
జమ్మూ అండ్ కాశ్మీర్ బ్యాంకు	5 - 7.30	5.50 - 7.80
డీబీఎస్ బ్యాంకు	4 - 7.50	4 - 7.50
డీహెచ్‌ఎఫ్ఎల్	8.50 - 9.25	9 - 9.75
సౌత్ ఇండియన్ బ్యాంకు	4 - 7.60	4.50 - 8.10
ఇండస్లాండ్ బ్యాంకు	3.75 - 7.75	4.25 - 8.25
ఎస్ బ్యాంకు	5 - 7.25	5.50 - 7.98
కార్పొరేషన్ బ్యాంకు	4.50 - 7	5 - 7.50
కరూర్ వైశ్య బ్యాంకు	5 - 7.10	5 - 7.50
ధనలక్ష్మీ బ్యాంకు	4 - 7.25	4 - 7.75
ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్	7.80 - 8	8.05 - 8.25
బంధన్ బ్యాంకు	3.50 - 7.65	4.25 - 8.40
సిండికేట్ బ్యాంకు	4.75 - 7.05	5.25 - 7.55
కర్ణాటక బ్యాంకు	3.50 - 7.10	4 - 7.60
డీసీబీ బ్యాంకు	4 - 8.25	4.50 - 8.75
లక్ష్మీ విలాస్ బ్యాంకు	4.50 - 8.40	4.50 - 9
ఫెడరల్ బ్యాంకు	3.50 - 7.25	4 - 7.75
బజాజ్ ఫిన్‌సర్వ్	8 - 8.60	8.35 - 8.95
హెచ్ఎస్‌బీసీ బ్యాంకు	3.05 - 6.10	3.55 - 6.60
ఆర్బీఎల్ బ్యాంకు	5 - 8	5.50 - 8.50

లాభాలకు మార్గాలు

ఏ వ్యాపారంలోనైనా పెట్టుబడి అనేది లాభాలు, నష్టాలతో కూడినదై ఉంటుంది. నష్టం లేకుండా లాభాన్ని రాబట్టలేం. పెట్టుబడి పెట్టడమే రిస్క్‌గా భావించాల్సిన అవసరం లేదు. దీర్ఘకాలిక ఆర్థిక సంక్షోభం, వినియోగ మందగమనం వలన భారత మార్కెట్ దెబ్బతిన్నది. విశ్వాసం లేని దగ్గర పెట్టుబడి పెట్టడమనేది దీర్ఘకాలికంగా సరైన పెట్టుబడిగా మారే అవకాశం ఉంటుంది. మార్కెట్‌లోని అస్థిరతను గుర్తించి దానికనుగుణంగా సంసిద్ధంగా ఉండాలి. గత రెండేళ్లుగా మార్కెట్ స్వల్పంగా ఒడిదుడుకులను ఎదుర్కొంటుంది. ఈ నేపథ్యంలో దీర్ఘకాలిక పెట్టుబడుల పెట్టే పెట్టుబడిదారులు మంచి అవకాశం కోసం చూస్తున్నారు. మొదటిసారి పెట్టుబడి పెట్టే, రిస్క్‌ను ఎదుర్కొనేందుకు మొగ్గు చూపని వారు లిక్విడ్ ఫండ్స్, మనీ మార్కెట్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టడం మంచిది. పెట్టుబడి పెట్టిన తర్వాత లాభాల కోసం కొంత సమయం వేచి చూడాలి. పెట్టుబడిదారులందరూ మంచి సలహాదారులను ఎంచుకోవాలి.

ఖర్చులోనూ పొదుపు సాధ్యమా?

షాపింగ్‌మాళ్లు ఇచ్చే ఆఫర్ల ద్వారా అధిక మొత్తంలో ఆదా చేసుకోగలమా అని చాలా మందికి అనుమానం ఉండటం సర్వసాధారణమే. క్యాష్‌బ్యాక్ ఆఫర్లు, డిస్కౌంట్లు ఉంటాయనే విషయం తెలియక చాలా మంది తమ సొమ్మును వృథా చేసుకుంటారు. ఒక్కోసారి ఆదా చేసే దానికంటే ఎక్కువగా షాపింగ్ కోసం ఖర్చు చేస్తుంటారు. కానీ షాపింగ్ మాళ్లు అందించే భారీ డిస్కౌంట్లతో దీనిని అధిగమించవచ్చు. షాపింగ్ చేసే సమయంలో తెలివిగా వ్యవహరించి ఖర్చులను తగ్గించుకుని అధిక మొత్తంలో ఆదా చేసుకోవచ్చు. ఖర్చులో ఆదా చేయడం ద్వారా ప్రతినెలా కొంత పొదుపు చేయడానికి అవకాశం ఉంటుంది.

- ఉదాహరణకు చాలామంది షాపింగ్ యాప్‌ల ద్వారా వారికి కావాల్సిన వస్తువులు కొనుగోలు చేస్తారు. కానీ ఆ కొనుగోళ్లల్లో కొద్ది మొత్తంలోనే డిస్కౌంట్ లభిస్తుంది. అప్పుడు క్రెడిట్ కార్డు ద్వారా చెల్లింపులు జరిపితే అదనంగా మరో 20 శాతం దాకా క్యాష్ బ్యాక్ ఆఫర్ వస్తుందని మర్చిపోవద్దు. దీంతో యాప్‌తోనే కాకుండా క్రెడిట్ కార్డుల ద్వారా చేసే చెల్లింపులతో ఎక్కువ లబ్ది పొందొచ్చు.
- జొమాటో, బుక్ మై షో వంటి యాప్‌ల ద్వారా నెలవారీ ఖర్చులో సులువుగా 10-15 శాతం ఆదా చేసుకోవచ్చని గమనించాలి. తప్పని పరిస్థితుల్లో చేసే ఖర్చుల సమయంలో ఇలాంటి ఆఫర్లను వాడుకోవాలని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలి.
- వినియోగదారులు తరచూ కొనుగోళ్లు జరిపే విధంగా అమ్మకదారులు క్యాష్ బ్యాక్, డిస్కౌంట్‌లను అందిస్తారు. ఇది దీర్ఘకాలం కొనసాగితే వినియోగదారుల కంటే అమ్మకదారులకు మరింత లాభదాయకంగా మారుతుంది. ఒక్కోసారి చాలా యాప్‌లు, రిటైలర్లు వినియోగదారుల కోసం వంద శాతం క్యాష్‌బ్యాక్ పథకాలను అందిస్తుంటాయి. ఇలాంటి పథకాలు భవిష్యత్తులో అదే యాప్‌లు, రిటైలర్ల వద్ద కొనుగోలు చేసేందుకు వినియోగదారులు మొగ్గు చూపడానికి ఉపకరిస్తాయి.

- పొదుపు చేసుకున్న మొత్తాన్ని ఎంతో ప్రణాళికాబద్ధంగా, జాగ్రత్తగా ఖర్చు చేయాలని గుర్తుంచుకోవాలి. అలాంటివారు ముందుగా అత్యవసరమైన వస్తువుల జాబితాను తయారు చేసుకోవాలి. ఆఫర్లు అందుబాటులోకి వస్తాయో అప్పుడు వారికి అవసరమైన వస్తువుల్లో క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ఉన్న వాటిని కొనుగోలు చేసో, ఆఫర్లు లేని వస్తువుల కొనుగోలును వాయిదా వేసుకోవాలి.
- క్యాష్‌బ్యాక్, ఆఫర్లు అందించడం చాలా బ్రాండ్లలో సాధారణమే. కానీ వాటిని అందిపుచ్చుకోవడానికి ప్రతిఒక్కరూ ముందుండాలి. ఈ విధంగా చేయడం వలన ఖర్చు తగ్గించుకుని ఎక్కువ మొత్తంలో ఆదా చేసుకోవచ్చు.

ఆదా చేయకపోతే అంతే ఇక!

భవిష్యత్తులో సుఖవంతమైన జీవితాన్ని గడిపేందుకు తగిన సొమ్మును ఆదా చేయాలని ప్రతిఒక్కరికీ తెలుసు. సొంతిల్లు కొనడానికో, పిల్లల చదువు కోసమో, పదవీ విరమణ తర్వాత జీవితం కోసమో ప్రస్తుతం ఆదా చేసిన సొమ్ము ఎంతో ఉపయోగపడుతుంది. నెలవారీ ఆదాయం నుంచే కొంత సొమ్మును ఆదా చేసుకోవచ్చు. కానీ ఈ విషయంపై చాలా మంది దృష్టి సారించడం లేదు. దీంతో సొమ్ము ఆదా చేయడంలో విఫలమవుతున్నారు. సరిపోయేంత సొమ్మును ఆదా చేయకపోవడానికి కొన్ని కారణాలుంటాయి.

సరైన బడ్జెట్ లేకపోవడం..

సరైన బడ్జెట్ లేకపోవడమంటే కష్టపడి సంపాదించిన సొమ్మును ఖర్చు చేసే సమయంలో మీరు తెలివిగా వ్యవహరించడం లేదని అర్థం. కొన్ని పరిస్థితుల్లో పరిమితికి మించి ఖర్చు చేయడం ద్వారా సొమ్ము ఆదా చేయడం సాధ్యం కాదు. బడ్జెట్ లేకపోతే ఆదా చేయడం కష్టమవుతుంది.

ఆటోమేట్ సేవింగ్స్..

ఖర్చు చేయడం సులభమే. కానీ సొమ్ము ఆదా చేయడమే కష్టం. దీనికి ఒకటే మార్గం ఉంది. ముందు ఆదా చేసిన తర్వాతే మిగిలిన దానిని ఖర్చు చేయాలి. ఈవిధంగా చేయకపోతే మీ నెలవారీ సంపాదన మొత్తం ఖర్చు అవుతుంది. దీని నుంచి తప్పించుకోవాలంటే తెలివిగా వ్యవహరించి ఆటోమేట్ సేవింగ్స్ చేసుకోవడం మంచిది. ఉదాహరణకు ప్రతినెలా మీ జీతం నుంచి రూ.20 వేలను వివిధ మ్యూచువల్ ఫండ్ల స్కీముల్లో పెట్టుబడి పెట్టడానికి ఉపయోగిస్తున్నారని అనుకుందాం.. ఈవిధంగా ఆటో డెబిట్ కావడం వల్ల చెల్లింపుల్లో జాప్యం జరిగే అవకాశం ఉండదు. పెట్టుబడులను ఆటోమేట్‌గా చెల్లించకపోవడమూ సొమ్ము ఆదా కాకపోవడానికి ఒక కారణంగా చెప్పొచ్చు.

నిర్దిష్ట లక్ష్యాలు లేకపోవడం..

కొన్నిసార్లు మీకు నిర్దిష్ట లక్ష్యాలు ఉండవు. అలాంటప్పుడు సొమ్ము ఆదా చేసుకోవడం సాధ్యపడదు. ఉదాహరణకు రెండేళ్ల తర్వాత వెకేషన్‌కు వెళ్తున్నామని తెలిస్తే దాని కోసం సొమ్ము ఆదా చేయండి. అప్పుడు మీ సెలవుల కోసం ఇబ్బంది పడక్కర్లేదు.

సుడోకు

డైలీ సుడోకు 117 సమాధానం

7	8	9	3	1	4	5	6	2
6	4	2	9	5	8	7	1	3
1	3	5	6	2	7	8	4	9
4	5	3	2	7	6	1	9	8
2	7	1	8	4	9	6	3	5
9	6	8	5	3	1	4	2	7
5	9	6	1	8	2	3	7	4
3	2	4	7	6	5	9	8	1
8	1	7	4	9	3	2	5	6

1. నిలువుగా, అడ్డంగా ప్రతి వరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -118

7		1						
	2		4			5	6	
			9			8		
		7	3		6		1	5
1								6
6	9		5		1	2		
		9			2			
	6	4			5		2	
						3		8

నమస్తే తెలంగాణ
సంపద
[కరీంనగర్]
శనివారం 10 ఆగస్టు 2019

మూడు రోజులపాటు ఇజ్రాయేల్‌లోని టెల్ అవీవ్‌లో జరిగిన క్రెడాయ్ న్యాట్‌కాన్ 2019 సమావేశం అట్టహాసంగా జరిగింది. దాదాపు పద్దెనిమిదికి పైగా సెషన్లు జరగ్గా.. అంతర్జాతీయ నిపుణులు పలు కీలక అంశాల గురించి సభకు వివరించారు. నిర్మాణ రంగంలో ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించాల్సిన తీరు, దాని వల్ల ఒనగూడే ప్రయోజనాల్ని ప్రత్యేకంగా వివరించారు. స్టార్టప్ నేషన్‌గా పిలవబడే ఇజ్రాయేల్ దేశీయ పరిస్థితులు భారత నిర్మాణ రంగంతో చక్కగా సరిపోతాయని నిపుణులు అభిప్రాయపడ్డారు. క్లిష్ట పరిస్థితుల్ని సమర్థంగా అధిగమించడమే కాకుండా.. పరిస్థితులకు తగ్గట్టుగా వినూత్న నిర్ణయాలతో ముందుకెళితేనే దేశమైనా, నిర్మాణ రంగమైనా నిలబడుతుందని వక్తలు తెలిపారు. ఇందుకోసం దేశానికైనా, రాష్ట్రానికైనా సమర్థులైన నాయకులు ఉండాలి. అదే విధంగా నిర్మాణ సంస్థ రథసారథి ఆలోచనాపూరితమైన నిర్ణయాలు తీసుకోవాలని వివరించారు. ఒకవేళ పడినా అధైర్యపడకుండా, అదే స్పీడులో మళ్లీ లేచి నిలబడగలిగే ఆత్మస్థైర్యాన్ని కలిగి ఉండాలని సూచించారు. అరవై లక్షల మంది యూదులను ప్రపంచవ్యాప్తంగా ఊచకోత కోసినా.. నాలుగు వైపుల నుంచి శత్రువులతో ప్రతినిత్యం పోరాటం చేస్తూనే.. ఇజ్రాయేల్ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో ప్రపంచాన్ని శాసించే స్థాయికి చేరుకుందని చెప్పారు. ప్రకృతి నుంచి ఎలాంటి ముప్పు లేనప్పటికీ, మేధోసంపత్తితో ముందుకు దూసుకెళుతున్నామని వివరించారు. ఇదే స్థాయిలో నిర్మాణ రంగానికి చెందిన యజమానులు ముందుకు దూసుకెళ్లాలని సూచించారు.

వైభవంగా క్రెడాయ్ న్యాట్‌కాన్

టెల్ అవీవ్ నుంచి కింగ్ జాన్సన్ కొయ్యడ

నిర్మాణ రంగం కష్టకాలంలో ఉన్నదని.. కేంద్ర ప్రభుత్వం ఈ రంగాన్ని ఆదుకోవాలని క్రెడాయ్.. టెల్ అవీవ్ వేదికగా కోరింది. లేకపోతే, ఈ రంగంపై ఆధారపడ్డ 150కి పైగా పరిశ్రమలు దారుణంగా దెబ్బతింటున్నాయని అభిప్రాయపడింది. ఉక్కు పరిశ్రమలు వంటివి వారంలో రెండు, మూడు రోజులపాటు ఉత్పత్తిని నిలిపివేస్తున్నాయని తెలియజేసింది. భారత జీడీపీకి సుమారు 6.7 శాతం నిర్మాణ రంగం నుంచే వస్తున్నదని, పైగా వ్యవసాయం తర్వాత అధిక శాతం మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాల్ని కల్పించేది నిర్మాణ రంగమేనని గుర్తు చేసింది. కాబట్టి, ఈ రంగం పురోగతి చెందేలా కేంద్రం పటిష్టమైన చర్యల్ని తీసుకోవాలని సూచించింది. ఇన్‌సాల్వెన్సీ చట్టానికి కొత్తరూపమివ్వాలని కోరింది. నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న నిధుల కొరతను పరిష్కరించే విధంగా ఆర్‌బీఐ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ప్రస్తుతం నిర్మాణ రంగం గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నదని, ఇదే సమయంలో కేంద్రం ఆదుకోవాలని కోరింది. మొదటిసారి ఇల్లు కొనుక్కునేవారికి ఏడున్నర శాతం వడ్డీకే గృహరుణాన్ని అందజేసేలా నిర్ణయం తీసుకోవాలని అభ్యర్థించింది.

క్రెడాయ్ నిర్వహించిన న్యాట్‌కాన్ 2019లో భారతదేశంలోని 200 నగరాల నుంచి దాదాపు 12 వేల మంది డెవలపర్లు పాల్గొన్నారు. వీరిలో దక్షిణం నుంచి వచ్చిన వారి సంఖ్య అధికంగా ఉన్నది. కేవలం తెలంగాణ రాష్ట్రం నుంచి దాదాపు రెండు వందలకు పైగా డెవలపర్లు ఈ సదస్సులో పాల్గొనడం విశేషం.

మారుతున్న మిలీనియల్స్ తీరు..

ఆసియా పసిఫిక్ దేశాల్లో మిలీనియల్స్ వ్యవహరిస్తున్న తీరు, ఇంటి కొనుగోలుకు సంబంధించి వారి ఆలోచనా విధానం ఎలా ఉందనే విషయాన్ని స్పష్టంగా ఒక సెషన్‌లో వివరించారు. 22-29 ఏండ్ల మధ్యలో ఉన్నవారిని మిలీనియల్స్‌గా పిలుస్తారు. ఇందులో 25 శాతానికి పైగా యువకులు ఉద్యోగం చేస్తున్నవారే. భారతదేశంలో దాదాపు 90 శాతం మంది సొంతింటి కలను సాకారం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

- ట్రాఫిక్ రణగొణధ్వనుల్ని మిలీనియల్స్ ఏ మాత్రం ఇష్టపడటం లేదు. ఇంటి నుంచి ఆఫీసుకు సులువుగా వెళ్లడానికే ప్రాధాన్యతనిస్తున్నారు. భారతదేశంలో అధిక శాతం మిలీనియల్స్ సుమారు 42 నిమిషాల్లో ఆఫీసులకు వెళ్లడానికే మొగ్గు చూపుతున్నారు. ఈ కారణంగానే గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ చేరువలో అధిక శాతం మంది స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకోవడానికి ప్రాధాన్యతనిస్తున్నారు. 70 శాతం మంది నవ యువకులు ఆఫీసుకు సమీపంలో ఉండటానికే ఆసక్తి చూపిస్తున్నారు. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. సుమారు 15 శాతం మంది మిలీనియల్స్ సొంత ఆఫీసులను ఏర్పాటు చేయడానికే ప్రయత్నిస్తున్నారు.
- నెలసరి జీతంలో మిలీనియల్స్ దాదాపు 18 శాతం సొమ్మును పొదుపు చేస్తుండటం విశేషం. 20 శాతం మంది స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. సినిమాలు, కన్సర్ట్‌ల కోసం సొమ్మును వెచ్చించేవారి సంఖ్య తక్కువేం కాదు.
- క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు గుమ్మి రాంరెడ్డి, క్రెడాయ్ యూత్ వింగ్ సభ్యులు, ఇతరులు కలిసి న్యాట్‌కాన్ సదస్సును నిర్వహించడంలో విజయం సాధించారు. సదస్సు ఆరంభానికి ముందు వీసాలను మంజూరు చేయడం వద్ద నుంచి డెవలపర్లందరూ క్షేమంగా తమ స్వస్థలాలకు చేరుకునే వరకూ పకడ్బందీగా వ్యవహరించారు. దీంతో, నిర్వాహకులను సభ్యులందరూ ప్రశంసలతో ముంచెత్తారు.

యువత కచ్చితంగా ఆర్మీలో సేవచేయాలి

ఇజ్రాయేల్ పోరాట పటిమను ప్రశంసించాల్సిందే. వారి సరిహద్దులు, అస్థిత్వం కోసం జోర్డాన్, పాలస్తీనా, లిబియా, సిరియా దేశాలతో పోరాడుతున్నారు. ఇజ్రాయేల్ గత ఐదారు ఏండ్లుగా భారతదేశంతో మెరుగైన ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగిస్తుంది. ఇజ్రాయేల్ దేశం ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోడానికి సిద్ధంగా ఉంది. 18 నుంచి 25 ఏండ్ల మధ్య వయస్సులో ప్రతిఒక్కరూ మూడేండ్ల పాటు సైన్యంలో సేవ చేయాలని నిబంధన ఉంటుంది. సవాళ్లను అవకాశాలుగా మార్చడంలో ఈవిధమైన క్రమశిక్షణ వారికి ఎంతో ఉపయోగపడుతోంది. మన దేశంలోనూ ఈ విధానాన్ని అవలంభించాలి. యువత కచ్చితంగా 2-3 ఏండ్లు ఆర్మీ లేదా సంబంధిత సేవల్లో పనిచేయాలని నిబంధనను అమలు చేయాలి.

– గుమ్మి రామిరెడ్డి, అధ్యక్షుడు, క్రెడాయ్ తెలంగాణ

మనమూ ఇజ్రాయేల్లా ఆర్థికంగా ఎదగొచ్చు

మేం ఊహించిన దానికంటే న్యాట్‌కాన్-2019 విజయవంతమైంది. ఈ దేశంలో వినియోగిస్తున్న సరికొత్త పరిజ్ఞానం గురించి తెలిసింది. నిర్మాణ రంగంలో అనుసరిస్తోన్న ఆధునిక పోకడలపై డెవలపర్లకు అవగాహన పెరిగింది. నీటి సంరక్షణ, ఘన వ్యర్థాల నిర్వహణ, నిర్మాణాల్లో పరిజ్ఞానం వంటి అంశాలపై కొత్త విషయాలు తెలిశాయి. ఇజ్రాయేల్ ప్రభుత్వం పౌరుల భద్రత, కఠినమైన చట్టాలను ఎంతో పటిష్టంగా అమలు చేస్తోంది. కార్బన్ ఫుట్ ప్రింట్‌ను తగ్గించేందుకు అన్ని రంగాల్లోనూ స్వచ్ఛమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. ఇజ్రాయేల్‌లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను మన దేశంలోనూ అమలు చేసేందుకు ప్రాధాన్యతనివ్వాలి. సంస్కృతి, ఆర్థిక విధానం అమలులో భారతదేశం ఎంతో ముందుంది. దేశంలోని ప్రతి రాష్ట్రానికీ ఇజ్రాయేల్ ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు అవకాశం ఉంది.

– రాధాకృష్ణ, బిజినెస్ హెడ్, ఏషియా పసిఫిక్

చిన్న ఐడియా నగరాన్నే మార్చేసింది!

ఒక ఐడియా జీవితాన్నే మార్చేస్తుందనే విషయం తెలిసిందే. ఇజ్రాయేల్ దేశానికి చెందిన మున్సిపల్ అధికారులు అవలంభిస్తున్న చిన్న చిన్న విధానాలు చక్కటి ఫలితాల్ని అందజేస్తున్నాయి. పైగా, వీటికి పెద్దగా ఖర్చు కూడా అవ్వదని గుర్తుంచుకోండి.

రాంగ్ రూటులో వెళ్లకుండా...

రాంగ్ రూటులో వాహనాలు రాకుండా నియంత్రించడానికి 'టెల్ అవీవ్'లోని మున్సిపల్ అధికారులు వినూత్న విధానాన్ని కనుగొన్నారు. ఇది అత్యంత సులభమైనది, చవకైనది. పైగా ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీసులు ఉండక్కర్లేదు. ఫొటోలో చూపించిన విధంగా ఒకవైపు పైకి కొనలు తేలినట్లుగా రోడ్డు మీద అమర్చారు. వాహనాలు సరైన రూటులో వెళ్లడానికి ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. కాకపోతే, రాంగ్ రూటులో రాకుండా చేయడానికి దాదాపు ప్రతి పార్కింగ్ ప్రదేశాల్లో ఈ విధమైన ఏర్పాట్లు చేశారు.

చిన్న చిన్న వీధుల్లో ఎవరు పడితే వారు కార్లను పార్కింగ్ చేయడాన్ని మనం చూస్తుంటాం. వీరిని నియంత్రించడానికి టెల్ అవీవ్‌లో కొందరు గృహయజమానులు చక్కటి పరిష్కారాన్ని కనుగొన్నారు. వారి వీధిలోకి అపరిచితుల కార్లు రాకుండా నిరోధించడానికి వీధి ఆరంభంలోనే, ఫొటోలో చూపించిన విధంగా ఒక పరికరాన్ని బిగించారు. దాంతో అపరిచితులెవ్వరూ ఆయా వీధుల్లోకి వెళ్లి వాహనాలు పార్కింగ్ చేసే అవకాశమే ఉండదు.

షాపింగ్ మాళ్లలో ఏసీలు ఉండటం సహజమే. చిన్న చిన్న దుకాణాల్లోనూ ఏసీలను బిగించడం సర్వసాధారణంగా మారింది. 'టెల్ అవీవ్'లో గృహయజమానులు ఏసీ నుంచి వచ్చే నీటిని కూడా వృథా కానివ్వడం లేదు. ఆవిధంగా ఏసీ నుంచి వచ్చే నీటిని ఒక పైపు ద్వారా చెట్లకు మళ్లిస్తున్నారు. ఇక షాపింగ్ మాళ్లలో అయితే, ఏసీలన్నింటినీ ఒక పైపునకు బిగిస్తారు. ఆ ఏసీల నుంచి వచ్చే నీటిని అక్కడి చెట్లకు మళ్లిస్తున్నారు. ఇలా నీటిని సంపూర్ణంగా సంరక్షించడానికి పక్కా ప్రణాళికలను అమలు చేస్తున్నారు.

ఇంతింత కాదయా.. ఇజ్రాయేల్ ఘనత

రహదారుల మీద ట్రాఫిక్ పోలీసుల్లేరు
కాలుష్యం లేదు.. చెత్త కనిపించదు
స్థానిక నిర్మాణ సామగ్రితో నిర్మాణాలు
ఆధునిక తరహాలో అపార్టుమెంట్ల నిర్మాణం

ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రపంచాన్ని శాసించే స్థాయికి చేరుకుంటున్న ఇజ్రాయేల్ గొప్పతనమంతా.. అక్కడి ప్రజల్లోనే ఉన్నది. వీరికి తమ దేశం పట్ల ఎంతో ప్రేమ ఉండటమే కాదు.. వారి వ్యవహారశైలిలోనూ అది కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ప్రభుత్వం నిబంధనల్ని ఎంత కట్టుదిట్టంగా అమలు చేస్తున్నదో.. ప్రజలూ వాటిని అదే స్థాయిలో స్వచ్ఛందంగా పాటిస్తుండటం విశేషం.

ఇజ్రాయేల్‌ని చూసి మనమెంతో నేర్చుకోవాల్సిన అవసరముంది. 650 చదరపు కిలోమీటర్ల వైశాల్యం.. 90 లక్షల జనాభా గల ఈ దేశ ప్రజలు ట్రాఫిక్ నిబంధనల్ని కచ్చితంగా పాటిస్తున్నారు. అసలు ఎక్కడా ట్రాఫిక్ కానిస్టేబుల్ కనిపించనే కనిపించడు. ప్రతిఒక్కరూ ఒక పద్ధతిగా రహదారుల మీద ప్రయాణం చేస్తున్నారే తప్ప.. ఎక్కడ నిబంధనలను అతిక్రమిస్తున్నట్టు కనిపించలేదు. గొప్ప విషయం ఏమిటంటే.. పాదాచారులకు ప్రతిఒక్కరూ ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎవరైనా రోడ్డు దాటుతుంటే.. కారు అయినా, బస్సు అయినా నిలిపివేస్తున్నారు. పాదాచారులు రోడ్డు దాటిన తర్వాతే ముందుకు వెళ్తున్నారు. పార్కింగ్ ప్రదేశాల్లో ఎవరికీ వారే స్వచ్ఛందంగా టికెట్లు తీసుకుని, వాహనాల్ని క్రమపద్ధతిలో నిలుపుతున్నారు. ఇక్కడి ప్రభుత్వం నగరమంతటా సీసీ టీవీ కెమెరాలను బిగించడంతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరిగినా పోలీసులకు క్షణాల్లో తెలిసిపోతోంది.

బాధ్యతాయుతంగా ప్రజలు

ఇజ్రాయేల్ ప్రజల గొప్పతనమేమిటంటే.. అధిక శాతం మంది బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తున్నారు. స్థానిక సంస్థలు పరిసరాల్ని ఎంత పరిశుభ్రంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్నాయో, ప్రజలూ అదే రీతిలో తమ వంతు బాధ్యతతో మెలుగుతున్నారు. రోడ్డు మీద చెత్త వేయడమనేది ఎక్కడా కనిపించలేదు. అందుకే, ఇక్కడి పరిసరాలెంతో పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. జెరుసలేంలోని టెల్ అవీవ్‌లో రహదారులన్నీ తళతళ మెరుస్తున్నాయి. పైగా, ఉద్యానవనాల్ని సైతం ప్రజలెంతో పద్ధతిగా వినియోగిస్తున్నారు. టెల్ అవీవ్‌లో ఎక్కువ శాతం ప్రజలు సైకిల్ వినియోగించడానికే ఇష్టపడుతున్నారు. కోటీశ్వరులు సైతం ఆఫీసులకు వెళ్లడానికి సైకిల్‌ను వాడుతుండటం విశేషం.

ఒకే రంగులో ఇండ్లు

ఇజ్రాయేల్‌లో భవనాల్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే.. వాటి నిర్మాణానికి స్థానికంగా దొరికే సున్నపు రాయిని విరివిగా వినియోగిస్తున్నారు. విమానాశ్రయం దగ్గర్నుంచి జెరుసలేం వరకూ నిర్మాణాలన్నీ ఒకే రంగులో ఉండటం విశేషం. వ్యక్తిగత గృహాలు, అపార్టుమెంట్లు షేర్‌వాల్ పరిజ్ఞానంతో కడుతుండగా.. కాస్త ఖరీదైన గృహాల పైభాగాన్ని స్థానికంగా లభించే ఎర్రటి టైళ్లను వాడుతున్నారు. అయితే, టెల్ అవీవ్‌లో మాత్రం వాణిజ్య భవనాలు తెలుపు, బూడిద రంగుల్లోనే ఎక్కువగా దర్శనమిచ్చాయి. వీటి నిర్మాణంలోనూ పెద్దగా హడావిడి కనిపించలేదు. కార్మికుల హడావిడీ లేదు. నిర్మాణంలో పూర్తిస్థాయి ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తుండటం విశేషం. మన మెట్రోను నిర్మించినట్లే.. భవనానికి సంబంధించిన శ్లాబులను సిమెంట్ సాయంతో ఒక చోట తయారు చేసి.. సైటు వద్దకు వాటిని తీసుకొచ్చి క్రమ పద్ధతిలో బిగిస్తున్నారు. ఇలా, పదిహేను, ఇరవై అంతస్తుల ఆకాశహర్మ్యమైనా సులువుగా కట్టేస్తున్నారు. బరనోవిట్జ్ తరహాలో టెల్ అవీవ్‌లో నిర్మాణాలు చేపడుతున్నారు. సంప్రదాయ విధానంతో పోలిస్తే దీని వల్ల 45 శాతం ఖర్చు తగ్గుతుంది. టెల్ అవీవ్ సముద్రం ఒడ్డున ఉండటంతో.. ఒకవేళ సునామీ వస్తే ప్రజలు ఎటువైపు వెళితే క్షేమమో చెప్పే బోర్డులను ప్రతి ప్రాంతంలోనూ ఏర్పాటు చేశారు.

స్టార్టప్‌లకు చిరునామా

పురాతమైన నగరంగా ఖ్యాతిగాంచిన 'ఆక్కో' నగర వారసత్వ సంపదకు ఎక్కడా భంగం కలిగించకుండా ఆధునిక స్థాయిలో అభివృద్ధి చేశారు. కొన్నేండ్ల క్రితమే ఈ నగరం నుంచి ఇతర దేశాలకు వాణిజ్యం జరిగేది. ఆక్కో సిటీ నుంచి సముద్రం వరకూ ఉన్న ప్రత్యేక సొరంగమార్గం నేటికీ చెక్కుచెదరకుండా ఉండటం విశేషం. సముద్ర తీరంలో ఉన్న ఇండ్లన్నీ ఒకే పద్ధతిలో నిర్మించి ఉండగా.. ప్రతి ఇంటి మీద ప్రత్యేకంగా సోలార్ ఏర్పాటు చేసి ఉండటం విశేషం. ఇంటెల్, గూగుల్, యాహూ, క్వాల్‌కామ్ వంటి అనేక ఐటీ సంస్థలకు ఇజ్రాయేల్ కేరాఫ్ అడ్రస్‌గా మారింది. టెల్ అవీవ్‌ను స్టార్టప్స్ నగరంగా అభివర్ణిస్తారు. ఆధునిక పరిజ్ఞానాన్ని ఇక్కడి యువత విరివిగా వినియోగిస్తున్నది. ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవిక సమస్యలను పరిష్కరించడానికి స్టార్టప్ సంస్థలు ముందుకొస్తుండటం విశేషం.

ఎన్‌బీఎఫ్‌సీలకు ఆర్‌బీఐ చేయూత

నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ(ఎన్‌బీఎఫ్‌సీ) రంగంలో బాగా పనిచేస్తున్న సంస్థలను ఆర్‌బీఐ తగిన విధంగా ప్రోత్సహిస్తుంది. ఎన్‌బీఎఫ్‌సీలకు బ్యాంకు రుణాల మంజూరులో చేయూతనిచ్చే నిర్ణయాలను తీసుకున్నట్టు సమాచారం. అందులో భాగంగా రుణదాత మూలధనంలో 20 శాతంగా ఉన్న రుణగ్రహీత స్పందన పరిమితిని 15 శాతానికి తగ్గించింది. ఎన్‌బీఎఫ్‌సీల ప్రయోజనాల కోసం బ్యాంకు రుణాలను ప్రాధాన్యతా రంగ రుణాలుగా గుర్తిస్తుంది. ఈ విభాగాల్లో ఎన్‌బీఎఫ్‌సీలు వ్యవసాయ పెట్టుబడి కోసం రూ. 10 లక్షల వరకు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ. 20 లక్షల వరకు, గృహ రుణగ్రహీతలకు రూ. 20 లక్షల వరకు రుణాలు ఇచ్చే అవకాశం కల్పించింది. కానీ ఎన్‌బీఎఫ్‌సీల నుంచి గృహ రుణాల కోసం రూ. 10 లక్షలు మాత్రమే ఇచ్చేందుకు వీలుంది. ప్రాధాన్యత రంగాల అడ్వాన్స్‌ల కోసం గృహ రుణాల ఆన్-లెండింగ్ క్యాప్‌ను రూ. 10 లక్షల లోను టికెట్ నుంచి రూ. 20 లక్షల టికెట్‌కు పెంచింది. దీని ద్వారా హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలకు ఎక్కువ రుణాలు ఇచ్చే విధంగా బ్యాంకులను ప్రోత్సహిస్తుంది. ఇది సరసమైన హౌసింగ్ విధానంలో హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీల(ఎచ్‌ఎఫ్‌సీ)ల రుణాలను మరింత పెంచుతుంది. ప్రాధాన్యత రంగ రుణాల కోసం ఎన్‌బీఎఫ్‌సీల ద్వారా రుణాలు ఇవ్వడానికి బ్యాంకులను అనుమతించడం వలన ఈ ప్రక్రియ మరింత వేగంగా, సమర్థవంతంగా జరుగుతుంది. ఇది ప్రస్తుత వాతావరణంలో ఎంఎస్ఎంఈ పనితీరును గణనీయంగా మెరుగుపర్చడంతోపాటు ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందడానికి దోహదం చేస్తుంది.

LAUNCHING
SILICON AVENUE
@ Maheshwaram
SPECIAL DISCOUNT hmda
₹1000/- Per Sq.Yrd
Launching on 11th Aug
Spot Booking 2 Gms GOLD COIN FREE
AMMA DEVELOPERS
88850 76777

Peram Group
HMDA APPROVED PLOTS
TUKKUGUDA
SRISAILAM HIGHWAY
Behind Bhashyam Blooms School
KOTHURU
DLF Garden City
Bangalore Highway
BANK LOAN AVAILABLE
SPOT REGISTRATION
95424 91880

ప్రగతి రిసార్ట్స్
మెగా రెసిడెన్షియల్ వెంచర్
ప్రగతి స్ఫూర్తి సెంట్రల్ కౌంటీ
యాదాద్రి, వరంగల్ నేషనల్ హైవే పై ప్లాట్లు అమ్మకానికి కలవు
క్లియర్ టైటిల్ DTCP అనుమతి ప్రకారం అన్ని సౌకర్యాలు
యాదాద్రి చుట్టు ప్రక్కల గల అతి పెద్ద (82 ఎకరాలు) రెసిడెన్షియల్ వెంచర్
యాదాద్రి ఇప్పుడు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రదేశం మరియు భవిష్యత్తు పెట్టుబడికి అత్యంత అనుకూలమైనది
DTCP APPROVED
(TLP No. 24/2016/H)
ప్రగతి రిసార్ట్స్ చిలుకూరులో ఉచిత సభ్యత్వం
9100073539 | 7661033339

నాని

గ్యాంగ్ లీడర్ డేట్ ఫిక్స్

విభిన్న చిత్రాల దర్శకుడు విక్రమ్ కె.కుమార్ దర్శకత్వంలో నాని నటిస్తున్న చిత్రం 'నానీస్ గ్యాంగ్ లీడర్'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్ (సీవీఎం) నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'నాని, విక్రమ్‌కుమార్ కలయికలో వస్తున్న వైవిధ్య చిత్రమిది. పూర్తి కమర్షియల్ అంశాలతో, విభిన్నమైన కాన్సెప్ట్‌తో దర్శకుడు పూర్తి జనరంజకంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. విక్రమ్‌కుమార్ దర్శకత్వంలో ప్రేక్షకులు ఆశించే కొత్తదనం ఈ చిత్రంలో వుంటుంది. ఇటీవల విడుదలైన ప్రీ లుక్‌కి, ఫస్ట్‌లుక్‌కి, టీజర్‌కు అందరి నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. సినిమాలో వుండే కొత్తదనం కూడా అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుందనే విశ్వాసం వుంది' అని తెలిపారు. 'ఆర్ ఎక్స్ 100' కార్తికేయ, ప్రియాంక, లక్ష్మీ, శరణ్య, అనీష్ కురువిల్లా, ప్రియదర్శి,రఘుబాబు, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్, మాటలు: వెంకీ, సి.ఇ.ఓ: చెర్రీ.

మహేష్‌బాబు

నువ్వెళ్లే రహదారికి జోహారూ..

మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. రష్మిక మందన్న కథానాయిక. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ సమర్పణలో జి.మహేష్‌బాబు ఎంటర్‌టైన్‌మెంట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై దిల్‌రాజు, అనిల్ సుంకర, మహేష్‌బాబు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శుక్రవారం హీరో మహేష్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను, టీజర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో మహేష్ బాబు ఆర్మీ అధికారి ఆజయ్ కృష్ణగా కనిపించనున్నారు. 'సరిలేరు నీకెవ్వరు...నువ్వెళ్లే దారికి జోహారూ.. సరిలేరు నీకెవ్వరు..ఎనలేని త్యాగానికి నువ్వే మారుపేరు..' అంటూ టీజర్‌లో సాగే పాట సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. టీజర్‌లో సైనికుడిగా మహేష్‌బాబు మరింత స్టైలిష్‌గా కనిపించడం ఆయన అభిమానుల్ని అమితంగా ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో మహేష్‌బాబు పాత్ర నవ్యపంథాలో ఉంటుందని, మునుపెన్నడూ లేనవిధంగా భిన్నకోణాల్లో సాగుతుందని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఇటీవలే కశ్మీర్ షెడ్యూల్ పూర్తయింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. వచ్చే ఏడాది చితాన్ని సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. ప్రత్యేక పాత్రలో విజయశాంతి నటిస్తున్న ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో ప్రకాష్‌రాజ్, రాజేంద్రప్రసాద్, సంగీత, బండ్ల గణేష్ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఆర్. రత్నవేలు, ఫైట్స్: రామ్‌లక్ష్మణ్.

ఆ భ్రమలు తొలగిపోవాలి!

'స్టార్ హీరోయిన్ అనే గర్వం నాకు ఎప్పుడూ లేదు. ఈ ప్రయాణంలో ఇంకా నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయే మంచి పాత్రలు చేయాలనే సంకల్పంతో కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటున్నాను' అని చెప్పింది కాజల్ అగర్వాల్. పుష్కరకాలంగా దక్షిణాది ప్రేక్షకుల్ని తన అందం, అభినయంతో మెప్పిస్తున్న ఈ సుందరి తాజాగా 'రణరంగం' చిత్రంలో కథానాయికగా నటించింది. శర్వానంద్ హీరోగా సుధీర్‌వర్మ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదలకానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో కాజల్ అగర్వాల్ పాత్రికేయులతో ముచ్చటించింది. ఆ విశేషాలివి..

కాజల్ అగర్వాల్

'రణరంగం' చిత్రంలో మీ పాత్ర చిత్రణ ఎలా ఉంటుంది?

ఈ సినిమాలో నేను డాక్టర్‌గా కనిపిస్తాను. ద్వితీయార్థంలో నా పాత్ర కథలోకి ప్రవేశిస్తుంది. గ్యాంగ్‌స్టర్ జీవిత ప్రయాణంలో ఓ మహిళా డాక్టర్‌తో ఏర్పడిన పరిచయం ఎలాంటి మలుపులకు కారణమైంది? ఇద్దరి ఉన్నతికి వారి ప్రేమాయణం ఏ విధంగా దోహదపడిందన్నది ఆసక్తికరంగా ఉంటుంది.

ఈ చిత్ర కథలో మీకు నచ్చిన అంశాలేమిటి?

స్వతహాగా నాకు గ్యాంగ్‌స్టర్ సినిమాలంటే ఇష్టం. జీవితం కంటే అవి విస్తృత పరిధిలో ఉంటూ చక్కటి డ్రామాతో ఆకట్టుకుంటాయి. 'రణరంగం' చిత్రంలో నా పాత్ర చిన్నదే అయినా కథాగమనంలో చాలా కీలకంగా ఉంటుంది. శర్వానంద్‌తో కలిసి పనిచేయడం గొప్ప అనుభూతినిచ్చింది. దర్శకుడు సుధీర్‌వర్మ చాలా టాలెంటెడ్. సృజనాత్మక ఆలోచనలతో చిత్రాన్ని తెరకెక్కించాడు.

'సీత' చిత్ర పరాజయం మిమ్మల్ని నిరాశకు గురిచేసిందా?

అలాంటిదేమి లేదు. సినిమా అనేది సమిష్టి కృషి. వైఫల్యంలో కథానాయిక పాత్ర పెద్దగా ఉండదు. అయితే వ్యక్తిగతంగా సీత పాత్ర నాకు ఎంతో సంతృప్తినిచ్చింది. ఆ పాత్ర చేయడం గర్వంగా భావించాను. నా నటనకు మంచి ప్రశంసలు లభించాయి. అవకాశం వస్తే దర్శకుడు తేజతో మళ్లీ పనిచేయడానికి సిద్ధమే. సీత పాత్రలోని భావోద్వేగాల నుంచి బయటకు రావడానికి చాలా సమయం పట్టింది. నాపై బలమైన ముద్ర వేసిన పాత్ర అది.

'క్వీన్' తమిళ రీమేక్ విషయంలో సెన్సార్ సమస్యలు తలెత్తాయని చెబుతున్నారు?

'క్వీన్' నాలుగు దక్షిణాది భాషల్లో రీమేక్ అవుతున్నది. తమిళంలో నేను కథానాయికగా నటించాను. ఒక్క తమిళంలో తప్ప ఎక్కడా సెన్సార్ సమస్యలు రాలేదు. చిత్ర బృందం ట్రిబ్యునల్‌ను ఆశ్రయించే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

ఈ మధ్య నిర్మాణ సంస్థను మొదలుపెట్టారు. ఎలాంటి సినిమాలు చేయబోతున్నారు?

ప్రస్తుతం చిత్ర నిర్మాణానికి దూరంగా ఉందామనుకుంటున్నాను. నేను అంగీకరించినా ప్రాజెక్ట్‌ల మీదనే దృష్టిపెడుతున్నాను. కథలు బాగా నచ్చితే సినిమాల్లో నిర్మాణ భాగస్వామ్యం గురించి ఆలోచిస్తాను.

దక్షిణాదిలో అగ్ర కథానాయికల్లో ఒకరిగా స్టార్‌డమ్‌ను ఆస్వాదించడం ఎలా అనిపిస్తున్నది?

నేను స్టార్‌హీరోయిన్ అని ఎప్పుడు అనుకోలేదు. ఇప్పటికి తొలి అడుగులు వేస్తున్నాననే అనుకుంటున్నాను. ఇంకా నేర్చుకోవాల్సింది చాలా వుంది. ఒక వేళ నన్ను ఎవరైనా సూపర్‌స్టార్ అంటే ఆనందపడతాను. ఈ ప్రయాణంలో నటిగా మరింత పరిణితి సాధించాను. కథల ఎంపికలో తెలివిగా ఆలోచించగలుగుతున్నాను. ప్రేక్షకులకు గుర్తుండిపోయే పాత్రలు చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నా. నటిగా కంటే సంస్కారవంతమైన మహిళగా గొప్పగా ఎదిగాననుకుంటున్నాను.

కొన్ని నెలల క్రితం మేకప్‌లేకుండా సోషల్‌మీడియాలో ఫొటోలు పెట్టారు. అలా ఎందుకు చేయాల్సి వచ్చింది?

సోషల్‌మీడియాలో అనేక ఫిల్టర్స్, ఎఫెక్ట్స్‌తో ఫేక్ ఫొటోల్ని ప్రచారం చేయడం ఎక్కువైపోయింది. మహిళలకు అందంపై ఉన్న భ్రమలు తొలగిపోవాలి. అందుకే అలా మేకప్ లేకుండా ఫొటోలు పెట్టాను. నా దృష్టిలో స్వచ్ఛమైన వ్యక్తిత్వంలోనే నిజమైన అందం ఇమిడి ఉంటుంది. విజయం వైపు నిజాయితీగా చేసే ప్రయత్నంలో అందం ఉంటుంది. మహిళలకు అందం ఒక్కటే కొలమానం కాదు. అందాన్ని, వ్యక్తిత్వాన్ని బ్యాలెన్స్ చేస్తూ జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలనే సందేశాన్నిస్తూ ఆ ఫొటోలు పెట్టాను.

'భారతీయుడు-2' చిత్రం నుంచి మీరు తప్పుకున్నారని వార్తలొస్తున్నాయి?

అలాంటిదేమి లేదు. కమల్‌హాసన్, శంకర్ వంటి లెజెండ్స్ సినిమా లో నటించడం అదృష్టంగా భావిస్తున్నాను. నవంబర్‌లో చిత్రీకరణ మొదలవుతుంది. 'భారతీయుడు-2' చిత్రం కోసం శారీరకంగా కూడా ఫిట్‌గా తయారవుతున్నాను. ఇక 'కాల్ సెంటర్' పేరుతో తెలుగు, హాలీవుడ్‌లో ఓ సినిమా చేస్తున్నాను. అందులో ఛాలెంజింగ్ పాత్ర చేస్తున్నాను.

కశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దుపై మీ అభిప్రాయమేమిటి?

దేశ ప్రజలందరూ కోరుకున్నదే అది. ఆర్టికల్ 370 రద్దు వల్ల కశ్మీర్ అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నాను. భూతల స్వర్గమైన కశ్మీర్‌లో టూరిజం వంటివి ఇంకా వృద్ధిలోకి వస్తాయి. అక్కడ శాంతి నెలకొల్పడానికి ప్రభుత్వ చర్యలు ఉపకరిస్తాయని అనుకుంటున్నాను.

ఎప్పుడైనా ఏదైనా జరగొచ్చు ..

విజయ్, పూజా

నటుడు శివాజీరాజా తనయుడు విజయ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఏదైనా జరగొచ్చు'. యాక్షన్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి కె.రమాకాంత్ దర్శకుడు. వెట్ బ్రెయిన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఈ నెల 23న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలను తెలియజేస్తూ 'యాక్షన్ కామెడీ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో స్క్రీన్‌ప్లే ఆసక్తికరంగా వుంటుంది. క్షణ క్షణం ఉత్కంఠను పంచుతుంది. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు తప్పకుండా నచ్చే చిత్రమిది. ఇటీవల విడుదలైన పాటలకు, టీజర్‌కు చక్కటి స్పందన వచ్చింది. చిత్రాన్ని కూడా అన్ని వర్గాల ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం వుంది' అని తెలిపారు. పూజా సోలంకి, శశిసింగ్ నాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో రవి, శివతేజ, వైవా రాఘవ, నాగబాబు, వెన్నెల కిషోర్, అజయ్‌ఘోష్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీకాంత్ పెండ్యాల, సినిమాటోగ్రఫీ: సమీర్ రెడ్డి, మాటలు: వికర్ణ, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: విజయ్ ప్రకాష్ అన్నామెద్ది, సహ నిర్మాత: సుదర్శన్ హనగోడు.

అభిరామ్, కృతిగార్గ్

రాహు రహస్యం

కృతిగార్గ్, అభిరామ్ వర్మ, కాలకేయ ప్రభాకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రాహు'. సుబ్బు వేదుల దర్శకత్వం వహిస్తూ ఏ.వి.ఆర్ స్వామి, శ్రీశక్తి బాబ్జీ, రాజు దేవరకొండలతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల చిత్ర ఫస్ట్‌లుక్ విడుదలైంది. దర్శకుడు సుబ్బు వేదుల మాట్లాడుతూ 'వినూత్న కథాంశాలతో కొత్త దర్శకులు సినిమాలు చేస్తూ తెలుగు చిత్రసీమలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. ఇది అలాంటి నవీన ప్రయత్నమే అవుతుంది. థ్రిల్లర్ కథాంశంతో ఆద్యంతం ఉత్కంఠను పంచుతుంది. రాహు ఎవరు? ఆ పేరు వెనుక ఉన్న రహస్యమేమిటన్నది ఆకట్టుకుంటుంది. ఫస్ట్‌లుక్‌కు చక్కటి స్పందన లభిస్తున్నది. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో సరికొత్త అనుభూతిని పంచే చిత్రమిది' అని తెలిపారు. చలాకీ చంటి, సత్యం రాజేష్, గిరిధర్, స్వప్నిక ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రవీణ్ లక్కరాజు, సినిమాటోగ్రఫీ: సురేష్ రగుతు.